# అనగనగా ఓ మంచికథ

2015



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 151

# కౌముది మాసపత్రికలో 2015 జనవరి నుంచి డిసెంబర్ వరకూ

# ప్రచురించబడిన అలనాటి ఆణిముత్యాలు

## విషయసూచిక


| ఏడాది | నెల | కథ పేరు | రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|---|
| 2015 | 01 | పరిసరాలు | వట్టికోట ఆళ్వారుస్వామి | 3 |
| | 02 | ఆ ఉ ఓలు | బుచ్చిబాబు | 8 |
| | 03 | కామీ స్వతాం పశ్యతి | యస్ గంగాధరం | 16 |
| | 04 | చలి రాత్రిలో | కె చిరంజీవి | 23 |
| | 05 | నేను చూసిన నక్షత్రం | డా కె వివేకానంద మూర్తి | 25 |
| | 06 | జీపు కదిలిపోయింది | ఉషారాణి భాటియా | 30 |
| | 07 | ఆఫీసరూ లీవివ్వవూ!? | మజుందార్ | 36 |
| | 08 | ఎవరు పసివాళ్ళు? | శ్రీ వి వి యస్ రామదాసు | 41 |
| | 09 | సులోచన | ఎస్ వి రంగారావు | 47 |
| | 10 | బహిష్కృతుడు | మాధవపెద్ది గోఖలే | 52 |
| | 11 | తీరని సమస్య | కొడవటిగంటి కుటుంబరావు | 57 |
| | 12 | బొమ్మల చొక్కా | పంతుల జోగారావ్ | 60 |

# పరిసరాలు

## వట్టికోట ఆళ్వారుస్వామి

## (ప్రవంతి 1955, సెప్టెంబర్ సంచికనుంచి పునర్ముద్రణ)

అయిదురోజులనుండి అనుకుంటున్నప్పటికీ బస్సు బయలుదేరే టైముకు అరగంటకు ముందే హడావుడిగా స్టేజ్ కు చేరుకున్నాను. బస్సు బయలుదేరటానికి ఎక్కువ ఆలస్యం లేదని తెలిసింది. లగేజ్ సామాను వ్యవహారములో ప్రయాణీకులకు డ్రైవరుకు జరుగుతున్న సంప్రతింపులను, వాదనలను ప్రేక్షకుడిగా వింటున్న కండక్టరుకు కనబడకుండానే ఆతని చేతిక్రిందనుండి దూరి మొదటిసీటుపై కూర్చున్నాను. మూటలు మోసిన కూలి అందరివద్ద పైసలు వసూలుచేసుకొని, ఓమాదిరిగా నన్నూ, నా చేతిసంచినీ చూస్తూ ఏదో గొణుగుకుంటూ దిగిపోయాడు. అతనికి అణా డబ్బులు నష్టంకలిగించిన నా చేతిసంచినీ, ఆ విధమైన సంచిని తయారు చేసి, కూలివాండ్ల నోట్లో మన్ను కొట్టిన ఫ్యాక్టరీవారి స్వార్థాన్ని గురించి ఆలోచిస్తూ పరధ్యానంలో వున్న నన్ను "ఇక్కడ టప్పా సంచులు పెట్టాలె, మీరు వేరే సీటుపై కూర్చోండి" అంటూ కండక్టరు టిక్కట్లను సదర మొదలుపెట్టాడు.

"మనుషులు కూర్చునే చోట టప్పాసంచులేమిటి?" కండ్లతో అడిగాను.

"చదువుకున్న వాడికింతకంటే ఏం చెప్పను." అన్నట్లు కండక్టరు ఒక చూపు విసరి, తన పనిలో లీనమైనాడు.

తగాదా ఎందుకని సీటు మార్చాను.

కండక్టరు టిక్కట్లు ఇవ్వసాగాడు. ఒక్కొక్క ప్రయాణీకునితో ఒక్కొక్క విధంగా సరసాలాడుతున్నాడు. పిల్లలకు పంతులుగా, వృద్ధులకు మనుమనిగా ఆడవాండ్లకు అన్నగా, సమవయస్కులకు తమ్మునిగా ప్రవర్తిస్తున్నాడు. అతని సంభాషణను గమనిస్తున్నవారు ఎవరికి వారే కొంచెం సేపు ఆనందపడి, తరువాత ఒకరినొకరు గంభీరంగా చూసుకొని మందహాసాలు కురిపిస్తున్నారు.

బస్సు కదిలింది. టప్పా సంచుల స్థలములోని రెండు సీట్లను ఆక్రమించుకొని కండక్టరు స్టేట్మెంట్ రాస్తున్నాడు. ఒకసారి వెనకకు తిరిగి నా వైపు భావగర్భితంగా చూచాడు.

"ఏవి టప్పాసంచులు?" అన్నట్లు నేను గుడ్లు మిటకరించి చూచాను.

"ఈ బస్సులో టప్పా ఉండదట. నేను ఈ పనికి కొత్తవాణ్ణి. అందులో ఈ రూటుకు యింకా కొత్త" అన్న అతని మాటల్లో "క్షమించాలి, మిమ్ము, కూర్చున్న చోటునుండి లేపాను" అని ధ్వనించింది.

"ఫర్వాలేదు" అన్నాను నేను.

స్టేటుమెంటు బాక్సులోనుండి తమలపాకు బీడాను తీసి నోట్లో కుక్కుకొని "బుద్ధిలేక ఈ పనిలోకి దిగాను, బుద్ధిలేక కాదు, విధిలేక. నేను పుట్టి పెరిగింది హైద్రాబాదులో. ఇంచుమించు ఉర్దూ నా మాతృభాష అయింది. నా మాతృభాషలో ఓనమాలు కూడా చదివి ఎరుగను. ప్రతి బడి పంతులూ ప్రాంతీయ భాషా పరీక్షలో నెగ్గాలని ప్రభుత్వమన్నది. ప్రాంతీయ భాషలో నెగ్గే ధైర్యంలేక ఉద్యోగమే వదులుకున్నాను. అదే సమయానికి ఆర్.టి.డి. హర్తాళు ప్రారంభమైంది. దానితో నా అదృష్టం పండి నాకు కండక్టరు ఉద్యోగం దొరికింది." అని సంభాషణ కొనసాగించాడు.

బస్సు ఆగింది. ఒక ప్రయాణీకుడు బస్సు ఎక్కాడు. కండక్టరు 12 అణాలు అడిగాడు అతడ్ని. "ఎనిమిదణాలేగా?" అని ప్రయాణీకుడు ఆశ్చర్యపడ్డాడు.

"సరే ఎనిమిది అణాలే యివ్వు" అన్నాడు కండక్టరు.

"కిరాయిసంగతే తెలియకపోతే కొలువెట్లా చేస్తావు?" ఒక ప్రయాణీకుడు కండక్టరుతో అన్నాడు.

"తెలియకేం గాని, ఈ డిపార్టుమెంటులో ఎన్ని అవకతవకలు చేస్తే అన్నాళ్ళు ఉద్యోగంలో ఉంటాం. లేకపోతే ఒక్క రోజులో ఉద్యోగం ఊడిపోతుంది." అని కండక్టరు స్టేటుమెంటు వ్రాయసాగాడు. ప్రశ్నించిన ప్రయాణీకుడు ప్రక్క వారిని చూసి ఫక్కున నవ్వాడు.

మళ్ళీ బస్సు ఆగింది. ఒక ప్రయాణీకుడు దిగుతుంటే ఆతని టికట్టు అడిగి తీసుకొని, అప్పుడే ఎక్కుతున్న ప్రయాణీకునికా టికట్టు యిచ్చాడు కండక్టరు. ముందుభాగంలో కూర్చుని ఉన్న మా అందరిని ఒకసారి పారచూచి, స్టేటుమెంటు వ్రాత ముగించుకొని, మమ్ముల సంభోదిస్తూ "నేనేం చేశానో మీరంతా చూచారుకదూ? కాని మీకేమీ అర్ధంకాలేదు. అవును ఎందుకర్థమవుతుంది? నేనిప్పుడు చేసిన పని ప్రతి కండక్టరూ చేస్తుంటాడు. కాని ఈ విధంగా చేయడు. ఏదో పనివున్నట్టు కిందకిదిగి, పాతటిక్కటును ఇచ్చి, పైసలు జేబులోనింపి ఎరుగనట్టు ఎక్కి కూర్చుంటాడు. నేనేమో మీ అందరి ముందర ఆవిధంగా చేస్తున్నాను. అంతే బేధం. ఇంత సాహసమేమిటని మీకాశ్చర్యం కలుగవచ్చు. చెడ్డపని చేయడమే తప్పు. అందులో రహస్యంగా చేయడం మరీ తప్పు. అయినప్పుడు బహిరంగంగా తప్పుచేయడమంటే విధిలేక అని దాని అర్ధం" కండక్టరు ఎడతెగకుండా ఉపన్యాసం సాగించాడు.

మళ్ళీ బస్సు ఆగింది. చేతిలో పుస్తకాల సంచితో ఒక విద్యార్థి బస్సు ఎక్కాడు. కండక్టరు అతనినెత్తిన చేయినిమిరి, "నేను బడిపంతులుగా ఉన్నపుడు ప్రతిరోజు ఇటువంటి పిల్లలతో ఆనందంగా ఉండేవాడ్ని. ఆరోజులు తలచుకుంటే కండ్లకు నీళ్ళు తిరుగుతాయి. ఈ కొలువులో జీతమెక్కువే. అందులో సందేహం లేదు. పాపం, నా భార్య నేను ఎక్కువ సంపాదిస్తున్నానని ఉప్పొంగిపోతున్నది. అమాయకురాలు. నేను కొంత కూడాబెడుతున్నానని కూడా అనుకుంటున్నది. కాని బడిపంతులుగా ఉన్నప్పుడున్న నానీతినీ, ఈ కొలువులో దిగజారిపోతున్న నా జీవిత విధానాన్నీ పోల్చుకుని నేను పడే ఆవేదన ఆమెకేమి తెలుస్తుంది." మళ్ళీ మొదలుపెట్టాడు కండక్టరు.

విద్యార్థివైపు తిరిగి, "బాబూ ! టికెటు పైసలివ్వు" టికెటు అందిస్తూ అడిగాడు. విద్యార్థి యిచ్చిన రూపాయను సంచిలో వేసికొని తిరిగి సంభాషణ సాగించాడు. నాకు నెలకు రు.100_0_0 లు జీతమైనా 75_0_0 రు. ల కంటె ఎక్కువ ఎన్నడూ నేను జీతం పొందలేదంటే నమ్మండి. ఎప్పుడూ, ఏదో ఒక అవాంతరం వచ్చి నెత్తిన పడేది."

"ఎనిమిది అణాలు తిరిగి రావాలె" విద్యార్థి అడిగాడు.

"చూచారా ! మాటల్లో మరచే పోయాను" అంటూ కండక్టరు సంచిలో చేయివేసి ఎనిమిదణాల బిళ్ళ ఒకటి చేతిలో పెట్టాడు.

"ఇది కల్దారు. నాకు హలీ ఎనిమిదణాలే రావాల్సుంది."

“ఈ విధంగా అణాలు, పావులాలు పోతుంటాయి, వస్తుంటాయి. ఒకప్పుడు ఎక్కువ, ఒకప్పుడు తక్కువ. మొత్తంమీద నష్టమే కాని లాభం ఉండదు” అని ఎనిమిదణాల హాలీ తిరిగి ఇచ్చివేశాడు.

మళ్ళీ బస్సు ఆగింది. ఇద్దరు దిగారు, ముగ్గురు ఎక్కారు. తన చేతిలోని ఆరుటికట్లు కొత్తప్రయాణీకులకంటగట్టి ఒక్కటి మాత్రము కొత్త టిక్కటు ఇచ్చాడు.

“ఊ... అయితే మన సంభాషణ ఎక్కడ ఆగిపోయె” అని కండక్టరు ఇంకా ఏమో చెప్పబోతుండగా, “ఈ మధ్య కండక్టర్లు చేసే ఇటువంటి పనులను ప్రజలు కనిపెట్టి పట్టివ్వాలని ప్రభుత్వం వారొక ప్రకటన చేశారు కదా ! అయినా మీరింత బాహాటంగా ఈ విధంగా చేస్తున్నారేం” ఒక ప్రయాణీకుడు ఆదుర్దాగా అడిగాడు.

“అదే ! మీలో ఎవరైనా అడుగుతారో లేదోనని ఇందాకటినుంచి ఎదురు చూస్తున్నాను. రహస్యంగా చేస్తే తప్పని, బహిరంగంగా చేస్తే విధిలేక అని మొదలే చెప్పితినిగా, అదిగాక ఎవరిపని వారు సక్రమంగా చేస్తే బయటివాడెవడూ పరీక్షించాల్సి ఉండదు. ఇంకోవిషయం చెప్పేవారు, చెప్పినట్టు చేస్తే అంతా బాగానే ఉంటుంది. కాని చెప్పడానికే చెప్పుతున్నారు మరి – ఫలితమేముంటుంది? ఇక అలవాటుపడ్డ చెడ్డవానినెవరూ ఎదుర్కొన జాలరు కూడ. కండక్టర్ల తప్పు పట్టుకోవాల్నట. నిజమే మరి ఆ చెప్పేవారినెవరో పట్టుకునేది? కండక్టర్ల ఇబ్బందులు, వారిపై రోజు కలిగే ఒత్తిడిని గురించి ఎవరైనా ఆలోచించారా? అంటే కండక్టర్లంతా బుద్ధిమంతులని ఇతరులంతా చెడ్డావాళ్ళని నా అభిప్రాయం కాదు. కాని నియమబద్ధంగా, నీతిగా బ్రతకతలచుకుందామనుకున్నా వీలు లేదే. అందరితో పాటు ప్రవాహంలో కొట్టుకు పోవాల్సిందే. నేను కొలువులో చేరిన ఈ కొద్దికాలంలో పడ్డ అవస్థలు చెప్పటం మొదలుపెట్టితే రోజులు చాలవు.

“మా నాయన నీతికి కట్టుబడి ఎన్నో అవస్థలకు గురియైనాడు. తోటివాండ్లు వేలు సంపాదించారు. మా నాయన చచ్చేవరకు బీదతనంతో జీవితం గడిపాడు. బ్రతికినన్నాళ్ళు నన్ను ఎంతో జాగ్రత్తగా పెంచాడు. “నీతి ఒకటే తరగని సంపద” అని ఎల్లప్పుడూ అంటూండేవాడు. మేము బీదవాళ్ళమైనా మా నాయన గొప్పతనానికి, నా బుద్ధికి మెచ్చి, ఒకరు, ఎంతటి ఘరానా సంబంధాలువచ్చినా లెక్క పెట్టక తనబిడ్డను నాకిచ్చి పెండ్లిచేశాడు.

నా తండ్రి చచ్చిన తర్వాత నాకు బడిపంతులు కొలువు దొరికింది. నా తండ్రి హితవును అక్షరాలా అమలుచేసే అవకాశం కలిగిందని ఎంతో సంతోషించాను. ఐదుఏండ్లు బడిపంతులుగా అడుగడుగున నీతినే ఆశయంగా పెట్టుకొని జీవించాను. కాని విధిలేక ఈ కొలువులో చేరాల్సివచ్చింది. అయినా నీతికి కట్టుబడి ఉండాలని సర్వవిధాలా ప్రయత్నం చేస్తూనే ఉంటాను. కాని అప్పుడప్పుడు జరిగే సంఘటనలకు లొంగిపోక తప్పడంలేదు. నాకోసం కాకపోయినా, నాతోడివారి తొక్కిడికైనా బలికాక తప్పడం లేదు.”

“రెండు రోజులకింది సంగతే చూడండి. ఆనాడు ఏమీ గిట్టలేదని దారి పొడుగునా డ్రైవరు ఒకటే గొణుగుడు. తుదకు ఆ సాయంత్రం బయలుదేరనని భీష్మించి కూర్చున్నాడు. గట్టిగా అడిగితే బస్సు చెడిపోయిందని కాళ్ళు బారచాపాడు. నేను నిరాశ చేసుకొని ఆ రాత్రి హోటల్లో బసచేసి నిద్రపోయినాను. డ్రైవరు మధ్య రాత్రి నన్ను హడావిడిగా లేపి హైద్రాబాదు వెళ్ళాలని బలవంత పెట్టాడు. నేను ఇంకా ఏమీ అనకముందే బలవంతంగా నన్ను బస్సువరకూ తీసికెళ్ళాడు. బస్సు ఆకారం చూసి అదిరిపోయాను. కట్టెల లారీగా కనపడ్డాది. “ఇదేమిటని” ఆశ్చర్యంతో బస్సువద్దకు వెళ్ళే వరకు బస్సులోనుండి ప్రయాణీకుల అలికిడి వినబడింది. కప్పిన తాడును తీసి లోపలికి చూసేవరకు ఊపిరి సలుపకుండ ఆడామగ ఏకంగా కూర్చొని ఉన్నారు. నా ఒళ్ళు చెమటలు పట్టింది. కిందికి దిగబోతుండగా బస్సు మెట్ల దగ్గరే డ్రైవరు ఎదురు తిరిగి లోపలికి తోసుకుంటూ తీసికెళ్ళి తనప్రక్క సీటుపై కూర్చుండబెట్టి బస్సును పోనిచ్చాడు. నాకు ఏమీ తోచలేదు. ఒళ్ళు మరచి ఆలోచిస్తున్నాను. కొంతదూరంపోగానే బస్సు ఆగింది. ఆపడానికి కారణం తెలియక ఆతురతతో నలువైపులా పరికించాను. ప్రక్కన చెట్టుకింద ఉన్న టీ దుకాణం గుడిసెలోనుండి చలికోటు తొడుగుకొన్న ఒకడు మెల్లగా వచ్చి డ్రైవరువైపు నిలుచున్నాడు. డ్రైవరుతో ఏమో మాట్లాడి తనచేతిలోని టార్చిని

నావైపు కేంద్రీకరించాడు, "అసలే వణుకుతున్నాడు, ఇంకా మీరు కండ్లు కనపడకుండా చేశారు" అని డ్రైవరు నవ్వాడు. "ఇంకా నిద్రలోనుండి మేల్కొలేదా?" అని ఆ వ్యక్తి పెద్దగా అన్నాడు. ఆ ధ్వనితో అతడు బస్సు ఇనస్పెక్టరని తెలిసికొన్నాను. "నమస్కారమండి" అని కండ్లు తుడుచుకున్నాను.

డ్రైవరు జేబులోనుండి రూపాయిల మడతదీసి కొన్ని ఇనస్పెక్టరుకు, కొన్ని నాకు ఇచ్చి, కొన్ని తన జేబులో వేసి "ఇక వెళ్దాం" అని క్లచ్ తొక్కాడు. నా ఒళ్ళంతా చీమలు బాకినట్లయింది. నాకందించిన రూపాయలు తిరిగి డ్రైవరు మీద పడవేసి "నీ వద్దనే ఉంచుకో" అన్నాను. "పిచ్చివాడు" అని ఇనస్పెక్టరు అనగానే బస్సు బయలుదేరింది.

ఇష్టమొచ్చిన చోటల్లా ఆపుతూ, నాకు హితబోధలు చేస్తూ డ్రైవరు బస్సును తోల్తున్నాడు. "మిత్రమా ! ప్రపంచమేమిటో ఇంకా నీకు తెలియలేదు. పిల్లలకు చదువు చెప్పి, చెప్పి పిల్లవాడవైపోయావు. నీ ఆదర్శాలు అట్టే చాలా రోజులు నడువవు. నీవు గడ్డం పెంచి, జపమాలచేతబట్టి ఏదైనా చెట్టుకిందనో, గుట్టపైనో కూర్చున్నావంటే నీవు చెప్పేవన్నీ ఆనందంగా ఉంటాయి వినడానికి. ఆర్.టి.సి. బస్సు కండక్టరుగా నీమాట ఎవరూ వినరు. నీకంటే ఎన్నో నీతులు చెప్పి, మాకంటే ఓ అడుగు ముందుకు వేసినవాండ్లనెందరినో చూచాను. నానెత్తీ, గడ్డం నెరిసింది" అన్నాడు డ్రైవరు." అని కండక్టరు సంభాషణను చాలించి ఏదో మరిచినట్టు స్టేటుమెంటును సరిచూచుకున్నాడు.

"డ్రైవరు చెప్పిందాంట్లో ఆబద్ధమేమీ లేదు. కొద్ది రోజుల్లోనే నీకు తెలియకుండానే నీవు మారిపోతావు" అని గంభీరంగా నేను అన్నాను.

"మీరన్నది నిజమైతే కావచ్చు. కాని అది చచ్చిందాంతో సమానం" అని కండక్టరు ఇంకొక తమలపాకు బీడాను నోట్లో కుక్కుకున్నాడు.

ఇంతలో డ్రైవరు బస్సు స్పీడుని తగ్గించి హారన్ మోగించాడు. కండక్టరు డ్రైవరువైపు తలవంచి ఏదో మాట్లాడాడు. బస్సుతిరిగి వడిగాపోతున్నది. కండక్టరు ప్రశ్నార్థకంగా నావైపు చూచాడు. "ఏమిటి సంగతి" అన్నట్లు నేను కనుబొమ్మలు ఎగరవేస్తూ చూచాను. "నే చెప్పిన ఇనస్పెక్టరు చెకింగ్ కు వస్తున్నాడు" అని కండక్టరు ముసి ముసిగా నవ్వుతూ నిర్లక్ష్యంగా రోడ్ ముందుభాగాన్ని చూస్తున్నాడు.

ఇనస్పెక్టరు సమీపించగానే బస్సును ఆపి ఉత్సాహంతో "ఏమండీ! ఏమిటి విశేషాలు?" అన్నాడు డ్రైవరు. ఇనస్పెక్టరు పెద్దగా నవ్వాడు. కండక్టరు చీదరించుకున్నట్లు ముఖం ఓవిధంగా చేసుకున్నాడు.

ఇనస్పెక్టరు వికసించిన తనముఖాన్ని ప్రయత్నపూర్వకంగా మాడ్చుకొని "కిందికి దిగరాదూ?" కండక్టరును చూస్తూ అన్నాడు.

కండక్టరు దిగగానే మాటల్లోకి దింపి బస్సుకు కొద్దిగా దూరం తీసికెళ్ళాడు. ఇనస్పెక్టరు ఏదో నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తుంటే, కండక్టరు విముఖతను చూపిస్తున్నట్లు వారి తలఊపులు, చేతులు తిప్పటం పట్టి అర్థమవుతున్నది.

ఇనస్పెక్టరు జేబులోనుండి కొన్ని రూపాయలనోట్లు తీసి బలవంతంగా కండక్టరు చేతిలో పెట్ట ప్రయత్నిస్తున్నాడు. కండక్టరు ఏమీ మాట్లాడక విచారంతో తల నేలకు వేశాడు.

తర్వాత ఇద్దరూ మౌనంగా బస్సువద్దకు జేరుకున్నారు. ఇనస్పెక్టరు బస్సుమెట్లమీద కూర్చున్నాడు.

నేను కండక్టరును పరీక్షగా చూస్తున్నాను. అతడు ప్రయత్నపూర్వకంగా ఇంకించుకుంటున్న కంటినీటి జాడలు నాకు కనిపించాయి.

కండక్టరు ప్రయాణీకులను లెక్కించడం ముగించి వచ్చి నా వద్ద నిలుచొని "నా మనస్సు చచ్చిపోవడానికి మీరన్నట్టు అట్టే కాలం పట్టాదు. ఇక్కడికే నదుంవరకు దిగబడ్డాను" అన్నాడు.

కండక్టరు వెళ్ళి ఇనస్పెక్టరు ప్రక్కకే నిలుచున్నాడు.

"నలుగురితో నారాయణ, అంటక ముట్టక అన్నింటికి దూరంగా ఉంటే ఏది ఎట్లున్నా మనసుకు మాత్రం శాంతి ఉండదు. మనశ్శాంతికోసమైనా మంచిని చెడుపును ఒకేవిధంగా ఆదరించాలె" అని చెక్కింగు ఇనస్పెక్టరు హితోక్తులు పలుకుతున్నాడు.

పరుగెత్తుతున్న చెట్లను, చేలను, చెరువులను, గుట్టలను ఒళ్ళుమరచి దిగాలుగా చూస్తున్నాడు కండక్టరు.

ఇంతలో మా ఊరు వచ్చింది. కండక్టరుకొక నమస్కారం, మనసులో ఇనస్పెక్టరుకొక తిరస్కారం వదిలి బస్సుదిగి ఇంటికి చేరుకున్నాను.

★★★★★★

# ఆ ఉ ఓలు

## బుచ్చిబాబు

## (యువ 1963, ఏప్రిల్ సంచికనుంచి పునర్ముద్రణ)



ఈ వృత్తాంతం ఏడెనిమిదేండ్ల క్రితం నాటిది ఇన్నాళ్ళూ వూరుకుని, ఇదంతా ఇప్పుడెందుకు వ్రాయాలనిపించిందో నిజానికి నాకే తెలియదు వయస్సు పెరిగిన కొద్దీ మనస్సు వెనకటి మనుషులమీదకీ, స్థలాలమీదకీ పోతూండడం వల్లనా ? సంభవించేప్పుడు అనుభవానికి స్వరూపం వుండదు. అప్పట్లో అందలి ప్రయోజనం మనస్సులో నాటుకోకపోవొచ్చు. కాని కాలం జరిగాక అదే ఒక జ్ఞాపకంగా అవతరించి, ప్రయోజనాల పరిశీలనకి పురిగొల్పొచ్చు. అసలీ వృత్తాంతంలో ఏదన్నా ప్రయోజనం వుందా? లేక ఊరికే, కాలక్షేపానికి, జ్ఞాపకం చేసుకుని, మానసికంగా ఊహలో విర్రవీగుదామనా, యీ రచన? ‘నిన్ను నువ్వు తెలుసుకో’ అని ప్రపంచ తత్వాలు బోధిస్తున్నాయి ‘నువ్వు ఫలానా’ అని ఆధునిక విజ్ఞానశాస్త్రం గాని, మానసిక శాస్త్రంగాని, యీనాటివరకూ స్పష్టంగా తేల్చలేకపోయినప్పుడు, నేనెందుకీ వృత్తాంతం వ్రాయదలిచానో కారణాలు తేల్చలేక పోతున్నానంటే. పాఠకుడు క్షమించలేక పోయినా, నన్ను నేను క్షమించుకోగలను.

ఏడెనిమిదేండ్ల క్రితం, ఆ ఊళ్ళో దూరపు చుట్టం తాలూకు వారి పెండ్లి. ముఖ్యంగా వెళ్లవలసిన పెండ్లికాదు ఆ ఊరిప్పుడెల్లా వుందో చూడాలన్నది వొక కారణం నే వెళ్ళడానికి ఆ ఊరిని బాగా ఎరుగుదును. నా చిన్నప్పుడు మా నాన్నగారు అక్కడ కొంతకాలం పనిచేశారు. నా బాల్యం అక్కడ గడిచింది. ఆ కాలవగట్టు చెరువులో తామరాకులు, పొలాల్లో గడ్డివాములు, స్కూలు తణిఖీ జరుగుతున్న సందర్భంలో కాల్చిన బాణాసంచా ఫలితంగా తగులబడి మా పిల్లలందరికి మహదానందాన్ని సమకూర్చిన పాకల స్కూలు, గుడారం సినిమా, నటీమణుల బృందం వరుసగా నెలరోజులు ఆడిన నాటకాలు, వంతెన దిగువున సోడా కొట్టు. ‘చెడుగుడి’ ఆడిన కరణం గారింటి ప్రక్కన బందిల దొడ్డి – ఇవన్నీ మళ్ళా చూడాలనిపించింది.

ఈ మారు నే వెళ్ళినప్పుడు ఆ వూరు మారిపోయింది. కొత్త స్కూలు భవనం లేచింది సోడాదుకాణం ఐస్ పార్లరైంది కరణంగారింటి పక్క బందిల దొడ్డిలో కమ్యూనిటీ హాలవతరించింది. చెరువు గట్టున పార్కు, రేడియో సెట్టూ, ప్రక్కన భజనమందిరం, కాలవగట్టున రైస్ మిల్లు, ఆయిల్ మిల్లు, పుల్లలడితి, లారీల ఖార్కానా, కొత్త సినిమాహాలు, ఎలక్ట్రిక్ దీపాలు. వీటితో బాగా మారిపోయి, నగ్నంగా వున్న ఆ ఊరు దుస్తులు ధరించుకున్నట్లుగా వుంది..సగం కుట్టిన దుస్తులు.!!

పెండ్లి హడావిడి అయ్యాక, సాయంత్రం అల్లా షికారుకి బైలుదేరినప్పుడు, ఆ ఊళ్ళో మరొక విశేషం గమనించాను. పేవ్ మెంట్ మీద పాత పుస్తకాల అమ్మకం. ఈ పాత పుస్తకాల దుకాణాలు నాగరికత వేసే నిచ్చెనలో చివరిమెట్టు. ప్రభుత్వ కార్యాలయాలు, డవాలీ బంట్రోతులు, పిండిమరలు, లారీలు, సినిమాహాలు, కాఫీ హోటలు, ఫ్యాన్సీ సామాను కొట్టు, కర్మాగారాలు, ఇవన్నీ బస్తీలనుండి దిగుమతి అయిన పారిశ్రామిక నాగరికత చిహ్నాలైనా పాత పుస్తకాల షాపుతోగాని, ఆ నాగరికతకి హృదయం సమకూరదు. అదెంత కుళ్ళిన, మాసిన, చిరిగిన హృదయం అయినా సరే బొంబాయి, కలకత్తా, లండన్, న్యూయార్క్, పారిస్ నగరాల ఆయువు పట్లుట పాత పుస్తకాల షాపులు. సాహితీ సమాజాల బహూకృతుల నందుకున్న ఉత్తమ గ్రంథాలన్నీ వీటిల్లోకి చేరుకుంటాయిట. పదిపుటల గీతికా సంపుటిని లక్ష కాపీలు ప్రచురించి, అవి అమ్ముడవక, ఆరో అంతస్థు మీదినుంచి దూకి ఆత్మహత్యకి తలపడిన ప్రచురణకర్తకి, యీ షాపులు శరణ్యం ఇస్తాయి. సాహిత్య రంగంలో ప్రతిష్ట, పలుకుబడి, స్థానం, నిర్ణయించడానికి, పాతపుస్తకాల దుకాణం సూదంటురాళ్ళు. పేవ్ మెంట్ మీది దుకాణం దగ్గరకు, వొక గ్రంథం చేరిందంటే, ఆ గ్రంథం రచయిత సాహిత్య జీవనం పరిసమాప్తమైందని భావించవొచ్చునట. చిత్రం పేవ్మెంట్ షాపుల్లోకి ఒక పుస్తకం వొచ్చిందంటే, దాన్ని వ్రాసినాయన పరపతి హెచ్చినట్టుకూడా భావించ వొచ్చునట. ఈ తికమకలు, తఫిసీళ్ళు నాకర్థం కావు. ఈ సెకండ్ హాండ్ పుస్తకాలు ఎవరు, ఎందుకు, ఎట్లా అమ్ముతారో నాకు తెలియదు. ఎవరు, ఎందుకు, ఎట్లా కొని వ్యాపారం సాగించి, అంతర్జాతీయ పుస్తక వ్యాపార రంగంలో ప్రముఖ వ్యక్తులుగా చలామణి అవుతారో నాకు తెలియదు. కాని, మేధావులు, ప్రముఖ వ్యక్తులు, ఏ పనిమీద ఏ పెద్దపట్నం సందర్శించినా, వొచ్చేముందు, సెకండ్ హాండ్ పుస్తకాల షాపు దర్శించకుండా మాత్రం రారుట. కొత్త పుస్తకాల షాపులు ఎన్నోవుండగా పాత షాపులకెందుకు వెళ్ళాల్సి వస్తుందో, పుస్తక ప్రియులు చెప్పగా విన్నాను. ఇతరత్రా దొరకనివీ, అపూర్వమైనవీ, ఎన్నాళ్ళనుంచో నువ్వు కావాలనుకుంటున్నవీ, అప్రయత్నంగా, ఈ షాపుల్లో దొరుకుతాయేమో చూద్దామనే, యీ పెద్దలందరూ, వాట్లమీదికి ఎగబడ్డం అట.

ఆ వూళ్ళో రోడ్డు ప్రక్కన చాపమీద పరిచిన పాతపుస్తకాల వ్యాపారసంస్థను చూసి ఆశ్చర్యపడ్డాను. ఆ వూళ్ళో పుస్తకాల మాట అటుంచి, పత్రికే కొని చదివే వారు లేరనుకున్నాను గదా, యింక యీ పాత పుస్తకాలను కొనేటందుకెవరుంటారు? స్కూలు, కాలేజీ విద్యార్థులు, 'టెక్స్టు బుక్కులు' ఎల్లానూ కొత్తవి పైనుంచి తెప్పించుకుంటారుగా? ఈ ఊళ్ళో ఈ పేవ్ మెంటు మీద పాత పుస్తకాల ప్రదర్శన ఆవశ్యకత ఏమిటి అని ప్రశ్నించుకుంటూ అక్కడికి చేరాను.

పుస్తకాలు ఈతాకుల చాపమీద పరిచి వున్నాయి. మధ్యన వొక గల్లాపెట్టి లాంటిది వుంది, గజందూరంలో ఎలక్ట్రిక్ దీప స్తంభం మడిచేసిన వొక గొడుగు, మిగతావి పాత పుస్తకాలు. అవన్నీ నిజంగా పాత పుస్తకాలే పాతవే కాదు ప్రాచీనమైనవి కూడా. అన్నీ తెనుగు గ్రంథాలే కొన్నింటికి అట్టలే లేవు, పమిటకొంగులేని చీరలా కొన్నింటికి మధ్య కుట్టిన కంతలు తప్ప దారం లేదు. కొన్ని తుదిమొదళ్ళు లేని, పుస్తక కళేబరాలు, కొన్నింటి పుటలు, కదిపితే పొడుంగా విడిపోతున్నాయి. కొన్నింటిలో అచ్చు కనిపించడం లేదు. మరికొన్ని లెదర్ బైండింగ్ లో వున్నా యమధర్మ రాజు చర్మంలా వాటి లోపల పుటల్లో సాలీళ్ళు, బొద్దింకలు, నెమలీకలు, ఈగలు, దోమలు, వీటి కళేబరాలు, పురావస్తు పరిశోధకుడికి పిచ్చెత్తించేవిగా వున్నాయి. ఎండకి ఎండి, వానకి తడిసి, కొనవూపిరితో పడివున్నాయి చాలా పుస్తకాలు. అక్కడ వున్న కొన్ని పుస్తకాల పేర్లు 'ముకుంద విలాసం'. కస్తూరి రంగకవి 'సాంబ నిఘంటువు', బహుజనపల్లి సీతారామా చార్యులుగారి 'ప్రసన్న పారిజాతం'. 'అలఘు కౌముది' ( అందమైన పేరు) మంత్రి ప్రగడ భుజంగరావు గారి 'ఉత్తరరామ చరిత్ర' ఆ పెద్ద పుస్తకం క్రింద కన్ను మీటుతున్నది దాసు

శ్రీరామ పండితుల వారి 'తెలుగునాడు' అన్న కావ్యం పుటలు తిప్పి చూశాను. బ్రాహ్మణ శాఖలు మాట్లాడే వ్యవహారికాన్ని అనుకరిస్తూ 'ఆష్షే' 'సూస్సివషే' 'భలే చౌడషే కాదషే' లాంటి ఉదాహరణలున్నట్లు ఇప్పటికీ జ్ఞాపకమే!

ఆంగ్లకవి విలియమ్ కూపర్ రచించిన జాన్ గిల్పిన్ అను హాస్యకావ్యానికి 'దుర్మార్గ చరిత్రము' అన్న తెలుగు అనుసరణ నన్నాకర్షించిన మరో పుస్తకం. దౌల్తాబాదు హనుమాయమ్మ గారి 'మన్వంతరము'. గంగతపల్లె శంకరరావుగారి 'భారత సారము' అను గద్యము, గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు అబ్రహామ్ లింకన్ గూర్చి వ్రాసిన 'విస్మృత రాజకవి' అను గ్రంథం. 'వైశాఖ' పత్రికలు, బైండు చేసిన సంపుటాలు, అవటపల్లి నారాయణరావుగారి 'విశాలాంధ్రము' సీరము సుభద్రమ్మ గారి నవల 'జాగిలం' ఇంకా 'త్రిపురాంతక శతకం', 'కాశీమజిలీలు'. మూడవ భాగం.. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ ఇట్లాంటివి అక్కడున్న పాత పుస్తకాలు అవన్నీ యాభై అరవై ఏండ్లనాటి పుస్తకాలు. వాటిని గురించి నాకేమీ తెలియదు. వాటిల్లో దేన్నీ నా జీవితంలో చదవను. కాని అవి వున్నాయని తెలుసుకుని, వాటి వెనుక వున్న తెలుగు సాహితీ సంప్రదాయాన్ని తల్చుకుని ఆనాటి రచయితల్ని అభినందించకుండా వుండలేను. ఎన్నో చెత్త పుస్తకాలు వొస్తేనేగాని, వొక మంచి పుస్తకం రాదంటారు. సమకాలిక గ్రంధాల విలువల పరిశీలనకి అవి గీటురాయి. కాని వాటిని చెత్తపుస్తకాలు అనడానికికూడా నాకు అర్హతలేదేమో. ఆ పుస్తకాలలో వొస్తువు మీద, అవి వ్రాసిన వారి మీద మనస్సుపోవనారంభించింది. ప్రస్తుతాన్నుండి, వెనకటి రోజులకు పారిపోవాలనిపించింది. నాకా వూళ్ళో కర్మాగారాలు, విద్యుత్ దీపాలు, మరలు, లారీలు, సిమెంట్ కట్టడాలు నచ్చలేదు. బాల్యంలోనే ఎరుగున్న చెరువులో తామరాకులు, కాలవలో గేదెలని కడుగుతూ, గేదెపై స్వారీ చేస్తూ పాడుకుంటున్న పశువుల కాపరీ, శ్రీరామనవమినాడు పందిట్లో హరికథలూ, మర్రిచెట్టుకింద పల్చటి చందమామ ఆకుల మధ్య కనబడుతూ, ఇలాయిబుడ్ల వెలుగులో ప్రాణాలుతోడే వూపుతో సాగే గొల్ల సుద్దులూ, చల్లటి పూరిపాకలూ, తరవాణి కుండలూ, చెట్లనీడలో పొడుం పీలుస్తూ పెద్దల చదరంగపుటెత్తులూ.. నాకవే ఇష్టం. ఆ జీవితం ఆ పుస్తకాల్లో వుంది. పాత పత్రికల సంపుటాల్లో గోదావరిమీద వంతెన వేయడం, మొదటిరైలు వెళ్ళడం, వార్త చూశాను. గతానికీ నాకూ లంకె ఆనాటి పుస్తకాలు, పత్రికలు.

ఆ సాయంత్రం నా జేబులో డబ్బు లేదు. తరవాత వొచ్చి కొనాలనుకుని, ఏయే పుస్తకాలు కొనాలో ఒక లిస్టు తయారు చేసుకుంటుండుగా అలజడైంది. ఆయనొచ్చాడు. కొట్టాయన కాబోలు ధోవతి చొక్కా, పైన తుండుగుడ్డ, చామనచాయ, చదరంగా కనబడే నిండైన మొహం, పలకరిస్తున్నట్లు కనబడే కళ్ళు, దట్టమైన కనుబొమ్మలు, తాంబూలానికి డాగైన పళ్ళవరస, మధ్య పాపిడి క్రాఫింగ్ మినహా, ఊహలో నిలిచి పొయ్యే ప్రత్యేకత ఏమి లేదు. మధ్య పాపిడి, ఇరుప్రక్కలా, కాడలలా వెళ్లాడిన పొడుగాటి క్రాఫింగ్, ఈ శతాబ్ద ప్రారంభంలో చిత్రకారుడు అలవరచుకున్న పద్ధతిని జ్ఞప్తికి తెస్తాయి. అందుకే అతని రూపు నా ఊహలో నిలిచిపోయింది. వయస్సు నలభైలోపే ననుకున్నా.

"ఇది చూశారా?" అంటూ నా ముందుకి వొక పుస్తకాన్ని తోశాడు. లేదన్నట్లు తలపంకించి, పుటలు తిరగెయ్యడం మొదలెట్టాను. ఒకదానిపేరు 'బాలవితంతు విలాపము' గ్రంథకర్త మంగిపూడి వేంకట శర్మ. దాని క్రింద ఆ గ్రంథకర్తదే 'నిరుద్ధ భారతం' అన్న మరో పుస్తకం కనిపించింది. గాంధీగారి హరిజన పత్రిక వ్యాసాల ధోరణిలో సాగిన రచన అది. ఉపోద్ఘాతంలో ఆయన్ని సమాజం వెలివేసిన వుదంతం వుంది. ఆయన గొప్ప సంస్కర్తట. పుటలు ముందుకి తిప్పి వొకదానిమీద వేలు మోపి, 'చదవండి' అన్నాడు కొట్టాయన. అదొక పద్యం. నాకా పద్యం ఇప్పుడు జ్ఞాపకం లేదుకాని, "వొస్తువులన్నీ పోతే పస్తుండవొచ్చు.. కాని ప్రాణ సమానమైన పుస్తకం తడిసిపోతే ఎవడు సహించగలడు?" అన్న అర్థం సూచించే పద్యమది. ఈ పుస్తకం ఒకటి కొందామనుకున్నాను.

"చూస్తూ వుండండి" అని ఆయన లేచాడు. "మళ్ళా వొస్తా" అని గొణుగుతూ ఇంకా పుస్తకాలు చూడ్డంలో నిమగ్నుణ్ణి అయ్యాను. 'కాశీమజిలీలు' కొనాలనిపించింది. చార్లెస్ లాంబో ఎవరో వొకాయన క్రొత్త పుస్తకం బైటకొచ్చిందని వినగానే, వెళ్ళి పాత పుస్తకం చదువుకుంటానన్న సంగతి జ్ఞాపకం వొచ్చింది. నాకప్పట్లో అల్లాగనిపించింది.

పుస్తకాల సంఖ్య పెరిగిపోతూంది. ఏది మంచిదో ఏది చదవక్కర్లేదో ఎవరూ చెప్పరు. వీటిని అరికట్టడానికి పూనుకోవాలని, 'నార్ ఉడ్' అనే ఆయన వ్యాసం వ్రాశాడు ఆంగ్లంలో. మనం కూడా అట్లాంటి ఉద్యమాన్ని లేవదీసి, గీతపై వ్యాఖ్యలు, సంస్కృత నాటకాల అనుసరణలు నన్నయ రచనలో అరసున్న గూర్చిన విమర్శలు, ఇట్లాంటివి  కొంత కాలం నిలిపివేసే మార్గాలు ఆలోచిస్తే బావుండు ననుకొన్నాను. కాని ఈ విషయం బహిరంగంగా చెప్పే ధైర్యం లేదు నాకు. అల్లాంటి సూచనకు వెలేస్తారు, తంతారు, జైల్లో పెడతారు.  మధ్య నాకెందుకు! తప్పకుండా కొనాలనుకున్న మరొకపుస్తకం బ్రౌన్ దొరగారు ఆంగ్లంలో వ్రాసిన వేమన శతకం. దాని ధర ఎంత ఉంటుందో?  అడగాలని అటూ ఇటూ చూశాను ఎవ్వరూ కనపడలేదు. ఆ కొట్టాయన మధ్యలో ఇట్లా వెళ్ళిపోతే, జనం చూడ్డానికొచ్చి పుస్తకాలని అపహరిస్తే ఏంగాను? ఆ పుస్తకాలని కొనకపోవడం సరిగదా, అపహరించరని కూడా ఆయనకి తెలుసుకాబోలు!

బ్రౌన్ దొరగారి వేమన శతకం వైపుకి లాగుతోంది మనస్సు.

"ఇదెంతండీ?" అన్నాను అప్రయత్నంగా

"చివరలో వుంటుంది చూడండి" అన్న సమాధానం వినిపించింది. అది స్త్రీ కంఠం. పైకి చూశాను ఒకామె పెట్టి ప్రక్కన కూర్చుని, సంచీలోంచి మరికొన్ని పుస్తకాలు పైకితీసి, చాపమీద అమరుస్తోంది. ఎక్కడనుండి వొచ్చిందో అస్తమిస్తూ వున్న సూర్యుడి కిరణం ఆమె మొహాన్ని వెలిగించింది. తీక్షణానికి తట్టుకోలేక, ఆమె కళ్ళు చిట్లిస్తోంది. అది చూసి నేనేమనుకుంటానో అని సిగ్గు ప్రకటిస్తూంది. సిగ్గంతా ఆమె అధరాలు బిగబట్టడంలో వుంది. విడినప్పుడు పళ్ళవరస తళుక్కుమంది, భోషాణంలోకి బ్యాటరీలైటేసి పెల్లగించిన వజ్రాల హారంలాగ. మనిషి ఎరుపుకాదు. వెడల్పుకి బదులు, పొడుగ్గా సాగిన కళ్ళు, కిరణం తాకిడికి ముంగురుల నీడలుపడి మరింత దట్టంగా కనిపించే తలకట్టు, తెలుపుమీద పచ్చపువ్వుల చీరకొంగు గాలికి తొలిగిన వక్షంపైన నా తలనీడ పడింది. ఆమె వయస్సు పాతిక, ముప్పై లోపు అనుకున్నాను. కాస్త కంగారు పడ్డాను. తలదించేసి పుస్తకాలు చూస్తున్నాగాని, అక్షరాలు సరిగ్గా కనబడ్డంలేదు. మనస్సెల్లాగో అయిపోయింది ఆమెకేసి మళ్ళా చూడాలనిపించింది. ఏదో ఆకర్షణవుంది. ఎక్కడో తెలియదు. మనిషి నలుపే. విశేషం ఏమీ లేదు. కాని ముఖంలో వివిధ భాగాల కూర్పు, అమరికలో వొక క్రమం, లయ, నాజూకు, వున్నాయనిపించింది. ఈ రకం అమరిక మామూలుగా అందరినీ ఆకర్షించదు. కొత్తమొహాల కోసం బైలుదేరిన ఏ వొకరిద్దరు ఫిలిం డైరెక్టర్లనో తప్ప. ఆమెది అట్లాంటి అందం. తెరమీదా ఫోటోలోనూ, తైలవర్ణ చిత్రంలోనూ, నల్లరాతి శిల్పంలోనూ బైటపడి, నిలబడి చూసేటట్టు చేసే వొక ప్రత్యేక కూర్పుగల మొహమేమో.

"లేదా?" అంది

ఉన్నదన్నట్లు తల వూపాను. ఆ పుస్తకం వెనక 'వంద' అంకె వేసుంది. వంద రూపాయలా దానివెల? వంద నయా పైసలా అడగడానికి సిగ్గేసింది. అసలు నాకు స్త్రీతో బేరమాడ్డం చేతకాదు. వాళ్ళెంత చెబితే అంతా చెల్లించి, కొన్న వస్తువుని దుకాణంలో దిగవిడిచి పారిపోయ్యే బాపతు నేను. అర్థంలేకుండా ఏవో పుస్తకాలు తిరగేస్తున్నాను. 'కర్మదేవి,' 'పుష్పవేణి' అనే నాటకాలు మంగిపూడాయనవి, 'రూపవతి' అనేది అట్లూరి వెంకటసీతమ్మ గారి నవల. వెనకటావిడ వ్రాసిన ఆ నవల ఎలావుందో కొని చదవాలనిపించింది. వెలకోసం ముందు, వెనక చూశాను. ఎక్కడా కనబడలేదు. ఎందుకో ఆమెను అడగలేకపొయ్యాను. కిరణం కదిలి ఊదారంగులో కరిగి పోతోంది. విద్యుత్ దీపం వెలిగింది జనం ఒత్తిడి వెన్నువెనక స్ఫురిస్తోంది. కొందరు మూగారు, పుస్తకాలు చూడ్డానికి అడిగెయ్యనా? వందరూపాయలు పెట్టి పుస్తకం నేనెప్పుడూ కొనలేను. పాశ్చాత్య దేశాలనుండి వొచ్చిన ఏ పరిశోధకుడో, పండితుడో కొనగల పుస్తకాన్ని, మనవాళ్ళలో ఎవరైనా "ఊరికే దగ్గర వుండనివ్వండి. ఈ పుస్తకమూ, ఈ వంద రూపాయలూ" అని చేతిలో పెడితే, ఇందులో ఏదో కుట్ర వుందని నాకొద్దు బాబూ, అని తిరస్కరించి పొయ్యే మనం.. వంద రూపాయల పుస్తకమే ! సీతమ్మ గారి 'రూపవతి' వెలెంతో?  తెగించి అడిగెయ్యాలి తలపైకెత్తి చూశాను. ఆమె అటు తిరిగి ఏవో సర్దుతూంది. ఏమనాలి ? "ఇదిగో ఇటు చూడండి" అని పిలవాలా ? స్త్రీని 'అండి' అనగానే ఆమెని అగౌరవ పరచడం

అవుతుందా ? అట్లాగంటే 'ఎమిటండీ అంత పెద్దదాన్నిటండీ' అని తిప్పి కొడుతుందా! సకిలించడం, దగ్గడం లాంటివి చేశాను. వెనక్కి తిరిగి మరికొన్ని పాత పుస్తకాలు సర్దుతోంది. వాటిల్లో ఈనాడు సాహిత్య రంగంలో పేరుపడ్డ రచయితల గ్రంథాలున్నాయి. కథలు, నవలలు, వ్యాసాలు, ఖండకావ్యాలు వారి గ్రంథాలు పాత పుస్తకాల షాపులోకి చేరుకున్నాయంటే, వారిపట్ల ఇదివరలోవున్న అభిమానం కాస్త సన్నగిల్లుతుందేమో. అభివందనాలతో గ్రంథకర్త మిత్రుడికి తన పుస్తకం కానుకగా యిస్తే, దాన్ని చదివారో లేదో తెలియదుగాని, పాత పుస్తకాల వ్యాపారి కమ్మి సొమ్ము చేసుకుంటున్నారనుకోవాల్సి వస్తుంది. బెర్నార్డుషా 'అభినందనలతో' స్నేహితుడికిచ్చిన తన పుస్తకం పాత పుస్తకాల కొట్టులోకి చేరితే, దాన్ని కొని, 'తిరిగి అభినందనలతో' అని వ్రాసి మళ్ళా ఆ స్నేహితుడికే పంపాడుట !

ఇప్పుడు పేర్చిన వాటిల్లో కొన్ని పాత ఇంగ్లీషు పుస్తకాలుకూడా వున్నాయి. మేరీ కోరెల్లీ, హాల్ కెయిన్ రేనాల్డ్స్ గార్ల నవలలు, ఎడ్గార్ వాలెస్ భీభత్స కథలు, జంతుశాస్త్రానికి సంబంధించిన శాస్త్ర గ్రంథాలు, ఎడిసన్ స్పెక్ టేటర్ వ్యాస సంపుటాలు, మొదలైనవి కూడా వున్నాయి. మరో పుస్తకం సంచీలోంచి తీసి కర్రపెట్టి మూత తీసి, లోపల వుంచింది. ఆమె అదేమిటని తొంగి చూశాను అది బాగా కొత్తగా కనబడుతున్న పుస్తకం.

"చూడొచ్చా ?" అన్నాను

నవ్వుతూ తీసి ఇచ్చింది

"ఇది అమ్మర్లెండి" అంది ఆమె

అది కొత్త పుస్తకం. 'నగుమోము' అన్న పేరుతో ఖండకావ్య సంపుటి. ఇరవై పేజీలుంటుందేమో. వెలలేదు. అంకితంమటుకు 'ఆమెకే' అని వుంది. కవిపేరు 'నాస్వామి', లోపలి గేయాలు సుళువుగానే వున్నాయి. అదొక ప్రేమ గాథ. అతడు ఆమెను ప్రేమిస్తాడు. పెండ్లి చేసుకుంటాడు, చేసుకున్నాక వారి ప్రేమ పెరిగి వర్ధిల్లుతుంది, ఆమెది ఎప్పుడూ నగుమోము ఆమోము కన లేకుండా వొక్కరోజు గడవదు. అల్లాంటి ఇతివృత్తం గల కావ్యం అది. అంతమటుకే జ్ఞాపకం కూడా. ఇతివృత్తం నూతనమైందేనని వొప్పుకోవాలి. మామూలుగా ప్రేమ భగ్నమైనప్పుడే కవి కలం పడతాడు. ఇందులో అల్లాకాక, ప్రేయసి భార్య కావడం, భార్యయి కూడా ప్రేయసిగా వర్ధిల్లడం విశేషం. అసలు ప్రేయసి భార్య అయిందని తెలుసుకోగానే, పాఠకుడు ఆ పుస్తకాన్ని చదవక విడిచెయ్యడమే కాకుండా, ఆ విధంగా దగాపోయినందుకు కోపగించి చించేస్తాడు కూడా.. పాత పుస్తకాల షాపంటూ లేకపోతే.

కాని ఆ కావ్యం అమ్మకానికి లేదు. ఎందువల్లనో అడిగే ధైర్యం లేదు. వెల ఎంతో, ఎందుకమ్మరో ఆమె భర్తనడిగి తెలుసుకోవచ్చుననుకుని లేచాను.

"ఇక్కడున్నారా? రండి పెళ్ళివారు మనకోసం చూస్తున్నారు" అన్నాడు సత్యం, ఆడపెళ్ళివారి తాలూకు చుట్టం. ఆ ఊరే అక్కడే పరిచయం అయ్యాడు. పెండ్లి పందిట్లోకి చేరుకున్నాం.

ఆ రాత్రి భోజనాలయ్యాక, వెడుతున్న అతిధులలో సాయంత్రం పలకరించిన పుస్తకాల కొట్టాయన్ని చూసి ఆశ్చర్యపడ్డాను. రోడ్డుమీది పాత పుస్తకాల కొట్టాయన్ని ఎందుకు పిలిచారో అని ఆశ్చర్యం. స్త్రీజనంలో ఆవిడ కనబడుతుందేమోనని చూశాను. కనబడలేదు. ఆయన్ని గురించి 'సత్యాన్ని' అడిగాను. ఆయన పేరు నారాయణస్వామిట. 'నాస్వామి' అంటారుట. అతని తాతగారు యాభై ఏండ్లక్రితం వొక అచ్చుయంత్రం సంపాదించి, దినపత్రిక, స్త్రీలకి మాసపత్రిక స్వయంగా ప్రచురించేవాడుట. పాత్రికేయుడుగా పేరుపడినవాడుట. కొంత భూమి, పుస్తక భాండాగారం స్వయంగా సంపాదించి, సేకరించినవట. ఆయన అనంతరం భూమి, యీపుస్తకాలు, తన కుమారునికి అంటే నారాయణస్వామి తండ్రికి సంక్రమించాయిట. ఆ కుమారుని మొదటి భార్య కొడుకు నారాయణస్వామి. మొదటి భార్య చనిపోయింతర్వాత, ఆయన రెండో వివాహం చేసుకున్నాడుట. ఆమెకు నలుగురు సంతానంట. కొంతకాలానికి ఆయన చనిపొయ్యాడు. ఆస్తుల పంపకంలో,

నారాయణస్వామికి, సవతితల్లి సంతానానికి తగాదా లేర్పడ్డాయిట. అవతల వారు, మాకా 'చెత్త' పుస్తకాలు అక్కర్లేదు, భూమే కావాలన్నారుట. తాతగారి ప్రతిభని, సంస్కారాన్ని, కృషిని, అల్లా వొక్క మాటలో చులకన చెయ్యటంతో నారాయణస్వామికి రోషం వచ్చేసి, భూమి వాళ్ళకి విడిచేసి, పుస్తకాలు, అచ్చుయంత్రం, తనవాటాగా వుంచుకున్నాడుట. ఆ గ్రంథాలన్నీ చదువుకుని, సంస్కృతి, కళారాధనతో తృప్తిపడతాడుట. లోగడ వొకటి రెండు చిన్న ఉద్యోగాలు చేశాడు కాని, వాటి నిబంధనలకి తట్టుకోలేక విడిచేసి, పుస్తకాల షాపు పెట్టుకుని కాలం వెళ్ళబుచ్చుతున్నాడుట. సత్యం ఇదంతా చెబుతుంటే 'ఊ' కొడుతునే, నారాయణస్వామిని లోలోన అభినందించసాగాను. నారాయణస్వామి 'నగుమోము' వ్రాసిన కవి. అతను స్వేచ్ఛాజీవి ఏ ఉద్యోగమూ చెయ్యలేదు. అతనికి ఆస్థిపాస్తులక్కర్లేదు. సాహిత్య వ్యాసంగం, కళాజీవితం కావాలి. సౌందర్యం కోసం సౌకర్యం త్యాగం చేసిన వ్యక్తిత్వం, నిజాయితీగల ఆదర్శజీవి. అట్లాంటివారు సంఘంలో ఏ వొకరిద్దరో వుంటారు. ఆ సమాజం నాగరికత, సంస్కృతులు వారిమీద ఆధారపడతాయి. సత్యం ఇంకా చెబుతూనే వున్నాడు.

"ఆ పుస్తకాలు అమ్మే వుద్దేశం వుందంటే నేను నమ్మను. అతనికా వుద్దేశం లేదు. పుస్తకాలకి విపరీతమైన ధరలు చెబుతాడు. పదిదగ్గరనుంచి వందవరకూ. ఎవరు కొంటారు? అందులో ఈ ఊళ్ళో బస్సుకోసం ఎదురుచూస్తూ తోచక, ఈ పుస్తకాలేమిటో చూద్దామని కాలక్షేపం కోసం వొస్తారు జనం. కొనేందుకు కాదు. పోనీ ఏదన్నా కొందామంటే అన్నీ పది, ఇరవై, వందానూ. విద్యార్థినుల బృందంలో వొకమ్మాయి పుస్తకాలు చూడ్డానికి వెళ్ళిందిట. వారం వారం వొచ్చి బేరమాడిపోతూ వుండేది. తనకి కావాల్సిన పుస్తకాలను అతను వెల తగ్గించే వాడుకాడుట. 'నీ పనిల్లా వుందా, ఉండు, ఇవన్నీ స్వంతం చేసుగుంటాను' అన్నట్లు ప్రేమకలాపం కొనసాగించిందిట. ఆఖరికి ఇద్దరూ పెండ్లి చేసుకోడం జరిగింది. అని చెప్పుగుంటారు కథకంచికి, మనం ఇంటికి"

"కట్నం...?"

"ఒకటే కట్నం, ప్రేమ కట్నం, పుస్తకాల సారి."

"ఎట్లా వుంటుంది ?"

"కట్నమా ?"

"ఛ, ఛ, భార్య."

"ప్రేమించిన ఏ స్త్రీ బాగుండదు ? " అన్నాడు సత్యం. 'ఆ' అనడం తప్ప, ఏం చెయ్యను?

మర్నాడు పెళ్ళివారు మా ప్రయాణానికి ఒక బస్సు ఏర్పాటు చేశారు. బైలుదేరడానికి మరో గంట టైముంది. పుస్తకాల కొట్టుకేసి బైలుదేరాను. అక్కడ ఏ పుస్తకమూ కొనగలననే ఆశలేదు. నాదగ్గర అంత డబ్బూ లేదు. ఏ వొక్క పుస్తకం మీదా అంత మోజూలేదు. ఎవరో అన్నట్లు నాకిష్టమైన పుస్తకం నేనే వ్రాసుకోవాలేమో.

ఓ విధంగా నారాయణస్వామి ఆ పనే చేశాడు. కవికాలేని వాడు విమర్శకుడవుతాడన్నాడు. అందులోనూ రాణించని వాడు పుస్తకాల దుకాణం పెట్టుగుంటాడా? 'నాస్వామి' కవే, సందేహం లేదు. మంగిపూడి వెంకటశర్మ గారి పుస్తకానికి విలువ కట్టగలిగిన విమర్శకుడు కూడా తుదకి పుస్తకాల షాపుకూడా పెట్టాడు. ఈ మూడింటికీ ఏదో వొకరకం సంబంధం వున్నట్టు తోస్తుంది కాని, అదేమిటొ చటుక్కున స్ఫురించడం లేదు.

తన పుస్తకం అమ్మకానికి లేదుట ఎందుకు? పాత పుస్తకాల షాపులో కొత్త పుస్తకానికి స్థానం లేదనా ? అడిగితే ?

నే వెళ్ళేప్పటికి గొడుగు నీడన కూర్చుందామె. ఎర్ర రంగు చీర, తెల్ల జాకెట్టు, జడలో పూలు, చేతికి ఎర్ర గాజులు, చెవులకి గుండ్రంగా చుట్టిన తీగెలు ధరించింది. తీక్షణంగా చూస్తే ఆమె కళ్లవెనక విషాధ ఛాయలు. చరిత్ర గుహల చీకట్లు. సముద్రం మధ్యలో చెలించని విషాద గుండాలు. ప్రస్తుతాన్ని వొక గాలిపటంగా ఎగరవేసి, శూన్యంలో కదలికని తన చూపుతో నిర్ణయించే వొక ఆకర్షణ. ఇవి నా ఊహకి

గోచరించసాగాయి. ఆమె నవ్వులో చిదానందం నీడలు, పలుకులో మాధుర్యం ప్రతిధ్వనులు, కదలికలో చావుపుట్టుకల సమన్వయం ఏదో వొక శక్తి, నారాయణ స్వామి ఊహని సృష్టికి పురిగొల్పి, లోకం సమర్పించే కానుకలను కాలదన్ని, నిశ్చలమనస్కుడై, ఆనందంతో జీవితపు నౌకలో ఆమె చుక్కాని తిప్పుతూండగా, గానం చేస్తూ సాగిపోతూన్న ఆ ధన్యజీవిని అభినందించాలనిపించింది.

“ఆ పుస్తకం.. నిన్నటిది చూడొచ్చా ?” అని అడిగాను.

ఏది అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది పెట్టెకేసి చూపించాను పెట్టె లోంచి తీసింది.

“ఇది అమ్మరా ?”

లేదన్నట్లు తలపంకించింది.

“ఎందువల్లనో అడగొచ్చా ?”

“అదుగో వొస్తున్నారు. వారినే అడగండి.” అంది ఆమె.

నారాయణ స్వామి వొచ్చాడు కళ్ళ కింద గీతలున్నాయి జీవితం వేసిన అడుగు జాడలు అనుభవం, మొహంపై వ్రాసిన ప్రేమలేఖ; విషాదంతో క్రుంగిపోయినా. మహదానందంతో మిడిసిపడుతున్నా, ఈ వయస్సు విప్పి పారేసిన దుస్తులని ఉతుక్కోవడం తప్పదు కదా !

“మీ ‘నగుమోము’ కొన్ని భాగాలు చూచాను. చాలా బాగుంది అవుతే దాన్ని అమ్మరుట నిజమేనా ?” అని అడిగాను.

నారాయణ స్వామి నవ్వుతున్నాడు. ‘ఉండండి’ అని ఆమెకి సంజ్ఞ చేశాడు.

ఆమె మరో కుర్రవాడిని పిల్చి ఏదో చెప్పింది.

‘రండి ఇల్లా కూర్చుందాం’ అన్నాడు నారాయణస్వామి. పుస్తకాల వెనక చెట్టు నీడలోకి నడిచాము.

“మీకు బాగుందా ? సంతోషం” అన్నాడు.

“అవును. విషాదాంతమైన ప్రేమనే ఇన్నాళ్ళూ కావ్యంలో చూస్తూ ఒచ్చేము. సుఖాంతమైన ప్రేమని వొస్తువుగా స్వీకరించి, విజయం సాధించారంటే, మిమ్మల్ని అభినందించాలి. ఆ పుస్తకం కొంటాను” అన్నాను.

“స్వయంగా అచ్చువేసిన పుస్తకం. ఇంట్లో కీటకాలు పాతపుస్తకాల జోలికి అంతగా పోవడం లేదు ఈ కొత్త పుస్తకంలో వాసన ఏదన్నా వాటిని ఆకర్షిస్తుందేమో. అవి తినడమే కాకుండా, చుట్టు ప్రక్కల వున్న ఎలుకల్ని కూడా రప్పించి. పండుగ చేసుకున్నాయి. మిగిలింది వో పాతిక కాపీలు. వాటిల్లో ఇరవై నాలుగువరకు పనిమనిషి పేడ నీళ్ళకి తడిసి పనికి రాకుండా పొయ్యాయి. నిన్న చూపించాను, మంగిపూడి వారి పద్యం జ్ఞాపకం వుందా? వస్తువులన్నీ పోతే పస్తుండొచ్చు కాని, పుస్తకం తడిస్తే ఎవడు సహిస్తాడు? అన్నపద్యం సరే చివరికి ఈ వొక్క కాపీ మిగిలింది.” అన్నాడు. ఇంతలో కుర్రాడు గ్లాసుల్తో చెఱుకు రసం, కాస్త ఐస్ ముక్క తెచ్చాడు. త్రాగుతున్నాం.

“మరోమారు అచ్చు వేసినప్పుడు పంపుదురుగాన్లెండి” అన్నాను ఇంతలో బస్సువొచ్చి నిలిచింది. జనం రమ్మంటున్నారు.

“ఇంతకీ మీరు అంతమంచి కావ్యం వ్రాయగలగడానికి ఆమె కారణం. ఆమెను కూడా అభినందించాలి” అన్నాను.

నారాయణస్వామి నవ్వుతున్నాడు.

“కొందరికి ప్రేయసి లుంటారు, కావ్యాలుండవు. నాకు కావ్యం వుంది, ప్రేయసి లేదు” అన్నాడు.

“అంటే ? ఆమె...” వేలు అటు చూపుతూ అన్నాను.

“అదా, ఇక్కడే పిల్లజమిందారు గారింట్లో పనిమనిషి. నాకు వీలు కుదరనప్పుడు, కాసేపు వొచ్చి ఇక్కడ కూర్చోమంటాను. భార్య ఏనాడో పోయింది” అన్నాడు

“ఓ” అన్నాను.

మానవుడు కల్పించిన భాషలో, ఈ ‘ఓ’, ‘ఆ’, ‘ఊ’ లు ఎంత ముఖ్యమైనవో అప్పుడు తెలిసొచ్చింది.

★ ★ ★

# కామీ స్వతాం పశ్యతి

# - యస్.గంగాధరం

## (ఆంధ్రపత్రిక, 1950, ఫిబ్రవరి 22 సంచిక, నుంచి పునర్ముద్రణ)




తన హృదయ ప్రతిబింబాన్నే కళ్ళెదుట చూస్తుంటాడు లోకంలో సామాన్య వ్యక్తి. హృదయం దుఃఖభారంతో కృంగిపోతున్నప్పుడు, తన కన్నీళ్ళ కళ్ళల్లోంచి జిలచిలగా కనిపిస్తూన్న ప్రపంచం తనలాగే కళవళ పడుతున్నట్టనిపిస్తుంది. హృదయాహ్లాదకరమైన దృశ్యాల్లో అగ్నిజ్వాలలు చూస్తాడా సమయంలో. మరుక్షణం తన హృదయం ఆనందసాగరంలోకి పారినప్పుడు, ఆనందాశ్రువుల్లోంచి ప్రపంచాన్ని అపర స్వర్గమని తలపోస్తాడు. బీదలగోల, దుఃఖితుల వేదన అతని చెవులకు వినిపించవు. ఇలాగే కామార్తుడు గూడా తన హృదయాన్నే ఎదటి స్త్రీవ్యక్తిలో చూస్తుంటాడు. ఆమె సహజమైన చేష్టలకి స్వంత అర్థాలు కల్పించుకుంటాడు. వాస్తవాన్ని గుర్తించటం సామాన్య వ్యక్తికి అసాధ్యం. దాన్ని గుర్తించకుండా తియ్యని తలపుల్ని చప్పరించుకుంటూ సరాసరి ఆకాశానికి ఎక్కిపోతాడు. వాస్తవం తేటపడినప్పుడు జారిపోతున్న గుండెల్ని అదిమి పట్టుకొని నిరాశతో అక్కణ్ణుంచి క్రిందపడతాడు. తన మనస్సును ఆకర్షించినదాని మీద వెంటనే ముగ్ధుడై పోతాడు. వెనకముందు ఆలోచించకుండా. క్షణంలోనే మమత ఏర్పడిపోతుంది. మమతను అరిషడ్వర్గాలు చక్కగా అలంకరిస్తాయి. లేని దుఃఖాన్ని తెచ్చిపెట్టుకొని పిచ్చివాడైపోతాడు. అంత్యదశనాశనం ప్రాప్తించే లోపల అదృష్టం ఉంటే కళ్ళు తెరచుకుంటాడు, లేదా అగ్నిగుండం లోకే....!

★ ★ ★

సాయంకాలమౌతోంది. కారుచీకట్లు క్షణం పాటు సంధ్యారాగాన్ని తమలో జీర్ణం చేసుకున్నాయి. వెంటనే పూర్ణచంద్రుని లాలిమ వాటిని రూపుమాపి, తన రజోగుణాన్ని ప్రకృతికాంతపటానికి అద్దింది. రెప్పపాటులో పాలవెన్నెల పొంగింది. సమయం ప్రకృతికాంతను రకరకాలుగా సింగారించి మనస్సును, తృప్తిపెట్టుకుంటుంది. నేను ముందుగానే స్టేషనుకు పోయి బెంచిమీద తువాలు పరిచి నడుము చేరవేసి చంద్రునివంక అట్టే చూస్తూ ఆలోచిస్తున్నా. ప్రక్కతోపులోంచి ప్రకృతికాంత పరిమళయుతంగా చల్లని శ్వాసను విడుస్తోంది. ఆలోచన్లకు నా మెదడు అలసిపోయింది. తెలియకుండానే కళ్ళు మూసుకు పోయాయి. మళ్ళాకళ్ళు తెరచేటప్పటికి స్టేషనంతా నిర్జీవంగా పడివుంది. ఎక్కడివాళ్ళాక్కడ దీపాలు తగ్గించేసి గురకలు తీస్తున్నారు. నేను చంద్రుడు, యిద్దరమే ప్రకృతిలో మేల్కొని ఉన్నట్టనిపించింది.

కాసేపటికి దీపాలన్నీ ఎత్తారు. టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారం మీద యిటూ అటూ తిరుగుతూ సిగరెట్టు వెలిగించాను. యింతలో రైలు నిశ్శబ్దంగా వచ్చేసింది. ఎదటనే చిన్న కంపార్టుమెంటు ఖాళీగా ఉంది. గబగబా ఎక్కిపోయాను. అంతవరకున్న ఇద్దరు ప్రయాణీకులూ ఆ స్టేషనులోనే దిగిపోయారు. రెండే సీట్లు ఉన్నాయి. ఒకదాని మీద పరుపు పరిచేసి కిటికీలోంచి బయటకు చూస్తున్నాను. గార్డు లైటు చూపిస్తూన్నాడు. బండి కదిలేందుకు సిద్ధంగా ఉంది. ఇంతలో తలుపు దగ్గర శబ్దం అయింది. తలుపు తెరుస్తూ ఓ మనిషి ఇద్దరు ఆడవాళ్ళను గబగబ ఎక్కిస్తూ నన్ను కేకవేసాడు. నేను వెళ్ళి సామాన్లన్నీ అందుకొని సాయం చేశాను. క్షమించండంటూ నన్ను బ్రతిమాలుకున్నాడు. నేను "యింతమాత్రానికే?" అంటూ సమాధానం యిచ్చాను.

బండి నడుస్తోంది. ఆ మగమనిషి యిద్దరి ఆడవాళ్ళను ఒకసీటుమీద కూర్చోబెట్టి, తాను పైబల్లమీద పరుపు విప్పి నిద్రతీయడానికి ఎక్కిపోయాడు. నేను పడుకుందామనుకున్నాగాని ఎదురుగా ఇద్దరు ఆడవాళ్ళు. పడుకోడానికి సంకోచించి బయటికి చూస్తూ కూర్చున్నాను. కొండల్ని ఆనుకుని పోతోంది బండి. కొండలోయల గుండా కాలవల్లోంచి సందడి లేకుండా గంగ పారుతుంది. ఇంద్రుడు తన అందాన్ని ఆ గంగలో చూచుకుంటున్నాడు ? అతని చల్లని కిరణాలు కిటికిలోంచి లోపలికి ప్రవేశిస్తున్నాయి. ఇంతలో కాలికేదో తగిలినట్లయింది. త్రుళ్ళిపడి లోపలికి చూచాను. ఒక ఆమె అప్పుడే పడుకొంటోంది. తల నెరిసింది. జబ్బు గామాల్సు, దగ్గుతూంది. రెండో ఆమె మొహంలో చూద్దంతోటే నా శరీరంలో ఓ అలజడి బయలుదేరింది అకస్మాత్తుగా ? ఎఱ్ఱని పెదాలమీద చిఱునవ్వు కాంతులు, కంటిరెప్పలు టపటప లాడుతున్నాయి ! కళ్ళు మెరుస్తున్నాయి ! ఆమె ముగ్ధ చేష్టలు ఆమె యవ్వనాన్ని పరిచయం చేస్తున్నాయి. మొదట్లో ఆ పెద్దామె పడుకోవడంలో కాళ్ళు రాసుకుని ఉండొచ్చనుకున్నాను. మరుక్షణంలో అది కాదనిపించింది. ఆమె చిరునవ్వుకు బదులుగా నేను కళ్ళతో కృతజ్ఞతను తెలుపుతూ మందహాసం చేశాను. ఇద్దరికళ్ళూ సిగ్గుతో క్రిందికి మరలి పోయాయి, మళ్ళా కలుసుకున్నాయి. ఈసారి నా హృదయంలో ఆనందతరంగాలు చెలరేగాయి. కిటికీలోంచి బయటికి చూస్తూ, నవ్వును దాచుకున్నాను. నాకళ్ళకు బయటి దృశ్యాలు, చంద్రుడు, ఏదీ కనిపించడం లేదు. ఆ సుందరవదనమే కళ్ళెదుట గిర్రున తిరుగుతోంది. లోపలికి తిరిగి చూడటానికి బలం లేకపోయింది.

రెండుక్షణాలు గడిచాయి. మళ్ళా చూసేటప్పటికి ఆ యువతి మొహాన్ని పక్కకు తిప్పుకొని కిటికీలోంచి బయటకు చూస్తోంది. పచ్చరంగుచీర అంచు గాలికి ఎగురుతూ నా మోకాళ్ళమీద పడుతోంది. చంద్రకిరణాలు నున్నని పాలబుగ్గలమీంచి జారిపోతున్నాయి. అలాగే చూస్తూ కూచున్నాను.

నా హృదయం ఆమె స్నేహపరిచయాన్ని పొందాలని ఆతురత పడుతోంది! పైబల్ల మీద ఆ మగమనిషి గురకలు తీస్తున్నాడు. క్రిందబల్లమీద ఆ పెద్దామె కన్నుమూసింది. ఇలాంటి ఏకాంతం మరుక్షణంలో లభిస్తుందా? ఇప్పుడే హృదయాల్ని దగ్గరకు చేర్చాలి. ఈ సాహసకృత్యం నేను చేయలేకపోతున్నాను. ఆమెవల్ల అసలే కాదు. మగవానికి ఒక వంతు అయితే, ఆడదానికి పదివంతులు సిగ్గు ప్రసాదించాడు విధి. మూడో వాడొచ్చి కలపాలి. మూడో వాడొస్తే ఏకాంతం ఉండదే!

సన్నని తుంపరలు కిటికీలోంచి లోపలికి వచ్చి పడ్డాయి. బయటికి చూస్తే ఆకాశంలో చంద్రుడు కనబడలేదు. మబ్బు తునకలమధ్య నలిగి రాలిపోయి, ఆమె మొహంలో కలసి పోయాడు. వర్షం వచ్చేసింది అమాంతంగా. కిటికీ మూసేయాలని ఆమె ప్రయాస పడుతోంది. ఆమె ప్రయత్నం వృధా అయింది. వర్షం లోపలికి వచ్చేస్తోంది. నావైపు రెండుమూడుసార్లు చూచింది. మొహంలో చిఱునవ్వు కాంతులు తళుక్కుమంటూనే ఉన్నాయి. నేను గబగబలేచి కిటికీ మూసేసాను. ఆమె కృతజ్ఞతతో నా వైపు చూసింది.

ఆమెను మాట్లాడిద్దామనే ఉద్దేశ్యంతో నా దగ్గరున్న పత్రికల్ని తిరగేశాను. ఆమె అడిగితే అన్ని ఆమె నెత్తిన కురిపిద్దామని నా ఆలోచన మధ్యమధ్యలో బొమ్మల్ని చూస్తూ గట్టిగా నవ్వుతూ ఓరగా ఆమెని చూస్తున్నా కాని ఆమె నోరు మెదపలేదు. ఆమె మౌనం, దానికి విరుద్ధంగా ఆ చిఱునవ్వు కొంతదాక అర్థం కాలేదు. అతిలజ్జ ఆమెనోరు కట్టేసిందని తట్టింది మనస్సుకు.

ఆమె ముఖంలో ఏదో శక్తి దాక్కొని ఉంది ! అదే గొంతుకు పట్టేస్తోంది ! చిన్న ప్రశ్న ఏదైనా అడుగుదామన్నా, నోరు తెరిస్తే మైకంలో అనుకున్న ప్రశ్న వస్తుందో మరేం వచ్చేస్తుందోనని భయం. ఆ సమయంలో నాలో మరోభావనే ఉంటే నిస్సంకోచంగా మాట్లాడగలిగేవాణ్ణి, ఎంతమంది మనుష్యులు ఆమెచుట్టూ ఉన్నా సరే. కాని ఇప్పుడు భావన వేరు. ఈ భావన స్త్రీ పురుషుల హృదయాల్లో ప్రవేశిస్తే, ఇద్దరి నోరూ కట్టిపోతుంది ! మనస్సు దుర్బలమయిపోతుంది. సిగ్గు ముంచేస్తుంది. చేష్టలే వాళ్ల భావాల్ని పరిచయపరుస్తాయి ! వాటితోనే మాట్లాడుతారు!

పడుకున్నామె లేచింది. బండి స్టేషనులో ఆగి ఉంది. గొంతుక ఎండిపోతోందంది. కూర్చున్న యువతి కిటికీ తెరచి బయటకు తొంగిచూస్తూ నీళ్ళవాడెవడైనా వస్తాడేమో చూస్తోంది. ఆ అర్థరాత్రిలో నీళ్ళు ఎవరు తెస్తారు బండిదగ్గరకు ? రెండు మూడు సార్లు పైసీటు మీద పడుకున్న వ్యక్తివంక చూసింది. కుంభకర్ణ నిద్రలో ఉన్నాడు. సందర్భం చిక్కింది పలకరించడానికి "నీళ్ళు తెస్తాను" అని మరచెంబు అందుకోబోయాను.

"మీరు వద్దండి" అంటూ చేయి వెనక్కు లాక్కుంది.

"ఇవ్వవే అమ్మాయి.. మరచెంబు" అందా పెద్దామె. చేయి ముందుకు చాచి మరచెంబు తీసుకుంటూన్నాను. చేతులు స్పృశించాయి వెంటనే నా ఒళ్ళంతా విద్యుచ్ఛక్తి ప్రాకింది! చెంబుజారి పడిపోయింది. ఇద్దరం గబుక్కున చెంబు తీసుకొనేందుకు వంగాం. మళ్ళా యిద్దరి చేతులు స్పృశించాయి. తొట్రుపాటుపడ్తూ తలెత్తడంలో ఇద్దరి తలలూ మెల్లగా ఢీకొన్నాయి. యిద్దరి పెదాలమీద నవ్వు ప్రకటితమయింది. చకచకా దిగి వెళ్ళి నీళ్ళు తెచ్చి యిచ్చాను. కృతజ్ఞతతో చిరునవ్వు నవ్వింది. మళ్ళా అదే చిఱునవ్వు, అదే బెదరుపాటు కనిపించాయి.

మళ్ళీ ఓ పెద్ద స్టేషను వచ్చింది. మా ఆనందానికి అంతరాయం వచ్చింది. ఓ మనిషి చరచరా ఎక్కాడు. నల్లటి దుక్కశరీరం. వంటి మీద బంగారు గొలుసు జిగజిగ లాడుతోంది. రావడంతోనే నాకు ఆశ్చర్యం కోపం కలిగించేట్లు

"ఎక్కడికి వెళ్తున్నారు ? కొంచెం జరగండి" అంటూ నవ్వు మొహంతో ఆమె ప్రక్కనే చతికిలబడ్డాడు.

ఆమె మెల్లిగా సమాధానం ఇచ్చింది. నాకు వినిపించలేదు. వాళ్లిద్దరి మధ్యా రెండేజానల ఎడం ఉంది. ఎదుట మగవాడున్నా వీడికెంత సాహసం. కోతి మొహం వాడిక్కూడా ఇంత కామవికారం! అతనిలో పెంకితనం కనిపిస్తోంది నా కళ్ళకు! ఆమె చిఱునవ్వుతో, తియ్యగా మాట్లాడుతోంది. నాలో మాత్సర్యం ఉబికి వచ్చింది. కొన్ని దూషణ వాక్యాలు బలహీనత వల్ల పళ్ళ సందుల్లోనే నలిగిపోయాయి ! కాని కోతిమొహమూ వాడూ వాడేమిటిలే అనిపించింది. మనస్సు శాంతించింది. ఒకడు పళ్లమ్ముకుంటూ కిటికి దగ్గరగా పోతున్నాడు. ఆమె "ఏయ్ అబ్బాయి" అంటూ కేకవేసింది. ఆ కంఠం గాలిలో కలిసి పోయింది. వాడు అలాగే పోతూన్నాడు. అవకాశం దొరికిందనుకుంటూ, ఆమె చేతిలోంచి డబ్బులందుకోడానికి యత్నించాను. అంతలో అతని చేయి పైసలు మీద వ్రాలింది. నేను ఉలికిపడి, అతని చేష్టలు గమనిస్తున్నా. తీసుకున్నాడు డబ్బులు. పండ్లతో తిరిగి వచ్చాడు. చిరునవ్వుతో అతని వంక చూస్తూ పళ్ళు అందుకుంది. అంతటితో అతను పోనివ్వలేదు. దానిమ్మపళ్ళు తాను కొని వద్దంటున్నా వినక ఆమె చేతిలో బలవంతాన పెట్టాడు. నాకు కోపం మించి పోయింది. దానితో పాటు నిరాశ,

భయం కలిగాయి. తన చేష్టలతో ఆమె హృదయాన్ని ఆకర్షిస్తున్నాడు. స్త్రీ, పురుషునిలోని అంతరంగిక సౌందర్యాన్ని చూచి, మోహితురాలౌతుందంటారు. ఇది జ్ఞాపకం రాగానే మనస్సు కలతపడింది. అతని వంక తీక్షణంగా చూస్తున్నా. నా చూపులోని భావం అతనికి అర్థమయ్యే ఉంటుందనుకున్నా. కాని అర్థం కానట్టు అతనలాగే నవ్వుతూ మాట్లాడుతున్నాడామెతో. క్షణ క్షణానికీ నాకు గుండెల్లో భారం ఎక్కువై పోతుంది.

"ఇందండీ. పుచ్చుకోండి పళ్ళు." అంటూ నవ్వుతో నాకు ఇవ్వడానికి చేయి చాపాడు. అతని నవ్వు పుండుమీద కారం జల్లినట్టయింది.

"వద్దండీ. ఇప్పుడే తిన్నాను.. మీరు ఈ బెంచిమీదకు వచ్చేయండి. వాళ్లిద్దరకు స్థలం చాలదు" అతనితో పైకి నవ్వుతూ అన్నాను.

"ఫరవాలేదులెండి" అందామె.

"మీకు కష్టంగా ఉంటుందని" అన్నానామెతో.

ఆమె పళ్ళు ఒలిచి, తన పెట్టెలోంచి రెండు ప్లేట్లు తీసి, "తీసుకోండి." అంటూ ప్లేటులో పళ్ళు పెట్టి ఇచ్చింది. నేను ఆమె మోహాన్ని దీనంగా చూస్తున్నానందాక, వెంటనే నాలో పోతున్న శక్తి మళ్ళా చేరినట్టనిపించింది. అదే బెదురు. అదే చిఱునవ్వు. ప్రేమ కలుషితం కాలేదు.

పడుకున్నామెకు దగ్గు ఎక్కువై లేచి కూర్చుంది. అతను "అలా దగ్గుతున్నారేంటమ్మా ?" అని అడిగాడు.

"నాలుగు దినాల్నుండి దగ్గు పట్టుకుంది బాబు" అందామె.

"ఈమె నీకేమవుతుందమ్మా ?" అడిగాడు.

"నా కూతురే బాబు"

"చక్కని చుక్క. అమ్మాయిని చూస్తుంటే ఆనందం పట్టలేక పోతున్నాను. బండి దిగబుద్దెయ్యడం లేదు..." విస్మయంతో అంటూన్నాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంత స్పష్టవాది, ధైర్యవంతుడూ లేడనిపించింది. ఎదురుగా నేనున్నా. తల్లితోనే ఇలా మాట్లాడటం. కామార్తునికి పెద్ద, చిన్న కనిపించదు, సిగ్గు భయం ఉండదన్నారు పెద్దలు. తగిన శాస్తి జరుగుతుందని అతని మాటలు వింటున్నా... ఇవే కళ్ళు ! ఇదే గుండ్రనిముఖం. అదే నవ్వు. అతని కళ్ళలో నీళ్ళు కనిపించాయి. "రెండే మాసాలయింది తల్లీ. నా తోడబుట్టువు. మమ్మల్ని విడిచి పోయింది." అంటూ అతడు తువాలుతో కళ్లు మూసుకున్నాడు. దుఃఖం కంఠాన్ని అడ్డేసి బయటకు వచ్చేసింది.

నా హృదయం ఒక్కసారిగా ఝల్లుమంది. నా హృదయభావాన్ని, బలహీనతను కనిపెట్టి ఉండడు గదా? బలహీనత పూర్తిగా బయటపడక ముందు తన రహస్యాన్ని చెప్పేసి నా మానం దక్కించాడు. సిగ్గుతో తలవంచుకున్నాను. ఆమె తల్లి మళ్ళా నిద్రపోయింది.

ఆయన దిగవలసిన స్టేషను వచ్చేసింది. అతని హృదయం ఆమెను విడిచిపెట్టడానికి బాధపడ్తూంది. ఆమె తలను ప్రేమతో నిమురుతూ, నన్ను అభినందిస్తూ "ఇంటికి చేరగానే అమ్మాయి క్షేమాలతో ఉత్తరం తప్పక రాయిబాబు. నాధ్యానం మీ మీదే ఉంటుంది. ఈశ్వరుడు నా సోదరిని ఈ రూపంలో ప్రసాదించాడు. మిమ్మల్నిద్దర్నీ చూడ్డానికి వారం రోజుల్లో వస్తాను".. అంటూన్నాడు. నేను, ఆమె నివ్వెరపోయి చూస్తున్నాం. ఆమె సమాధానం చెప్పలేక పోతోంది. తొందరగా దిగి వెళ్లిపోయాడు మా ఇద్దరి చూపులూ ఒకసారి కలుసుకున్నాయి. అతని భావానికి ఫక్కున నవ్వుకున్నాం. అతని దృష్టి, పైన పడుకున్న వ్యక్తి మీదకు పోనే లేదు.

ఇంతవరకూ నాకో సందేహం ఉండిపోయింది. ఆ మగమనిషి ఈ ఆడవాళ్లిద్దరికి ఏం కావాలి ? వయస్సు చాలా ఉందనిపిస్తుంది. పెద్దమె అతని భార్య అయి ఉంటుంది. ఈమె కూతురయి ఉంటుందనుకున్నాను మొదట. కాని అదికాస్త ఆ పెద్దామె ఆ ప్రయాణీకునితో "నా కూతురు" అని చెప్పింది.

ఆమె నాకు తన హృదయంలో స్థానం యిచ్చినదీ లేనిదీ స్పష్టంగా తెలుసుకోవాలనే ఇచ్ఛ కలిగింది. స్టేషనులో ప్లాట్ ఫారం మీద బుర్ర గోక్కుంటూ ఇటూ అటూ తిరుగుతూ ప్రేమ పరీక్షకు ఉపాయం ఆలోచిస్తున్నా. ఇంతలో ఓ ఊహ తట్టింది. సాయంకాలం స్టేషనుకు

వస్తూంటే ట్రంకు గీసుకుపోయి చూపుడు వేలికి గాయమయింది. రక్తం కారుతోంటే తడిగుడ్డ చుట్టేశాను. ఆ తడిగుడ్డ అలాగే ఉంది. దాన్ని విప్పేసి దూరంగా పారేశాను. గాయం పచ్చిగానే ఉంది!

లోకంలో ఒక వస్తువుమీద గాఢంగా ప్రేమ ఏర్పడితే, అది చేజారిపోయినా, ప్రమాదానికి గురి అయినా ప్రాణి గిలగిల్లాడుతుంది. ఆ దిగులుపాటే ఆమె ముఖంలోనూ మాటల్లోనూ చేష్టల్లోనూ చూడాలనే ఆశకలిగింది.

బండి కదిలి నాలుగు గజాలు పోయిన తరువాత ఎక్కాను. “ మీరింతవరకు ఎక్కడుండి పోయారు?” అన్నదామె. లోలోన తృప్తిపడ్డాను. చిరునవ్వు నవ్వాను.

తరువాత వేలు చూసి “ఏం దెబ్బ తగిలిందా?” అని అడిగింది.

“అబ్బే ! ఏమీ లేదు, ఇందాకా గీరుకుపోయింది” అన్నాను.

“అయ్యో పాపం గుడ్డ చుట్టండి” అని చేతి రుమాలు తీసి ఇచ్చింది. చుట్టబోయినట్లు చుట్టి నొప్పి నటించి అంతలోనే మానేశాను. ఒక్క క్షణం ఆమె నావంక చూసి ఏదో యోచించి గుడ్డ తను తీసుకొని మరచెంబు నీళ్ళలో ముంచి మెల్లగా నా వేలుకి చుట్టింది.

ఉంగరాలు తిరిగిఉన్న శిరోజాల సౌందర్యాన్ని ఆలోకిస్తున్నా. కట్టడం అయిన తరువాత నేను “మీకు శ్రమ కలిగించాను” అన్నా.

నిండుగా నవ్వుతూ “ఇంత మాత్రానికేనా” అన్నది. ఆ నవ్వు వెనక ఇంత చలాకీ యింత మాధుర్యం ఉన్నాయని ఇప్పుడు తెలిసింది. ఇద్దరి మధ్యా చనువు ఏర్పడ్డానికి ఆ ప్రయాణీకుడే కారణం! ఆ పైన మధురమైన ఆలోచనల్తో చంద్రునిలోకి ఎగిరి పోయాను. ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి. ఏవో సన్నివేశాలు కల్పించుకుని ఊహిస్తున్నాను. ఆనందంతో తన్మయత్వం కలిగింది. ఇంకా ఆమె వంక చూడ్డానికి సంకోచం తీరిపోయింది. ఆమెకూడా ఏదో భావతరంగాల్లో పడి కొట్టుకుపోతున్నట్లుంది. ఆమె ఏమాలోచించుకుంటూందో కొంత సేపు ఊహిస్తూ గడిపాను.

ఇంతలో పైబెర్తు మీద అలికిడయింది. చటుక్కున నాధ్యానం అటు పోయింది. పడుకున్న వ్యక్తి లేచి పరుపు చుట్టేస్తున్నాడు. నిద్రకళ్ళతోనే క్రిందికి దిగుతూ, క్రింద పడుకున్న ఆమె కాలిని తొక్కాడు. ఆమె ఉలికిపడి లేచింది.

“మీరిద్దరు మేల్కొనే ఉన్నారేమిటీ?” అని అడిగాడతను.

“మరేవండీ” అన్నాను వినయంగా.

“నిద్ర ఆపుకోడం నాతరం కాదు.”

“ఒక్కొక్కరి శరీరతత్వం అలా గుంటుంది.”

కిందికి దిగివచ్చి కూచున్నాడు. నా ఊరు పేరు వంశం మొదలైనవన్నీ అడిగి తెలుసు కున్నాడు. తెలుసుకున్న తరవాత అతనికి నా పట్ల ఎక్కడ లేని ఆదరం అభిమానం కలిగాయి. ఒకే కులం. ఎక్కడో బాంధవ్యం కూడా కలిసింది.

“మీ కింకా వివాహం కాలేదా?” అని అడిగాడు.

“లేదండీ” అంటూ చిరునవ్వుతో ఆమె వంక చూశాను.

ఆమె పెదవులమీద చిరునవ్వు తాండవిస్తోంది. నా సమాధానంతో ఆమె హృదయం ఉప్పొంగి ఉంటుందనుకున్నా. నేను మహా వినయంతో అతని ప్రశ్నలకు జవాబులిస్తున్నా.

“ఏం చదువుకున్నారు ?”

“బి. ఏ.”

“మన అమ్మయి గూడా బియ్యే చదివింది కాదూ?” అడిగిందా పెద్దామె అతణ్ణి.

"లేదు. ఇంటర్మీడియెట్" అన్నాడతడు. నేను ఆమె ముఖం వంక చూశాను. ఆమె ఇంత చదువుకుని కూడా ఏమీ ఎరగనట్టు ప్రవర్తించింది. ఆమె పెంకితనానికి ఆమె మీద అదో వింత కోపం కల్గింది ! ఆమె అలాగే చిరునవ్వు నవ్వుతూంది.

తరువాత కొంతసేపు నిశ్శబ్దం. అతను కొంతసేపటికి తటపటాయిస్తూ "మిమ్మల్ని ఓ విషయం అడగాలని ఉంది" అన్నాడు

"అడగండి ! దానికేమిటీ ?"

"మా అమ్మాయిని చదివించడంచేత అది పూర్తి అయ్యేవరకూ పెళ్ళి చేయడానికి వీల్లేకపోయింది. కిందటేడే ఐ.ఏ. పాసయింది. వరుని కోసం అహోరాత్రాలు తిప్పలు పడుతున్నాం. ఎదిగిన పిల్లకి సంబంధం కుదరడం కష్టంగా ఉంది. మీకు మా అమ్మాయి నివ్వాలని..."

మనుష్యుడు నిర్మించుకున్న ఆశాసౌధాలు స్థిరంగా ఇలా నిలవగలగడం అరుదు. హృదయం ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టింది. అది అణుచుకుంటూ "మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషం. తప్పకుండా ఈ విషయాన్ని ఆలోచిద్దాం" అన్నాను.

అతను లేచి కాఫీ తెప్పించాడు. ఆమె తన చేతుల్తో ముగ్గురికీ కాఫీ అందించింది. ఆ తరవాత చనువు అధికమయింది. ఆమె నవ్వుతూ ఏవేవో మాట్లాడ్డం ఆరంభించింది. సంభాషణ సమయంలో ఆమె పేరు 'హంసముఖి' అని తెలిసింది.

"మీ ఊరికి వెళ్ళి, రేపే మా ఊరు రండి !" అన్నాడతను.

"తప్పకుండా రా బాబు" అనిందా పెద్దామె.

వాళ్ళు పోవలసిన స్టేషను వచ్చేసింది. బండి కదలడానికి టైమయిపోవచ్చింది. అతను కూలివాళ్ళతో వివాద పడుతున్నాడు కొంచెం దూరంలో. " హంసముఖీ ! వెళ్ళి తమ్ముణ్ణి పిల్చుకురా !" అంటూ తల్లి ఆమెను పంపించేసింది.

"అదేం పేరండీ" అన్నాను పెద్దామెతో.

"అమ్మాయిది చిరునవ్వు మొహం బాబు! వాళ్ళ తండ్రి బిడ్డను హంసముఖీ అని ప్రేమతోటి పిలుస్తుండేవారు. అసలు పేరు కమల."

"ఆయన మీ తమ్ముడా ?"

"అవును, స్వంత తమ్ముడు"

"కమలకు ఏమవుతాడు ?"

"భర్త, బాబు !"

"భర్తా !...?"

"అవును, బాబు ! బిడ్డ తండ్రిపోయిన తరువాత తమ్ముడి దగ్గర చేరాం. అమ్మాయిని కూడా వాడికే ఇచ్చాను."

"అయితే ఆయనకి పెళ్ళి కావలసిన కూతురుందా?" అన్నాను. సన్నగిల్లిన గొంతుతో..

"మొదటి భార్య కూతురు. పేరు లలిత. పద్దెనిమిదేళ్లు..." ఆమె చెప్తూ పోతోంది నేను జారిపోతున్న గుండెల్ని అదిమి పట్టుకొని, కూలిపోయిన ఆశాసౌధాల క్రింద గిల గిల లాడుతున్నా.

ఇంతలో వాళ్లిద్దరూ వచ్చారు. కమల చిరునవ్వుతో ఆపేక్షతో నావంక చూసింది.

"అమ్మాయిని చూట్టానికి రేపు తప్పక రండి ?" అన్నాడతను.

"నమస్కారమండి ! రేపు తప్పకుండా రావాలి. మీకోసం ఎదురు చూస్తూ ఉంటాం. మా లలితని చూద్దురుగాని" అంది కమల.

వాళ్లు వెళ్లిపోయిన తరవాత నాలో పశ్చాత్తాపం పొంగివచ్చింది. హృదయంలోని మాలిన్యమంతా కన్నీళ్ళతో కడిగేసింది. ఓ దీర్ఘ నిశ్వాసంలో గాలి మేడలన్ని ఎగిరి పోయాయి ? "నీ చిఱునవ్వులోని రహస్యాన్ని ముందే నాకెందుకు చెప్పావు కావు" అనుకున్నా. ఆ చిరునవ్వు

ప్రకృతి ప్రసాదించినది. నావంటి వాళ్లను శిక్షించడానికి కాబోలు ! మహాకవి కాళిదాసు వచనం “కామీ స్వతాం పశ్యతి” మతికి వచ్చింది. బండి కొండల మరుగులోకి పోయింది.

★★★

# చలి రాత్రిలో..

## - కె.చిరంజీవి

## (ఆనందవాణి 1950, జనవరి 29 సంచిక, నుంచి పునర్ముద్రణ)

చలిగాలి పదును పెట్టిన కత్తిలా విజృంభిస్తోంది. నా రూమ్ తలుపులు గట్టిగా వేశాను_ మంచం మీద పడుకుని చాలా రోజులైంది. చాపమీద పరుపు పరచి వెచ్చటి సిగరెట్ పొగలో తియ్యటి ఆలోచనల్ని ఊదేస్తున్నా, చలి కిటికీ గుండా ఎగిరి దూకుతోంది. నా వంట్లో ఎక్కడో దాక్కొన్న వేడి లోపల చలి గిలిగింతలకు పైకి పెనవేసుకు వస్తోంది. దుప్పటీ తన్ని పట్టాను. యింకా అరికాళ్ళు చల్లగానే ఉన్నాయి.

దూరంగా గోడమీద దేశనాయకుడి ఫోటో తరువాత ప్రక్కనే గాంధీ. గాంధీ అంత చలిగా ఉన్నా చొక్కా లేకుండా యింకా పయిగా వెకిలిగా నవ్వుతున్నాడు. దేశం కోసం ప్రాణాన్ని ధారపోసిన మహాత్యాగి. ఎందుకో నా చేతులు మోకరిల్లి నమస్కరించాయి. ఎందుకు దేశం కోసం అంత త్యాగం చెయ్యాలి?. ఏ సుఖాన్ని అనుభవిద్దామని ఆ మహా పురుషుడు యింతటి మహా అయాసాన్ని పొందాడు?! నాకు ప్రశ్నలు పరంపరలుగా వస్తున్నాయి, పాపం!... ఏ ప్రజాజీవిత సౌఖ్యం కోసం ఆ మహాపురుషుడు తపించాడో, ఏ బిడ్డల కడుపు నిండిన సంపూర్ణ కిలకిలా రాగాన్ని వినాలని తపించాడో, ఆ ప్రజలే, ఆ మూర్ఖులే శత్రువుని చంపి పగ సాధించినట్లు వేటలో లేడిని వేటాడినట్లు ఎదురుపోయి చంపుకున్నారు. నా సిగరెట్టు చేతులోనే కాలిపోయి చెయ్యి కాలింది.. భావ ప్రపంచం నుండి మెలకువ తెచ్చుకొని సిగరెట్టు పారేశా.

“దేశానికి సేవచేయటం ఎలా?” అనే ప్రశ్న ఉదయించింది నాకు. కాళ్ళుమాత్రం యింకా చల్లగా మంచులా ఉన్నాయి.

... చాలా చిన్నతనం లోనే ఎవరో చిన్న దేశనాయకుడు, దేశంలో మంచికోసం న్యాయం కోసం పోరాడే మహాశక్తులతో కలసి చనిపోయాడట. చరిత్ర చెవుల్లో వినబడుతోంది. అంత చిన్నతనంలో అంత పేరుతో చనిపోయిన ఆ వీరుని జీవితం అమరం. చావులో, నిజమైన ఆదర్శమైన చావది. నా వొళ్ళు పులకరించింది. నేను కూడా అంత గొప్పవాణ్ణి అవాలంటే ఏ విధంగా అవగలను! నాకు నవ్వొచ్చింది. ఎదురుగా గాంధీ పటం కూడా నన్ను చూసి నవ్వినట్లుంది.

దూరంగా ప్రక్కవాళ్ళింట్లో గ్రామఫోన్ రికార్డు వినిపిస్తోంది ‘ఏదిహింస__ ఏదహింస__ ఏదినిత్యం....’ పాటలో ఎంతో మాధుర్యం ప్రకంపిస్తోంది. లేచి కిటికీదగ్గరకు వెళ్ళా. పాట అస్పష్టంగా సన్నగా, తియ్యగా వినిపిస్తూనే వుంది. చలి ఒక పెద్ద విప్లవం లేవదీసింది చెవుల మీదుగా ‘రివ్వు’ మని వీస్తోంది చలిగాలి;

కిటికీ ప్రక్కగా ప్రకృతి హాయిగా నిదరోతోంది; చొక్కాలేని రిక్షావాలా గంటకొడుతూ ఎవర్నో లాక్కుపోతున్నాడు. సత్రపు అరుగు కనుపిస్తోంది; గుడ్డి మ్యునిసిపల్ దీపం వెల్తుర్లో చుట్టుకుపోయి నిదరోతున్న మనుష్యాకారాలు అరుగు మీద కనిపిస్తున్నాయి. ప్లీడరు గారి యింటి ప్రక్క ఇనుప పోతమిషను, యింకా టపటపశబ్దం చేస్తూనే ఉంది.

నాకు జాగ్రఫీలో చెప్పిన సంగతులు జ్ఞాపకానికి వచ్చాయి. మనూమసానీ వ్రాసిన అవర్ ఇండియా జ్ఞాపకానికి వచ్చింది. మన హిందూ దేశానికి కావలసినంత ధన సంపదకు, పంటకు తగిన భూమి కూలిప్రజ, నీటిసరఫరా అంతా ఉంది. హిమాలయ పర్వతాలు .. ఎంతో సారవంతమైన ఆ దేశాలలో హిందూదేశం ముఖ్యమైనది.

పాశ్చాత్యులు ఎంతోమంది మన దేశంపై వ్రాసిన పుస్తకాలు చదువుతే హిందూదేశం యొక్క గొప్పదనం తెలుస్తుంది. అయ్యో! ఇంత గొప్ప హిందూ దేశమేనా యిప్పటి ఈ అనర్థ దశలో వుంట. నాకేదో నా ఆస్తి సర్వస్వం ఎవరో అపహరించినంత బాధ అనిపించింది. ఎందుకో పెద్ద కోపం వచ్చింది; కోపంతో దుప్పటి గట్టిగా వంటి మీదకు లాక్కొన్నా; చలిగాలి గట్టిగా విసరుతూంది.

ఛీ! అసలు ప్రజలకు బుద్ధిలేదు; యింత సారవంతమైన భూమిలో ఎంతతక్కువ చేసినా సుఖమైన జీవితాన్ని వెళ్ళబుచ్చగల హిందూదేశానికి యీనాడు యీదుర్దశ యేమిటి? నాకు ఒక్కసారి దేశంలో ప్రతి రైతుకి ప్రతి పౌరునికి మన హిందూ దేశం యొక్క గొప్పతనాన్ని ఉద్ఘాటించి వెంటనే అటువంటి సేద్యం కోసం కృషిచేసి, పంటలు పండించి హిందూదేశాన్ని ఫలవంతం, ధనవంతం చెయ్యమని చెబ్దామనిపించింది; ఎంతో ఆవేశం కుదిపేసింది నన్ను! ఏవేవో కొత్త కొత్త అభిప్రాయాలు హృదయాన్ని గడిబిడ చేస్తున్నాయి;

ప్రస్తుత సంఘాన్ని దూషించాలి. నా విద్యార్థి జీవితములో నేనింతవరకు చేయగలిగిందేమిటి? నా విషయమే కాదు. నాతో పాటున్న, మా వేణు, గోపాలం, సుబ్బారావు వీళ్ళంతా చేయగలిగిందేమిటి? అసలు వారి ప్రపంచమే వేరు! నా చుట్టూ ఉన్న వాతావరణమే అటువంటిది. నాకు “అభ్యుదయం” ఒక చక్కటి సూర్యాస్తమయంలోని లేత రక్తవర్ణంగా కనుపిస్తోంది. నేనేం చేయగలను ? నాకేదో బెంగ అనిపించింది; కళ్ళంట, పొర్లిపోయే ఆవేశంలో, నీరు కారింది ! దేనికోసం యీ ఆవేదన?

తలుపు గట్టిగా చప్పుడవుతోంది. లేచి తలుపు తీశా! మా వేణు, గోపాలం, సుబ్బారావ్ యీల వూదుకుంటూ, రెండో ఆట సినిమా చూసి విమర్శకులలా ప్రవేశించారు.

నన్ను చూసినట్టే లేదు వాళ్లు. ఒకడు “ఓహో! ఏమి ఏక్షన్ రా దానిది”

వేణు “మార్వలస్, ట్రెమండస్, ఇన్ కంపేరబుల్. సురయ్య డాన్స్ ఆహా!” వేణు చేతులు రెండూ చాపి కళ్ళుమూశాడు.

నాలోని అంతర్హిత శక్తులు ప్రవేశింపబడ్డాయి నా ఒళ్ళు నిప్పులా మండింది. ముగ్గుర్నీ కోపంతో ఎందుకో మూడు లెంపకాయలు గట్టిగా కొట్టా. వాళ్లు నిస్థబ్దతలో నాలోకి చూస్తున్నారు. నా కళ్లనీరు కారుతోనే ఉంది.

★★★

.

# నేను చూసిన నక్షత్రం

## - డా.కె. వివేకానందమూర్తి

### (జ్యోతి, మాసపత్రిక, 1969 దీపావళి ప్రత్యేక సంచిక నుంచి పునర్ముద్రణ)

నాకీ మధ్య హఠాత్తుగా కథలు రాసే యావ తగ్గిపోయి రాయడం మానేశాను. కథ రాయడం మానేయడానికి కథ వుంది.

నేనెప్పుడూ కంచికి వెళ్ళిన కథే మంచికథ అనుకుంటాను. కథలు ముమ్మరంగా రాసే రోజుల్లో నేనోసారి కంచికి వెళ్ళేను. నా కథలెక్కడేనా కనిపిస్తాయేమోనని కాంచీపురమంతా కళ్ళు కంచుకాగడాల్లా చేసుకుని కాంచేను. కనిపించలేదు. నేను కంచికి చేరినా నా కథలు కంచికి చేరలేదు. అంచేత నేను మంచివి రాయలేదనుకున్నాను. నాకు చాలా బాధేసింది. భయమేసింది. దాంతో కథ వ్రాయడం మానేశాను – అలా వ్రాయకపోవడం వల్ల వూసుపోడం మానేసింది. తోచడం కోసం తోచినప్పుడల్లా సినిమాలు చూడ్డం ప్రారంభించాను. అలా చూడగా చూడగా చూడ్డం ముదిరిపోయి, నన్ను కూడా అలా తెరమీద అందరూ చూస్తే బావుణ్ణనిపించింది. తక్షణం రచయితగా రాయడం మానేసి, తెరమీద నటుడినై రాణించాలనుకున్నాను. ఉత్తర క్షణం లుంగీ కట్టుకుని మద్రాసు పోయే రైలెక్కేశాను.

మద్రాసు నగరం మహత్తరంగా అనిపించింది. కొత్త జీవితం గురించి కొత్త కలలు కంటూ పాండీ బజార్లో బృందావన్ లాడ్జిలో దిగాను. రైలు ప్రయాణం బడలికలో ఆ పగలంతా నిద్రలో టెక్నికలలు కూడ కన్నాను.

సాయంత్రమైంది రూముకి తాళం వేసి బజార్లో కొచ్చేను. అటూ యిటూ చెట్లతో అశోకుడు పాలించిన రాజ్యంలా పాండీ బజారు కళకళ్ళాడుతోంది. చెట్ల కింద చిన్నతరహా నటులు తెలుగు మాట్లాడుకుంటున్నారు. కాఫీ తాగుదామని వీ.కె. రెస్టారెంటులోకి వెళ్ళేను. టేబులు దగ్గర ఒక్కణ్ణీ కూర్చుని కాఫీ తాగుతూంటే కప్పు కాళీ అయ్యే సమయానికి ఎదుటి సీట్లో కూర్చుంటూ ఎవరో ఒకతను నన్ను పలకరించేడు.

"వేషాలకొచ్చేరా?" స్వచ్ఛమైన తెలుగులో స్పాట్ డయాగ్నోసిస్ చేసేశాడు.

"కాఫీ"

"మీరెవరు?" అన్నా.

“నన్ను వేలుమణి అంటారు. ఈ ఫీల్డుకి పాతికేళ్ళు పాతవాడ్ని. యిక్కడికి రాకమునుపు వెంకట నరసయ్యని. కొత్తలో ఈ వూరు నీళ్ళు పడక పేరు మార్చుకున్నాను; ఇప్పుడు ఈ బజార్లో ఏ చెట్టునడిగినా కొమ్మలూపుకుంటూ నా కథ చెప్తుంది” కాఫీ వచ్చింది. “మరో పట్టు పట్టండి” మళ్ళా మరికాస్త కాఫీ తాగేను.

“పదండి. అలా నడుస్తూ మాట్లాడదాం” బిల్లు నా చేతిలో పెట్టేడు.

పాతుకుపోయిన నటుడిలా అనిపించేడు నాకు. కానీ అతని బొమ్మ నేను ఏ చిత్రంలోనూ చూసిన గుర్తు లేదు.

“బీచ్ కి వెళ్దామా?” సిగరెట్టు వెలిగించేడు నాకొకటిస్తూ, నేను ముట్టిస్తూంటే పిలిచేడు – “టాక్సీ!–”

టాక్సీ దిగేం, మీటరు చూసి వేలుమణి లెక్కచెప్పేడు. పే చేసేను. రోడ్డు దిగి యిసుకలో నడుస్తూంటే వేలుమణి మాట్లాడటం ప్రారంభించాడు.

“నేను పాతిక సంవత్సరాలక్రితమే నా నట జీవితం ప్రారంభించాను. ఎన్నో రకాల పాత్రలు ధరించాను. మీకు నచ్చిన పాత్ర ఏది? అని చాలా మంది ప్రెస్ మనుషులు చాలా సార్లు అడిగేరు. తల్లిని పిలిచి నువ్వు కన్న పిల్లలందర్లోకి ఎవర్ని ఎక్కువ అభిమానిస్తావని అడిగితే అందుకు ఆ తల్లేం బదులు చెప్పగలదు చెప్పండి? అదుగో ఆ తల్లి లాగే నేనూ తల్లడిల్లిపోయి సమాధానం చెప్పలేకపోయే వాడ్ని. బఠానీలు కొనుక్కుందాం” అన్నాడు. కొనుక్కున్నాం.

“క్షమించాలి మీరు ధరించిన పాత్రలేవీ నాకు చూసిన జ్ఞాపకం లేదు” అన్నాను.

వేలుమణి బఠానీలు పటపటలాడిస్తూ చెప్పాడు. “అదుగో – అదే నటన అంటే. ప్రేక్షకుడి దృష్టిలో పాత్ర పాతుకుపోయినప్పుడు నటుడు జ్ఞాపకానికి రాడు. నేను పాత్రల్లో జీవించాను. అందుకే నా పాత్రలు జనానికెంత దగ్గరో నేనంత దూరమయిపోయాను” మేం జనానికి బాగా దూరంగా నడుస్తున్నాం.

“మీ పాత్రలేమిటో చెప్పారు కాదు?” అడిగాను.

“వస్తున్నా.. వస్తున్నా – ఆ మధ్య ‘పిడిలేని కత్తి’ అనే జానపద చిత్రంలో అంతఃపుర ద్వారపాలకుడిగా నటించి అప్రతిహత నటనాచాతుర్యాన్ని ప్రకటించాను. అందులో మహారాణిగా నటించిన ప్రఖ్యాత నటీమణిని నేనే బయటికి వెళ్ళకుండా శూలం అడ్డుపెట్టాను, చూశారూ! ‘మెడతిప్పని వీరుడు’ చిత్రంలో యుద్ధానికి పరుగు తీస్తున్న భటులలో ముందర నిలబడి “పదండి!” అని కేకేసిన వాణ్ణి నేనే. అంతే కాదు “హిడింబి” అనే పౌరాణిక చిత్రంలో ద్యూయెల్ రోల్ ఏక్ట్ చేశాను. అంటే ఒక రాక్షసుడిగాను, ఒక మునిపుంగవుడిగానూ నటించాను. ఈ రెండు విభిన్నమైన పాత్రలు. కానీ వాటిని స్టడీ చేసి వాటికి న్యాయం చేకూర్చాను. పాత్రకి న్యాయం చేకూర్చడమంటే ఏమీ లేదు. పాత్రని అర్థం చేసుకు నటించడం, అంటే రాక్షసుడి వేషంలో ఒక మునీశ్వరుణ్ణి బాధించాలనుకోండి. ముందు అతని గడ్డం పట్టుకోవాలా ? కొప్పు పట్టుకోవాలా? అనేది ఆలోచించాలి. అలాగే శూలాన్ని రాజుగారికి గుచ్చుకోకుండా ఏ యాంగిల్ లో ఎలా పట్టుకోవాలి ? మొదలైనవన్నీ స్టడీ చేయాలి. నేనలా స్టడీ చేసి నటించిన వేషాలన్నీ యాకరువు పెట్టాలంటే హోటలు కట్టేస్తారు. ఎన్నో చిత్రాల్లో పేపర్ బోయ్ గానూ, పోస్ట్ మాన్ గాను మరియు పోలీసు గానూ నటించాను. ఇంకా అనేక సాంఘిక చిత్రాల్లో క్లబ్ డాన్సులు, స్ట్రీట్ డాన్సులు అందరికంటే ముందు నిలబడి చూసేవాణ్ణి. అప్పుడు నాకిచ్చేది ఒక్క ఫ్రేమే అయినా, అందులోనే నా హావభావ ప్రకటనంతా గుప్పించేసే వాణ్ణి.” వేలుమణి నన్ను మాట్లాడనీయలేదు.

“అసలు నేనీ స్టేజికి రాకపూర్వం డబ్బింగ్ చిత్రాలకు గొంతు ఎరువిచ్చేవాణ్ణి. ఓ సారి నేను గొంతు ఎరువిచ్చిన డబ్బింగు చిత్రాన్ని విడుదలయ్యాక జనం మధ్య కూర్చుని చూశాను. అందులో ఓ సన్నివేశంలో హీరో చెంబు తీసుకొచ్చి ఇచ్చేసింతర్వాత కూడా హీరోయిన్ ‘సఖా!

ఆ చెంబు ఇలా తీసుకురావూ' అని అడిగింది. మాటలు కలవలేదు. డబ్బింగ్ చిత్రమంటే గౌరవం పోయింది. దాంతో మరి డబ్బింగ్ చిత్రాల జోలికి పోకూడదనుకున్నాను."

పకోడీలు కొనుక్కున్నాం. అవి తింటూ వేలుమణి మళ్ళీ మొదలెట్టాడు.

"నేను ఫీల్డులోకి అసలు ఎలా ప్రవేశించానో అడిగారు కాదు ! మొదట్లో నేనసలు రంగంలోకి నిర్మాతగా అడుగుపెట్టాను. ఉన్నతాదర్శాలతో వుత్తమమైన సాంఘిక చిత్రం తియ్యాలని. స్క్రిప్టు మీద నేనే కూర్చుని, కూర్చుకుని వున్న డబ్బంతా పోగేసి, పోసేసి తీశాను. నేను హీరోగా నటించిన ఏకైక చిత్రం అదొక్కటే. చిత్రం పేరు 'అవతలి వీధి' డైరెక్టర్ని కూడా నేనే. కథేమిటో తెలుసా? హీరోయిన్ అవతలవీధిలో వున్న హీరోని కలుసుకుందామని బయలుదేరుతుంది. ఆ వీధిని చేరే లోపులో ఆమె సంఘంలోని మంచీ చెడులను సూచించే ఎన్నో సంఘటనల్నీ, పేదవాళ్ల కష్టాల్నీ కుక్కపిల్లల్నీ, కుళ్ళు కాలువల్నీ ఓ తెలుగు సినిమానీ అన్నిటిని చూస్తుంది. చివరికి ఆమె హీరో యింటి గుమ్మం ఎక్కడంతో కథ సమాప్తమవుతుంది. ట్రాజెడీ లెండి. అంటే – హీరో యింట్లో వుండడు. తలుపు తాళం వేసుకుని ఎక్కడికో పోతాడు. 'ఏ' క్లాస్ సెంటర్స్ లో యింటర్వెల్ దాకా ఆడింది. ఆ దెబ్బతో నటుడిగా మారిపోయాను. నేను నటుడిగా తారాపథం అందుకోవాలని రాసి పెట్టినట్టుంది. అదుగో .. ఆదర్శ చిత్రం అలా కలిసొచ్చింది."

పకోడీలు అయిపోయేయి, బాగా చీకటి పడింది.

"రండి పోదాం" వెనక్కి తిరిగేం. "అన్నట్లు యింతసేపూ మీ గురించి ఏమీ అడగనే లేదు, ఏమైనా రికమెండేషన్ లెటర్స్ తెచ్చారా?"

"లేదు"

"లేకపోయినా ఫరవాలేదు. నేనున్నానుగా. సాటి నటుల్ని ఆదరించడం మేటినటుడిగా నా మొదటి విధి. మీకు ఫీచర్స్ వున్నాయి. అంచేత ఫ్యూచర్ వుంటుందనుకుంటున్నాను. కొన్నాళ్ల పాటు నాతో స్టూడియోల్లో తిరుగుతూ షూటింగ్స్ ఫాలోకండి. నెమ్మదిగా తెలుస్తుంది. రేపు మోహినీలో నాకు షూటింగ్ వుంది. ఇదివరకెన్నడూ ధరించనటువంటి ఒక విభిన్నమైన పాత్ర ధరిస్తున్నాను. పొద్దున్న మిమ్మల్ని కూడా తీసుకుపోతాను! చూద్దురు గాని"

వేలుమణికి గుడ్ నైట్ చెప్పి రూమ్ కి వచ్చేసరికి బాగా రాత్రయింది. నా వేషం గురించి ఆలోచించడం మానేసి వేలుమణి పరిచయం గురించి ఆలోచించాను. ఉదయం ఎనిమిది గంటలకల్లా వీ.కె.రెస్టారెంటు దగ్గరుండమన్నాడు. రెప్పలు బరువెక్కేదాకా రేపు గురించి ఆలోచించాను.

తెల్లారింది.

అనుకున్న ప్రకారం వేలుమణితో మోహినీకి వెళ్లాను. వేలుమణి నన్ను ఫ్లోర్ లోకి నడవమని మేకప్ కి వెళ్ళాడు. అక్కడ అనుకోకుండా నా చిన్ననాటి స్నేహితుడు యాదవరెడ్డి కనిపించాడు. పబ్లిసిటీ శాఖకి యిన్ ఛార్జిట. మాటల్లో వేలుమణి నటిస్తున్న చిత్రానికి నిర్మాతల్లో తనూ ఒకడని తెలిసింది. రెడ్డీ, నేనూ కబుర్లు చెప్పుకుంటూ వేలుమణి వేలుపెట్టి చూపించిన ఫ్లోర్ లోకి వెళ్ళాం. ఏదో రైసుమిల్లు ఖాళీ చేసి పెట్టినట్టుంది. లోపలికి అడుగుపెట్టగానే గాడిపొయ్యిలో ప్రవేశించినట్టనిపించింది నాకు. ఉక్కబోత ప్రారంభమైంది. అక్కడేదో అడివిలా సెట్టు వేశారు. కాగితాల్తో తయారు చేసి పెట్టిన రాళ్ళూ, రప్పలూ కంటికి బరువుగా కనిపిస్తున్నాయి. నరికి తెచ్చిన చెట్ల కొమ్మలు ఆకులన్నీ వాడిపోయి ఫెయిలయిన చిత్రాల నిర్మాతల్లా నిండి వున్నాయి. అక్కడా అక్కడా ప్లాస్టిక్ పువ్వులు తీగలూ కూడా అమర్చేరు. స్పాట్ లైట్లు, కెమేరా వగైరాలతో జనం హడావిడిగా ఏవో సర్దుబాట్లు చేసుకొంటున్నారు. 'మంచి పిడుగులు' అనే జానపద చిత్రం తాలూకు షూటింగట అది. కాస్సేపటికి రాకుమారుడి వేషంలో హీరోగారు సిగరెట్టు కాల్చుకుంటూ ప్రవేశించారు. ఆయన్ని నేనిదివరకు చాలా చిత్రాల్లో చూశాను. అంచేత చూడగానే గుర్తుపట్ట గలిగాను.

స్టంటు మేష్టర్లు, హీరో, ఒక గొరిల్లా కెమేరా ముందుకి చేరేరు. స్టంట్ మేష్టర్లు కొట్టుకుంటూ కుమ్ముకుంటూ షాట్ వివరిస్తున్నారు. బాగా ఎండెక్కినట్టుండి. ఉక్కబోత భరించలేకుండా తయారైంది. ఉన్న రెండు ఫాన్లు ఎంత తిరిగినా గాలి చాలడం లేదు. ఎంత ఫానుకంత గాలి. పీల్చడానికి సరిపోయే గాలి మాత్రమే కదుల్తోంది.

గొరిల్లా యాతన భరించలేక రెండు చేతుల్తోనూ తల వూడదీసేసుకుంది, ఆశ్చర్యపోయాను – వేలుమణి తల కనబడింది నాకు. నిన్న తను చెప్పిన పాత్ర యిదా అనుకొన్నాను. ఆయాసపడుతూ ముఖం నిండా పట్టిన చెమటల్ని తుడుచుకోబోతుంటే స్టంటు మేష్టరు 'ఊఁ ఊఁ! మాస్క్ తగిలించుకో!' అంటూ వేలుమణిని చేత్తో పొడిచేడు. సగం వూపిరితో సరిపెట్టుకుంటూనే వేలుమణి మాస్క్ తగిలించుకున్నాడు. మాస్క్ తగిలించుకున్న వేలుమణిని చూస్తుంటే మనిషిగా అనుకోవడం కష్టంగానే వుంది. అచ్చం గొరిల్లాలాగే కనిపిస్తున్నాడు. స్టంటు మేష్టరు "షాట్ రెడీ, లైట్స్ ఆన్..." అంటూ నాలుగైదు శబ్దాలు చేశాడు. హీరో మీదికి గొరిల్లా మీదికి దీపాలు ఫోకస్ చేశారు. గొరిల్లా నెమ్మదిగా వచ్చి తెలుగు సినిమాలో ప్రేమించుకున్నట్టు హీరోని వెనకనించి వాటేసుకుంది. హీరో ఏమీ కంగారు పడకుండా గొరిల్లా కడుపులో మోచేత్తో గుద్దాడు. ఆ దెబ్బకి వేలుమణి వెనక్కి తూలి కిందపడ్డాడు. 'కట్' అన్నారు. వేలుమణి బాధగా కడుపు చేత్తో పట్టుకుని లేవడానికి ప్రయత్నం చేస్తుంటే, స్టంట్ మాష్టరు "లే! లే!" అని గదమాయించాడు. అప్పుడు హీరో చిరునవ్వుతో "దెబ్బ గట్టిగా తగిలిందా బ్రదర్" అంటూ వేలుమణిని ఒంటి చేత్తో లేవదీశాడు. వేలుమణి సఫకేషన్ భరించలేక ఒక్కసారి మాస్క్ తీశాడు. చెమటలు పట్టిన అతని ముఖంలో బాధని నేను చూడలేకపోయాను. గంటకాలం వేడెక్కింది. అదే షాటు పదే పదే తీస్తున్నారు. వేలుమణి పడే వేదన నేను భరించలేకపోయాను. యాదవరెడ్డితో "బైటికి పోదాం" అన్నాను. "కాఫీ వచ్చింది, తాగి వెడదాం" అన్నాడు. కాఫీ నేను తాగలేకపోయాను. అది నా కంటికి మకిలి కాఫీలా కనబడింది. వేలుమణి చెమటలా కూడా కనబడింది. ఫీల్డులోకింకా ప్రవేశించకపోయినా కాఫీ తాగినట్టు బాగానె నటించాను.

ఫ్లోర్ బయటికి వచ్చేసే ముందు ఒక్కసారి వేలుమణి కేసి చూశాను. ఒక చేత్తో మాస్క్ పట్టుకుని జాలిగా నా వేపు చూస్తూ మరో చెయ్యి నీరసంగా వూపేడు. నేను ఆముదం తాగిన చిరునవ్వు నవ్వినట్టు ఒక చిరునవ్వు నవ్వి కదిలేను. నిన్న సాయంత్రమంతా నాతో తిరిగిన వేలుమణికి యీ వేలుమణి డూప్ లా అనిపించేడు.

"ఎలా వుంది?" అన్నాడు యాదవరెడ్డి.

"చాలా హృదయవిదారకంగా వుంది" అన్నాను.

"నీది మరీ కుర్రవాడి మనస్తత్వం. గొరిల్లా హీరోని చంపేస్తుందనుకున్నావా? కాదు. హీరో చేతిలో అదే చచ్చిపోతుంది."

"అవును చూశాను"

"గమ్మత్తేమిటంటే అది గొరిల్లా కాదు."

"అవును, వేలుమణి."

"వేలుమణీ కాదు వెంకటసుబ్బయ్యా కాదు. అది సీతామహాలక్ష్మి. మాంచి సెక్స్ డాన్సర్. చనుకట్టు తీరు బాగుంటుంది. సినిమాలో గొరిల్లా చావగానే శాపవిమోచనమై గంధర్వకన్య అవుతుంది. అప్పుడు గంధర్వకన్య వేషంలో సీతామహాలక్ష్మి డాన్సు చేస్తుంది. బ్రహ్మాండమైన ఓపెనింగ్స్ వుంటయి తను పిక్చర్లో వుంటే."

యాదవరెడ్డి మాటలు వింటూ ఎంతో సేపు గడిపాను. 'పనిమీద వచ్చావా?' అని అడిగినప్పుడు సెలవుల్లో ఏం చెయ్యాలో తోచక సరదాగా మద్రాసులో తిరిగిపోదామని వచ్చేశానని చెప్పాను. ఆ సాయంత్రం రెడ్డి నన్ను హోటల్లో రూము ఖాళీ చేయించి వాడింటికి తీసుకుపోయాడు.

ఫ్లోర్ లో అసంగతంగా విడిపోడం వల్ల మళ్ళీ వేలుమణి, నేనూ కలియడం జరగలేదు. అతని గురించి జాలిపడుతూ ఆలోచించడం తప్ప నాకు అతన్ని మళ్ళా కలిసే ప్రయత్నం చెయ్యాలనిపించలేదు. వేలుమణి కూడా ప్రయత్నించినట్టు లేదు.

వేలుమణిని చూశాక నాకు వేషం మీద మోజు తగ్గింది. నాల్గురోజుల పాటు వూళ్ళో తిరిగాను.

ఆ మర్నాడు రెడ్డితో పబ్లిసిటీ సెక్షన్ లో కూర్చున్నప్పుడు వేలుమణి పిల్లిలా వచ్చాడు. వంగి నమస్కారం పెట్టాడు. రెడ్డి వేలుమణిని చూడకుండా యాష్ ట్రే కదుపుతూ, నుసికేసి చూస్తూ "ఏవఁయ్యా!" అన్నాడు. నేను వేలుమణికేసి చూశాను. నాకేసి చూసి యిరకాటంగా చిరునవ్వు నవ్వుతూ

"అబ్బే! ఏమీ లేదండి" అంటూ నసిగాడు.

"ఏమిటయ్యా! పిక్చరంతా పూర్తయ్యాక, నీకు రావలసినదంతా ముందే తీసుకున్నావుగా"

"అది కాదండీ యీసారన్నా టైటిల్స్ లో కాస్త నాపేరు రాయించండి సార్"

రెడ్డి ఫకాలున నవ్వాడు. "ఓస్ అదా! సర్లే వెళ్ళు"

వేలుమణి చిన్నబుచ్చుకుంటూ వెనక్కి తగ్గేడు. నన్ను కూడా నవ్వు కలపమన్నట్టు రెడ్డి నాకేసి చూస్తే సగం నవ్వు కష్టంగా నవ్వాను.

ఆ తర్వాత రోజు రెడ్డి నన్ను ఆఫీసులో కూర్చోబెట్టి ఎక్కడికో వెళ్ళాడు. ఆ సెక్షనంతా తిరుగుతుంటే ఓ టేబుల్ మీద 'మంచి పిడుగులు' తాలూకు టైటిల్ షీట్స్ కనిపించాయి. యింకా డైరెక్టర్ పేరూ, నిర్మాతల పేర్లూ పూర్తిగా దిద్దలేదు. వెదికి చూస్తే వేలుమణి పేరెక్కడా నాక్కనపడలేదు. నాకు మళ్ళీ జాలేసింది. యింకా రెడ్డి రాలేదు. అక్కడ యీజీ చైరొకటి కనిపిస్తే అందులో అనీజీగా వాలి మళ్ళీ కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు తెరిచేసరికి వెళ్ళిపోతున్న వేలుమణి వెనకభాగం కనబడింది నాకు. యింకా రెడ్డి రాలేదు. ఎందుకో అనుమానం వచ్చి మళ్ళా టైటిల్ షీట్స్ దగ్గరికి వెళ్ళేను. పైకి తీసిన షీటు మీద ఉపపాత్రధారుల పేర్ల క్రింద "గొరిల్లా–వేలుమణి" అని కొంకి గీతల్తో రాసుంది. దాంతో ఆ షీటంతా అసహ్యంగా తయారయింది. ఆ సినిమా మొత్తానికి టైటిల్స్ ఒక్కటే బాగుంటాయనుకున్న నాకు, ఆ కాస్త ఆశకూడా పోయింది. అయినా ఎందుకో వేలుమణి మీద జాలిపడుతున్న నా మనసుకి వుపశమనం కలిగినట్టయింది.

మద్రాసు వదిలి వచ్చేముందు 'మంచి పిడుగులు' ప్రీవ్యూ చూశాను. విచిత్రం, టైటిల్స్ లో వేలుమణి పేరు కనబడలేదు. కుత్తుకలోనే కట్ చేసినట్టున్నారు. వేలుమణి ప్రయత్నం కాస్తా వెర్రి ప్రయత్నమైపోయింది. తెరచాటు బ్రతుకు మరీ కత్తెరచాటు బ్రతుకైపోయింది.

అన్ని చిత్రాల్లోనూ చిన్న పాత్రల్లోనే కనిపించే వేలుమణి చిత్రం ఏమిటంటే యిందులో కనీసం మనిషిగానైనా కనిపించలేదు. అచ్చుమచ్చు అడివిలో తిరిగే గొరిల్లాలాగే వున్నాడు. జంతువై మరణించాడు. నాకు మాత్రం వేలుమణి మరణించినట్టు వుంది. చివరికి ప్రేక్షకులు వేలుమణిని వేషం వేసిన మనిషి అని కూడా అనుకోరు. ఏ సర్కసు మృగమో అనుకుంటారు. కానీ వేలుమణి కూడా చిత్ర విజయానికి తోడ్పడాతాడు. పాపం! తాజ్మహల్ కట్టిన కూలీలాగే తారాపథంలో వేలుమణి కనపడని నక్షత్రంగా వుండిపోతున్నాడు.

ఏమిటో నటుణ్ణి కావాలని మద్రాసు వెళ్ళి వేలుమణి ధర్మమా అని మళ్ళీ కథ వ్రాయడం మానేయడం మానేసి, రచయితనయి పోయాను. నేను మరి కంచికి వెళ్ళను.

★★★

# జీపు కదిలి పోయింది

## ఉషారాణి భాటియా

## (జయశ్రీ మాసపత్రిక, 1969 జనవరి సంచిక, నుంచి పునర్ముద్రణ)

చుట్టూ నిలువెత్తున దుమ్ము, కళ్ళు మసక బారిపోతున్నాయి. దూరాన అక్కడక్కడ గుబురు చెట్లు తప్ప మనుష్య సంచారం ఎక్కడా లేదు. ఓ పక్షి కిచ కిచ, కుక్క మొరగటం ఆ నిశ్శబ్దంలో స్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఉండీ ఉండీ సీటుపైకి ఎత్తి వేస్తోంది. టైరు కింద రాళ్లు కరకరమంటున్నాయి దీపాలు పెట్టే వేళయిందేమో జీపు వేగం హెచ్చించాడు డ్రైవరు. కుదుపు ఎక్కువైంది. కుడిచేత్తో సీటుని గట్టిగా అదిమి పట్టుకుంది సుజాత.

"కాస్త చూసి వెళ్ళు నాయనా! మరీ పేగులు పైకి వచ్చేట్లున్నాయి" అన్నది ప్రక్కనే కూర్చున్న డ్రైవరుతో.

"ఇంకా చాలా దూరం వెళ్ళాలంటమ్మా ! పొద్దుపోతే మరి దారి కనపడదు. దారిలో ఎక్కడైనా ఆగామా గుక్కెడు నీళ్ళు కూడా దొరకవు."

అన్నాడతను.

సుజాతకి ఒళ్ళంతా బిగుసుకున్నట్లయింది. డ్రైవర్ని మాట్లాడిస్తే, ఇంకా ఏం వినవలసి వస్తుందోయని తలపక్కకి తిప్పి బైటికి చూడటం మొదలెట్టింది.

ఆమె మనసుకి ఊరటనీ, చల్లదనాన్ని కలిగించె దృశ్యాలేం లేవు బయట కటికి చీకటి దూరాన మిణుకు మిణుకు మంటూ లాంతర్ల వెలుగు చెవులు గింగిర్లెత్తించే జీపు యింజను హోరు.. ఆమె తల వెనక్కివాల్చి కళ్ళు మూసుకుంది.

★ ★ ★

"అమ్మగారూ! లేవండి! వచ్చేశాము, ఈ మనిషికి మీ కాయితాలు చూపించండి."

సుజాత ఉలిక్కిపడ్డట్లు కళ్ళు తెరిచింది ఆమె ముఖం మీద లాంతరు వెలుగుపడుతోంది. ఆరడగుల ఎత్తు 'బుర్ర మీసాలు' తెల్లని తలపాగా ఆ చీకట్లో లాంతరు పట్టుకున్న వ్యక్తి కళ్ళు మరింతగా మెరుస్తున్నాయి. సుజాత పర్సుతీసి, తన విజిటింగ్ కార్డు పైకి తీసింది.

"ఇందులోనే కూర్చునుండండీ, వస్తాను." అంటూ బంట్రోతు వెనక్కి తిరిగాడు.

పెద్ద ఇనపగేటు. దానిమీద బరువుగా తాళం, కిర్రుమని శబ్దంచేస్తూ, అతను తాళం తీశాడు. కానీ లోపలికి వెళుతూనే గేటు లోపల్నుంచి గడియబెట్టాడు.

సుజాత కాస్సేపు బుద్ధిగా జీపులో కూర్చుంది. కానీ ఆ గేటువంక చూస్తున్న కొద్దీ ఆమె కుతూహలం ఎక్కువయింది. లేచివెళ్లి దాన్ని పరీక్షగా చూడసాగింది. ఆ గేటులోంచి ఎంతదూరం లోపలికి వెళితే, యిల్లు లాటిది ఊహించటం కష్టం.

డ్రైవరు జీపులో కాళ్ళుచాచి కునుకు తీస్తున్నాడు. సుజాత టార్చి వేసుకుని తనచేతి గడియారం చూసుకుంది. తొమ్మిది కావస్తోంది. దాహం వేస్తుంది. ఆకలిగా కూడా ఉంది. ఆలోచిస్తూ ఆ పక్కన సిమెంటు చప్టా మీద కూర్చుంది.

దూరంగా ఏవో గొంతుకలు వినిపిస్తున్నాయి, గడియతీసిన శబ్దం. ఇద్దరు వ్యక్తులు బైటికి వచ్చారు.

"నమస్కారము నన్ను రంగమ్మ అంటారు" అంటూ ఓ నడివయస్కురాలు సుజాతకి తన్ను తాను పరిచయం చేసుకుంది. పక్కనే ఓ ముసలాయన, గుమస్తాలా వున్నాడు.

"ఈ వేళప్పుడు పంతులుగారు ఎవర్నీ చూడరు రేపు ఉదయమే ఆయన్ని కలుద్దురుగాని, అలా అని ఆయన చెప్పమన్నారు. ఈ పూటకి నా ఆతిథ్యం స్వీకరించండి" అందామె.

సుజాత తెల్లబోయింది. నిరాశతొ పెదిమ విరిచింది.

"నేను చాలా దూరం నుంచి వస్తున్నాను. వెంటనే తిరిగి వెళ్ళాలి కూడా." అన్నది నిరుత్సాహంగా.

బంట్రోతు గేటుకి తాళం పెట్టేస్తున్నాడు. సుజాత చేసేది లేక, వెనక్కి తిరిగింది. జీపులోంచి తన తోలుసంచీ తీసుకుని, డ్రైవరు చేతిలో డబ్బులు పెట్టింది.

జీపు కదిలింది. రంగమ్మ సుజాత చేతిలో పెట్టె అందుకుంది. సుజాత చేతి రుమాలుతో ముఖం తుడుచుకుంటూ, పక్కనే నడుస్తున్న రంగమ్మ వంక పరిశీలనగా చూసింది. ముభావంగా, మౌనంగా నడుస్తోందామె.

★ ★ ★

చిన్న పెంకుటిల్లయినా, శుభ్రంగా వెలుగ్గా వుంది రంగమ్మ ఇల్లు. ఆమె ఆతిథ్యమూ, ఆప్యాయంతో మిళితమై వుంది.

ఆ మర్నాడు తెల్లారుతూనే, రంగమ్మ సుజాతని లేపింది. స్నానం అదీ ముగించి ఏడయే సరికి, సుజాత తయారయిపోయింది. రంగమ్మ యింటినుంచి సరిగ్గా, ఫర్లాంగు దూరం నడవవలసి వుంది.

వీధిలోకి రాంగానే, ఆ పరిసరప్రాంతాలు, సుజాతని నిలబెట్టేశాయి. ఉదయపుటెండలో, పచ్చని పొలాలు, చెట్లు మెరుస్తున్నాయి. చెంపలకి చల్లగా గాలిసోకుతోంది. దూరాన, పల్లెస్త్రీలు కడవలతో వయ్యారంగా నీళ్ళు తోడుతున్నారు.

"అంతా ఎడారి జీవం లేదంటారు మీ రాజస్థాన్ లో! కానీ ఎంత బాగుంది!" అన్నది సుజాత పక్కన నడుస్తున్న రంగమ్మతో.

"అబ్బే! ఇదేం చోటండీ! వుత్తి అడవి ఈ ప్రాంతాల అందాలు చూడాలంటే, ఉదయపూర్ ! జయపూర్ లాంటి చోట్లకి వెళ్ళాలండీ! ఆ కొండలు, కోటలు, సెలయేళ్ళు ; మళ్ళీ వెనక్కి తిరిగి వెళ్ళాలనిపించదు... ఇక్కణ్ణుంచి వెళ్ళి అవన్నీ చూడరా మీరు ?"

"ఊహూ పనిమీద వచ్చాను. వెంటనే తిరిగి వెళ్ళిపోవాలి. ఏ శలవుల్లోనో అయనా, పిల్లలూ, అంతా వస్తాము."

సుజాత ముఖంలో మొదటిసారిగా చిరునవ్వు వెలిసింది.

రంగమ్మ ఆమె వొంక అదోలా చూసింది.

★ ★ ★

అది ఒక విశాలమైన గది పెద్దబల్ల, టెలిఫోను దానికెదురుగా కుర్చీలో దినపత్రిక చేతిలో పట్టుకు కూర్చున్నాడు ఓవ్యక్తి వయసు దదాపు అరవై వుంటుంది నల్లగా, పొడుగ్గా. తెల్లని జుత్తుని దాస్తున్న గాంధీ టోపీతో.. తన వూహకి పూర్తి వ్యతిరేకంగా వున్నాడనుకుంది సుజాత.

"కూర్చోండి మీకు నేను ఏం సహాయం చేయగలను?"

సుజాత తన పర్సులో విజిటింగ్ కార్డుకోసం వెతుకుతోంది.

"రాత్రి చూశాను,"

అన్నాడతను ఆ కంఠం ఏదో ముభావంగా తోచింది ఆమెకి.

"నేను ఒక వారపత్రిక తరఫున వచ్చాను. మా పత్రికలో కొన్ని కొత్త శీర్షికలు ప్రారంభించాము ఈ సందర్భంగా మీ సంస్థని గురించి రాయాలని మా వుద్దేశం మా సంపాదకులనుంచి మీకు ఈ లేఖ తెచ్చాను. మా పత్రిక నమూనా కూడా చూడండి."

అంటూ సుజాత అతనికి ఓ ఉత్తరం అందించింది.

"పత్రికల్లో రాయవలసిన సంస్థ కాదే మాది!" అంటూ ఉత్తరం తిరిగి ఇచ్చాడతను.

"క్షమించాలి ఊర్లూ పేర్లూ ఇవ్వము. మీ సంస్థ యొక్క ఉద్దేశాలూ, ఎలా నడుపుతున్నదీ ప్రజానీకానికి ఎంత సేవ చేస్తున్నదీ తెలుపుతాము."

"క్షమించాలి మాకు ప్రచారం అవసరం లేదు, దానికి దూరంగా వుండేందుకే ఇక్కడికి వచ్చింది."

"మీకు అవసరం లేకపోవచ్చు, కాని మాకు తెలియాలి ఇటువంటి ఉత్తమ సంస్థలవల్ల సహాయం పొందాలంటే ఎలా అందుకనే మా పత్రిక ద్వారా...."

సుజాత మాట పూర్తిచేయకముందే అతను సొరుగులోంచి కొన్ని కాయితాలు తీసి, ఆమెకిచ్చాడు.

"ఇవి చూసుకోండి, అన్నీ తెలుస్తాయి."

చాలా థాంక్సు ఇవి చదువుతాననుకోండి కానీ, నన్ను మీ సంస్థని ఒకమాటు చూడనిస్తే, ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలు స్వయంగా చూసి రాయగలుగుతాను. అందుకే ఇంతదూరం వచ్చింది!"

"ఎంత పొరపాటు చేశారు! కాలం, డబ్బు వృధా చేశారు, నాకు ముందుగా జాబురాసి వుండవలసింది" అతను ఆగాడు. "మీకు తెలియదేమో ! మా సంస్థలోకి పైవాళ్ళెవరనీ రానీయము మా సంస్థని గురించి సరదాగా ఓ కథ రాద్దామని వచ్చివుంటే, అవివేకమే!"

సుజాత తెల్లబోతూ అతనివంక చూసింది.

అతని ముఖం రంగులు మార్చుకుంది కుర్చీలోంచి లేచి, పచార్లు చేయసాగాడు.

"మా రక్షణ కోసం వచ్చిన స్త్రీలని మేము ఎవరికంటా పడనీయము. నలుగురుకీ వాళ్ళెవరో తెలిసి ప్రచారం జరిగితే యిక వారికి పునర్జన్మ ఏది? మా రక్షణకి అర్ధం ఉండదే? వారికి ధైర్యమూ, ఆరోగ్యమూ, శాంతినీ ఇచ్చే తాత్కాలిక గృహం మటుకే అది తరవాత వాళ్ళు మళ్ళీ బాహ్య ప్రపంచంలో అడుగుపెట్టి వారివారి జీవితాల్ని చక్కదిద్దుకుంటారు. వారికి ఆ అవకాశం కలిగించేందుకే ఇలా దూరంగా వుంచటం.

ఇక వారి ఊరూ, పేరూ మచ్చుకి కూడా తెలియనియ్యము, మీరు నమ్ముతారో లేదో సొంతవాళ్ళు చివరికి తల్లిదండ్రులు వచ్చినా వారిని చూపించము"

"మరి వాళ్లు ఇక్కడికెలా వస్తారు?"

"కాలం, కర్మం తోసుకురాగా ఈ వాకిట వచ్చి వాలుతారు. కొందర్ని స్నేహితులు దింపుతారు, కొందరికి ఉదార హృదయులు సలహా ఇచ్చే పంపుతారు, వారినీ ప్రశ్నలవీ వేసి మేము బాధించము. ఆహారము, వస్త్రాలు ఇచ్చి, పాపల్ని చేతుల్లోకి తీసుకునేంత వరకూ కాపాడుతాము తరువాత వారి ఇష్టానుసారం వెళ్ళిపోతారు."

"ఆ పాపల్ని ఏం చేస్తారు?"

"వాళ్ళు మా దగ్గిరే వుంటారు. తల్లులకి ఆసక్తి వుంటే, జీవనోపాధికి కావలసిన వృత్తులు నేర్పుతాము, అలా తర్ఫీదుపొంది పిల్లల్ని తీసుకుని మరీ వెళ్ళిన వాళ్ళూ వున్నారు కాని వాళ్ళకీ మాకూ మధ్య ఎటువంటి ప్రత్యుత్తరాలూ జరగవు. వాళ్ళు ఇటుపక్కలకి రావటం కూడా జరగదు."

సుజాత నిరుత్సాహంగా అతనివొంక చూసింది. లేచి వెళ్లబోయి. మళ్ళీ ఏదో స్ఫురించినట్లు అతని వంక చూసింది.

"మా పత్రికలో మీరిచ్చిన కాయితాలతో ఒక వ్యాసం రాస్తానులెండి; కానీ వృత్తి రీత్యా కాక, వ్యక్తిగతంగా మిమ్మల్ని ప్రార్ధిస్తున్నాను. మీ సంస్థలో ఏ పిల్లతోనైనా సరే కాస్సేపు మాట్లాడే అవకాశం యిస్తారా? అంటే వారి జీవితాల్ని నాశనం చేసే పరిస్థితుల్నీ, సంఘంలోని కుళ్ళునీ మచ్చుకి తెలుసుకోవాలని వుంది. ఒకస్త్రీగా ఈ సత్యాన్ని తెలుసుకోగోరుతున్నాను నేను తెలుసుకున్నది మటుకి ఈ గేటుదాటి పైకి పోనివ్వనని మాట యిస్తాను"

సుజాత ఆశగా అతనివంక చూసింది.

"అయామ్ సారీ ! ఇది అసాధ్యం ... మా సంస్థ నియమాలకి విరుద్ధం."

అంటూ తల విదిలించాడు తను

సుజాత సాలోచనగా లేచినిలబడింది. అతను తిరిగి పత్రిక చేతిలోకి తీసుకున్నాడు తలుపు దాటుతున్న సుజాతని మౌనంగా చూశాడు.

"ఆగండి !" అంటూ లేచి నిలబడ్డాడు.

"మీకు ప్రత్యేకంగా ఈ అవకాశం ఇస్తున్నాను. మా సంస్థలో యిచ్చే శిక్షణలన్నిటిలో ప్రధమంగా నిలబడుతున్న ఓ అమ్మాయిని చూపిస్తాము. ఆమెని ఏ విధంగా మాటాడిస్తారో మీమీద ఆధారపడివుంది. కాని మిమ్మల్ని పూర్తిగా విశ్వసిస్తున్నాను సుమండీ !"

సుజాత ముఖం తృప్తితో విప్పారింది.

బంట్రోతు దారి చూపగా, వరండా మీదుగా, లోపలికి వెళ్ళింది.

★ ★ ★

చాలా చిన్నగది అది ఒక మూలగా నులకమంచం, కూజా, గ్లాసూ, పచ్చరంగు దళసరి పరదాలు సుజాత గదిలో ప్రవేశించిన అయిదు నిముషాలకి గాజుల చప్పుడయింది.

"గంగులూ ! నువ్వా ?"

సుజాత తనకి తెలియకుండానే అరిచింది.

నీలం గళ్లచీర, నల్ల రవిక, మెడలో ప్లాస్టిక్కు దండా అదురుతున్న నల్లని కాటుక కళ్ళు పట్టుమని, ఇరవై ఏళ్ళన్నా నిండని ఆ పిల్ల. సుజాత వొంక బెదిరిపోతూ చూసింది కాళ్ళు ఒణుకుతున్నాయి శరీరం అదుపులో పెట్టుకోలేక, చప్పున సుజాత చేతులు పట్టుకుంది.

"మీరు ఇక్కడికెలా ? ... ఎవరు చెప్పారు ? నేను మీతో రాను ఇంక ... రాను."

గంగులు బావురుమంది.

సుజాత అనునయంగా, ఆ పిల్ల తలనిమిరింది. "పిచ్చిపిల్లా ! ఎంతపని చేశావ్ ! నాతో ఒక్కమాట చెప్ప కూడదూ ? అంత ప్రేమగా చూసుకున్న నిన్ను వీధిపాలు చేస్తానా ?"

సుజాత కళ్ళు తడి అయాయి.

"చెప్పు ! ఇపుడు చెప్పు ! ఎవరా దౌర్భాగ్యుడు ? అసలు ఇదంతా ఎలా జరిగింది ? కారు డ్రైవరయితేనేం. నీ కిష్టమైతే యిచ్చి పెళ్ళి చేయనా ? నేను ఊళ్ళో లేకుండా చూసి అసలెందుకు పారిపోయావ్ ?"

సుజాత గంగులు ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తోంది. గంగులు మటుకు బిత్తరపోయినట్లు కూర్చునివుంది నోరు మెదపలేదు తల వొంచేసుకుంది.

"చూడు గంగులూ ! నీకు బాధగా వుంటే చెప్పొద్దులే !"

సుజాత మనసెలాగో వుంది. గంగులు తలెత్తింది. "నన్ను తల్లిలా పెంచారు. కూడూ గుడ్డా ఇచ్చి ఆదరించారు మీకీ విషయం చెప్పి ఎలా బ్రతగ్గలను ? ఎవర్నయితే ఈ జీవితంలో మరి కలవకూడదనుకున్నానో, వాళ్ళే ఎదురైతే ఏం చేయటం? మరిచి పోదామనుకున్న ఈ నిజం ఇవాళ చెప్పక తప్పదా ?" గంగులు తనలో తనే వెక్కిళ్ళతో అనుకుంటుంది.

సుజాత ఆలోచిస్తుంది.

"వినండమ్మా ! వినండి కానీ ఏం బాగుంటాయి మా కథలు. విని జాలి పడతారు మమ్మల్ని వూరికి దూరంగా యిళ్లలో దాస్తారు మా పిల్లల్ని రహస్యంగా పంచి పెడతారు. కానీ ఎవరికి కావాలి మేము? ఎవరు గౌరవిస్తారు మమ్మల్ని ? ద్రోహం చేసిన బాబులా ? ఊహూ.... వాళ్ళకి మేమంటే భయం పోనీ మిగతావాళ్ళు ? మనిషిగా మళ్ళీ మమ్మల్ని వాళ్ళలో కలుపుకుంటారా ? పక్కన చోటు యిస్తారా ?"

ఇప్పుడు గంగులు కళ్లలో నీళ్ళు లేవు. ముఖం ప్రశాంతంగా వుంది ఆ పిల్లనీ చూస్తుంటే, సుజాతకేదో దడగా వుంది.

"దిక్కూ మొక్కూలేని నాకు మీ నాయన నీడ యిచ్చారు. నా పదో ఏట, మీరు పెళ్లయి కాపురానికి వెళుతుంటే, కూడా వచ్చాను. పని మనిషిగా కాదు తోడుగా, మీ సంసారం పెరిగి, బాధ్యతలు పేరుకున్న కొద్దీ, నా అవసరమూ పెరుగుతూ వచ్చింది మీరిచ్చిన అన్నమూ, బట్టలూ, ఆ యిల్లూ చూసి మురిసిపోతూ జీవితాంతము అలాగే చల్లగా గడిచిపోవాలని కోరుకునేదాన్ని. ఎప్పుడైనా మీకు కోపం వచ్చి కసురుకున్నా, మీ పుట్టింటినుంచి పిలుపు వచ్చినా, మీ యిల్లు వదలాలని నాకు అనిపించేది కాదు. అంత కాపీనంగా వుండేది మీ నీడ అంటే !

అది మీరు బెజవాడ వెళ్ళిన రోజు రాత్రి, ఇల్లంతా చీకటిగా, భయంగా వుంది. తోటమాలి గేటుదగ్గిరే పడుకున్నాడు. అర్ధరాత్రి తలుపు చప్పుడైంది. దీపం వేసి, ముందు కిటికీలోంచి బైటికి చూశాను.

వాన పడుతున్నట్లుంది. అయ్యగారు తడుస్తూ బైట నిలబడి వున్నారు. ఆదరా బాదరా తలుపు తెరిచాను. ఇంత అన్నం వుడకేసి, ఆయన బాగా అలిసినట్లు వున్నారు. అన్నం వద్దంటూ పడుకున్నారు కాస్సేపటికి, ధర్మామీటరు పట్రమ్మని కేకవేశారు. కాసిని మంచినీళ్ళు కూడా తెమ్మన్నారు గ్లాసు అందుకుంటూ ఆయన నా వొంక కొత్తగా చూశారు.

"అమ్మాయ్ నీకిప్పుడెన్నేళ్ళు" అనడిగారు.

"పదిహేను." అన్నాను. వెళ్ళిపోబోతూ.

"ఇలా చూడు ! నా తల కొంచెం పట్టు !" అన్నారు. కళ్ళు మూసుకుంటూ.

నాకు చాలా భయం వేసింది. అసలు వ్యాపారం అంటూ వూళ్ళు తిరిగే అయ్యగారు యింట వున్నప్పుడు కూడా నేను ఆయన ఎదట పడేదాన్నికాను. ఆయన పనులయినా చేసి ఎరగను. వంటింట్లో మీకు సహాయమేమిటో, పిల్లల్ని ఆడించటం ఏమిటో అదే నా ప్రపంచం. అటువంటిది అయ్యగారావేళ అలా పిలిచేసరికి, చాలా కొత్త, భయం అనిపించింది.

కానీ చేసేదేమీ లేక, నేలమీద కూలపడుతూ, ఆయన తలమీద చెయ్యి వేశాను ఆయన చటుక్కున లేచి, నన్ను లేవనెత్తారు.

అర్థరాత్రి చుట్టూ భోరున వాన నేను గట్టిగా అరిచినా ఆదుకునే దిక్కులేదు. అజ్ఞానం, భయం, దిగులు నన్ను చుట్టు ముడుతున్నాయి. కానీ ఏదో ప్రమాదం జరగబోతోందని గ్రహించాను. ఏడ్చాను బ్రతిమాలాను మొత్తుకున్నాను. చచ్చిపోతానన్నాను.

కానీ ఆయన పట్టు విడువలేదు ఆయన కళ్ళు ఎర్రబారాయి తన మాటకి తిరుగులేదన్నారు మాటవింటే, అందలం ఎక్కిస్తానన్నారు. లేదా .. ఆ పరిస్థితిలో ఒక ఆడపిల్ల ఎంత నిస్సహాయం కాగలదో అంతా అయిపోయాను. ఆ రోజుతోనే ఆ యింటికీ నాకూ ఋణం తీరిపోయింది.

రంగన్న నా జీవితంలో ప్రవేశించింది అప్పుడే. అతని సాయంవల్లనే ఇక్కడికి చేరాను. డ్రైవరు రంగన్నతో నేను లేచిపోయానని, లోకం ఆడిపోసుకోక మరేం చేస్తుంది !

మీ మటుకు మీరు ఆ క్షణంలో నన్ను నమ్మేవారా ? బాబుగారితో ఘర్షణపడి, యిల్లు, సంసారం వదులుకునే వారా? నన్నే నిందించేవారు. డబ్బిచ్చి, దొంగతనంగా నన్ను వదిలించుకునేవారు అంతెందుకు ? నా కడుపున పుట్టినది ఎవరిబిడ్డో బాబుగారు ఒప్పుకుంటారా? రంగన్న పేదవాడయినా అతని మనసు పేదది కాదని ఎందరికి తెలుసు ? పెద్దవాళ్ళ తప్పులు పెద్దవిగానె వుంటాయని ఎవరు నమ్ముతారు ?"

గంగులు కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి.

★ ★ ★

సుజాత కాళ్లకింద భూమి కదులుతోంది. ఆమె కళ్ళలో జాలి భయం కింద మారింది చేతిలో కాయితాలు జారిపోయాయి కాళ్ళు గుమ్మం వైపు పరుగుతీశాయి.

"జాగ్రత్తగా వెళ్ళిరండమ్మా ! జయపూర్ అదీ చూసేందుకు మళ్ళీ ఎప్పుడొస్తారు ?"

రంగమ్మ వెనకనుంచి కేక వేస్తోంది.

"జీపు, త్వరగా పోనీయ్ !" అంటూ ఎక్కి కూర్చుంది సుజాత.

దుమ్ము రేపుకుంటూ జీపు కదిలి పోయింది.

★★★

# ఆఫీసరూ.. లీవివ్వవూ!?

## మజుందార్

## (జ్యోతి మాసపత్రిక, 1969 జనవరి సంచిక, నుంచి పునర్ముద్రణ)



ఫైళ్ళలో దూర్చిన తల ఎత్తి ప్యూను నర్సయ్య వైపు కొశ్చన్ మార్కు ముఖంతో చూసేను. నాబోటివాళ్లను ఎంతో మందిని చూసి వున్న నర్సయ్య నా ముఖంలో ఫీలింగ్స్ పసిగట్టి అన్నాడు “ఏమోనండీ.. నాకదంతా తెల్దు.. ఆయన చేతిలో ఏదో కాగితం మాత్రం వుంది.” నే నులిక్కిపడ్డాను. నిన్ననే నర్సయ్య నా ‘లీవ్ అప్లికేషన్’ అయ్యగారి దగ్గరికి చేర్చి వుంటాడు. కుర్చీ వెనక్కి తోసి నేను ముందుకు నడిచేను. అన్ని తలలు ఫైళ్లలోంచి బయటికి వచ్చాయి. కళ్లజోళ్ళలోంచి చూసేవి, మామూలువి వెరసి అందరి కళ్ళు నా మీదే వున్నాయి. పైలట్ లా నర్సయ్య ముందు వెళ్తుంటే కాలర్ సర్దుకుంటూ ఆఫీసర్ గదివైపు నడిచేను.

ఆయన ఏదో కాగితం తిరగేస్తున్నట్లున్నారు. నా రాక గమనించలేదు. నేను వచ్చిన సూచనగా సన్నగా దగ్గేను. ప్రక్కగా టైపు మిషన్ మీద నాట్యం చేస్తున్న స్టెనో మంజుల వేళ్ళు ఆగిపోయాయిగాని, ‘స్ట్రిక్టు’ అని పేరు తెచ్చుకున్న ఆఫీసరు నరసింహమూర్తిగారి చూపులు మాత్రం కాగితానికి బెత్తెడు కిందకు గాని పైకి గాని జరగలేదు. ఇక దగ్గి లాభం లేదని “పి లి చా ర ట గా!” అన్నాను. ఎన్నడూ లేనిది ఏమిటబ్బా! నా మనసు ఇలా అలలపై తేలిపోతున్నది ? అందులో ఆఫీసర్ ముందు అంత ధైర్యంగా... ఓహ్ !

ఆయన చూస్తున్నది ఆపి “కూర్చో” అన్నారు.

వెంటనే కూర్చోవటం గుమస్తాలకు రివాజు కాదుగాబట్టి నిల్చొనే “చెప్పండి” అన్నాను.

"ఈ లీవ్ లెటర్ నీదేనా ?"

"ఇటివ్వండి. చూసి చెబుతాను" అని తీసుకున్నాను ఆయన చేతిలో కాగితం.

నాకళ్ళు ఆయన కళ్ళలో కనపడ్డ ఆశ్చర్యం 'కాచ్' చేయకపోలేదు.

చూసి నిర్లక్ష్యంగా టేబుల్ మీద పడేస్తూ "క్రింద నా సంతకం, బ్లాక్ లెటర్స్ లో నా పేరూ ఉన్నాయి గదండీ" అన్నాను.

ఆయన భ్రుకుటి ముడుచుకుంటున్న కొద్దీ నాకు ఉత్సాహం ఎక్కువయింది. ఇవాళ యిక భయపడదలుచుకోలేదు. తాడో పేడో తేల్చుకోవాలి కుంటిసాకులు చెప్పి 'లీవ్' గ్రాంటు చేయకపోవటం ఆయన అలవాటు. నాకు గుర్తున్నంత వరకు, ఎవరికీ సణగకుండా, ఆఫీసు భాషలో చెప్పాలంటే 'ఏడవకుండా' ఎప్పుడూ ఒక్క 'కాజువల్ లీవ్' కూడా శాంక్షన్ చేసిన పాపాన పోలేదు.

"ఇప్పుడు ఈ లీవ్ ఎందుకు ?"

అన్నాక విచారించి వుంటాడు. అదిగాక నా జవాబువిని నాలిక సగం కొరికేసుకుని ఉంటారు... "అదీ దానిలోనే వుందండీ.. చూడండి" అన్నాను. ఆయన బిత్తరపోయినట్లు కనపడ్డారు ఎవరూ ఆయనకు ఇలా సమాధానం చెప్పి వుండరు.

కళ్ళజోడులోంచి లీవ్ లెటర్ చూస్తూ అన్నాడు

"పెళ్ళా ! నీకా?"

పెళ్ళి నాకు నిషిద్ధమయినట్టు నేను పెళ్ళికి తగనూ అన్నట్లు.. చెప్పొద్దూ నాకు మండిపోయింది.

"ఓరి ఓయీ నరసింహమూర్తీ! ప్రతిలీవు భయంకరా! నీ బోడి హ్యూమర్ చాలించు" అని గర్జిద్దామనుకున్నాను గాని వేళగాని వేళ పాడిగాదు యని ఊరుకొని,

"మరేనండి" అని ప్రకాశముగా అన్నాను.

టైపు మిషన్ ముందు మంజుల ముసి ముసి నవ్వుల మీద జేబురుమాలు కప్పేసింది

"చూడు సుబ్బారావ్ ! నీవు యింతకుముందు లీవ్ ఎప్పుడు తీసుకున్నావ్ ?"

నేనే కాదు, మన ఆఫీసులో ఎవరయినా అని మనసులో అనుకొని పైకి మాత్రం "మీరు యీ ఊరు రాకముందండి" అన్నాను కసిగా.

"అంటే ఒక సంవత్సరం అయిందన్నమాట" అన్నాడు నా విట్టు పట్టించుకోకుండా.

"ఏదో తమదయవల్ల..." గరళం బయటకు వస్తున్నది.

ఎప్పుడు లీవు అడిగినా యిచ్చిన పాపాన పోలేదు. అనవసరంగా పెళ్ళి రెండుసార్లు వాయిదా వేసుకోవలసి వచ్చింది. అందుకనే కసి అంతా చూపెడుతూ ఆ మాట అన్నాను.

కళ్ళజోడుకింద పెదాలు నవ్వేయి జేబులోంచి పెన్ దీస్తూ అన్నారు. "ఇం కెం త లీ వుం ది?"

"ఎంతుంటే ఏంలే గురూ! నీవిచ్చేదా చచ్చేదా ?" అని మనసులో అనుకుని "ఓ నెలరోజుల పైమాటే" అన్నాను.

"పొడిగించవు కదా?"

నాలో ఆశలు చిగురించబోతున్నాయి, వెంటనే అన్నాను "మీ మీద ఒట్టు."

"పెళ్ళి ఎన్ని రోజులు జరుగుతుందంటావ్ ?"

ఆ గొడవలన్ని నీకెందుకు? అని స్వగతంలో అనుకుని "బహుశః ఒకటో.. రెండో.. మూడో.. నాలుగో ఐదో.." తర్వాత పొడటం నాకే బాగనిపించలేదు.

"అవునా! మహా అయితే వారం వేసుకో. అవునా ? నీవే ఒప్పుకుంటున్నావా ?"

నరసింహమూర్తి గారు ఈ సంభాషణ ఎక్కడకు తీసుకు వెళ్తాడో తెలియటం లేదు యీమారు కూడా లీవు ఎగనామం పెట్టే సూచనలే కనపడుతున్నాయి.

"వాట్ సుబ్బారావ్ ! మాట్లాడవు ?" చిన్న సైజు అరుపులాంటి ఆఫీసర్ గారి మాటకు యీ లోకంలోకి వచ్చేను.

"అంతే గదండి. యీకాలం ఒక రోజు పెళ్ళిళ్ళే గగనం.. అటువంటప్పుడు అయిదురోజులంటే కష్టమే కదండి" అని లౌక్యమాడేను.

"అవునా మరి ! నీవు నెలరోజులు సెలవు పెట్టావా! నిజంగా నెల అవసరమంటావా ! ఓ వారం రోజులు చాలదూ ! వచ్చేది ఇనస్పెక్షన్ పీరియడ్... నీలా సిన్సియర్ గా చేసేది ఎంతమంది చెప్పు ! నీవు నెలరోజులు పెడితే...!"

బహుశః ఆయన సభ్యత కోసం గుండెలు బాదుకోలేదుగాని అంత మాటలన్నాడు. 'కాకా'కు పడేది లేదు నరసింహమూర్తీ యివాళ అనుకున్నాను.

నాకు చిర్రెత్తుకొచ్చింది. సెలవు అడిగితే యివ్వడు. పైగా ఉపన్యాసాలిస్తాడూ ! నేనేం సరదాగా సెలవుపెట్టి సినిమాకు వెళ్తున్నానా ? లేకపోతే క్రికెట్ మ్యాచ్ కు వెళ్తున్నానా ? నా పెళ్ళికి .. నా స్వంత పెళ్ళికి వెళ్తుంటే కాదంటాడా ? ఈ శిక్షకు నేరమేమిటి ? సహింతునా ? నే సహింతునా ? అని పాడుకుని పైకి ఏం మాట్లాడలేదు.

ఆయనే ఉపన్యాసం కంటిన్యూ చేస్తూ అన్నాడు.

"చూడు సుబ్బారావ్ ! నీకున్న సెలవులన్నీ ఇప్పుడే వాడేసుకుంటే ముందు ముందు ఎంత నష్టమో నీకెలా తెలుస్తుంది ? అనుభవం ఉండాలోయ్ ! ఓ వారం రోజులకు... మరేం అనుకోకు శాంక్షన్ చేస్తాను. అదీ చెయ్యక పోదును, పెళ్లి అంటున్నావు కాబట్టి..."

నాలో సహనం నశించి పోయింది. ఇంత సేపు అడిగి యిదా నీవు చేసే నిర్వాకం ? సగం ఉషారు చచ్చి పోయింది మంజుల వేపు చూసేను నేనేం చెబుతానా అని టైపు మిషను మీద వేళ్ళు చేస్తున్న నాట్యం ఆగిపోయింది.

"ఒరేయ్ ... పి చ్చి వె ధ వా ! లొంగకు గాక లొంగకు. ఇప్పటిదాక ధైర్యంగా 'రెక్ లెస్' గా జవాబు చెప్పి యింతలో మెత్తబడుతున్నావా, చిట్టితండ్రీ దబాయించు ఇది నీ పెళ్ళి... నీ పెళ్ళి సుబ్బారావ్ !" అన్ని వైపుల లోంచి సినిమాలోలా వేయి గొంతులు అరుస్తున్నాయి. టేబుల్ మీద ఫోను, ఆఫీసర్ కాలింగ్ బెల్, మంజుల హోల్డా టైపు అన్నీ "లీవ్ !... లీవ్ !" అని అరుస్తున్నట్లనిపించింది. వాటిని అదుపులో పెట్టాలని గట్టిగా అరిచేను "...ఆగండి ! అని. అన్నాక నా గొంతు నాకే గట్టిగా గంభీరంగా వినిపించింది. ఆయన జేబురుమాలుతో తుడుస్తున్న కళ్ళజోడు క్రింద టేబులు మీదపడింది. నా వైపు వింతగా చూస్తూన్నాడాయన. మంజుల కళ్ళు పెద్దవయ్యాయి, చేతులు గుండెలు మీదకు వెళ్ళేయి. రెండు చేతులూ పేంటు జేబుల్లో పెట్టుకుని గొంతు సవరించుకున్నాను. మంజుల వైపొకసారి చూసి ఆయనవైపు తిరిగేను.

"చూడండి, నరసింహమూర్తి గారు ! నే చెప్పేది జాగ్రత్తగా వినండి..."

"ఇది నా వ్యక్తిగత సమస్య .. నా పెళ్ళి... విన్నారా ? ఈ పెళ్ళి నాది. నేనడిగింది, నా పెళ్ళికి లీవు మీరు యిచ్చేదీ లేంది ఆ ప్రసక్తిలేదిందులో. నేను నెలరోజులు అప్లై చేసేను, మీరు గ్రాంటు చేయాల్సిందే. అసలు గ్రాంటు చేయననటానికి మీరెవరు ? ఈ లీవు మా కష్టార్జితం మా ప్రివిలేజ్... మా హక్కు.. మీరింతమంది లీవు కావాలో మొర్రో అంటే "ఇవ్వనో" అంటారూ జ్వరం వచ్చిందంటే ధర్మామీటరు పట్టుకు వెళ్ళి చూస్తారూ ! తలనొప్పి అంటే స్వంత ఖర్చుతో యాస్ప్రో కొనిస్తారూ? సత్యన్నారాయణ వ్రతం చేసుకోవాలంటే ఆఫీసునుంచి వెళ్ళి చేసుకోగూడదూ.. అంటారు ? ఇంతమందిని కష్టపెట్టి మీరేం బావుకొంటారు ? పెద్దవారు కదా మీకిదేం పాడుబుద్ధి... ఎవరి సంగతి నా కెందుకు గాని నాకు శాంక్షన్ చేయాల్సిందే ! చేయనంటారూ .. మీ ఖర్మ యిదిగో టిక్కెట్టు కూడా రిజర్వు చేయించాను.. యిక మీ యిష్టం జాగ్రత్తగా ఆలోచించి మీకెలా వీలయితే అలా చేయండి" కాలేజి డిబేట్లలో పాల్గొన్న అనుభవం అక్కరకు వచ్చింది. "మెల్లగానయ్యా !" అని ఆయన అంటున్నా వినిపించుకోకుండా ఆవేశంగా చెప్పుకు పోతున్న వాడిని ఆగి జేబులో రుమాలు తీసి ముఖం తుడుచుకుంటుంటే ఎదురుగా

టేబుల్ మీద ఏదో ఠపీమని పడ్డట్లు శబ్దం అయింది. ఏమిటా అని చూసేసరికి నాకు మతిపోయినంత పనైంది. నరసింహమూర్తి తల టేబుల్ మీద ఉంది, మిగతా భాగం కుర్చీలోనే వుంది. మంజుల వైపు సగర్వంగా చూసేను. ఆమె కళ్ళలో 'అప్రీసియేషన్' తొంగి చూస్తున్నది.

ఒక నిముషం ఆగి ఆయనే లేచారు. లేస్తూనే "సుబ్రావ్ ! అబ్బ... అబ్బ.. ఏం ఆర్గ్యుమెంటోయ్ ! డ్రాఫ్టులో యిలాగే వ్రాసేవంటే ప్రమోషన్ తప్పదనుకో.. అబ్బ... అబ్బ..."

ఆశ ఎక్కువయింది. గ్రాంటు అయినంత సంబరం వేసింది. అభినందనలు 'ఎక్ నాలెడ్జ్' చేస్తున్న సూచనగా పెదవులు చెవులదాక తీసుకువెళ్ళే ప్రయత్నంలో ఉన్నాను. కాని ఆయన ఆ తరువాత అన్న మాటలు విని "మళ్ళీ మొదటి కొచ్చాదురా భగవంతుడా" అనిపించింది.

"సరే యింతవరకూ వచ్చాము కాబట్టి చెబుతున్నాను. నీకు వారం కన్నా ఎక్కువ శాంక్షన్ చేయను. ఏం చేస్తావో .. పెళ్ళి చేసుకునే వస్తావో.. సరదాగా యిక్కడే గడిపేస్తావో యిక నీ యిష్టం!"

"ఎందుకు చేయరు ?"

"చేయనంతే ! నా యిష్టం."

"మీ యిష్టమేమిటి బోడిష్టం, అసలు చేయననటానికి మీరెవరు ?"

"ఈ ఆఫీసుకు హెడ్డును."

నాకిక ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. ఎలాగో దిగాం, అంతు తేల్చాల్సిందే.

"నేన్చెయ్యను"

"చేయాలి." బిగ్గరగా అరిచేసేను.

ఆయన ఒక నిముషం ఆగి అన్నారు.

"అనవసరంగా గొంతు చించుకోకు. వచ్చే యియర్ ఎండింగ్, తెలుసుగా మీ కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు పంపాలని."

నన్ను బెదిరిస్తాడా ! నాకు మా భాషలో చెప్పాలంటే తిక్క రేగింది. "నీ యిష్టం వచ్చినట్లు చేసుకో ఫో! ఇదిగో టిక్కెట్టు కూడా తెచ్చుకున్నాను తెలిసిందా !" బిగ్గరగా అరిచేను.

★★

ఇంకేమి చేసే వాడినో తెలియదు ఎందుకంటే మాంచి సీక్వెన్సులో రీలు కట్టయినట్లు బంగారంలాంటి కల పాడు చేశాడు కొలీగ్ రామ్మూర్తి.

"ఏవిటోయ్ ! భగవాన్లూ, నిద్ర పోవటమే కాకుండా సెలవు... వెళ్తున్నాను.. టిక్కెట్టు అంటూ కలవరిస్తున్నావ్ ! ఆఫీసర్ కలలో కనపడ్డాడేవిటి ?" అని తట్టి లేపుతున్నాడు రామ్మూర్తి, నేను మళ్ళీ వాస్తవికతలో పడేసరికి.

వాడికి జవాబు చెబుదామని నోరు తెరిచానో లేదో ప్యూను నర్సయ్య వచ్చి అయ్యగారు పిలుస్తున్నారని చెప్పేడు. తెరిచిన నోరు యింకాస్త తెరుచుకుని అతని వెనుక బయలుదేరాను. "రాజు వెడలె.." పాడుకుంటూ.

స్ప్రింగు డోర్సు తెరుచుకుని లోపలికి వెళ్ళేను ఆయన నా లీవు కాగితమే కాబోలు చూస్తున్నాడు నాకు వచ్చిన కలే ఆయనకూ వస్తే నేనేం అయ్యేటట్లు ?

ఏం ఉపోద్ఘాతం లేకుండానే "ఏమోయ్ సుబ్బరావు ! పెళ్ళికి లీవుగావాలా ? కంగ్రాచ్యులేషన్స్. పదిహేను రోజులకు చేస్తానోయ్. కాగానే వచ్చేయ్!" అన్నారు.

ఏమనాలో నాకర్థం కాలేదు. నేనే నయమనిపించింది. ఆంజనేయులు పెళ్ళికి వెళ్తాను లీవిమ్మంటే మూడ్రోజులు గ్రాంటు చేసేడు. పాపం ! పారాణి ఆరకముందే ఫైళ్ల మధ్య చిక్కుకున్నాడు. పదిహేను రోజులు చేయటం నా అదృష్టం. ఇక బేరం చేయటం కూడా మంచిది గాదు.

"ఇంతకూ మావగారిదేవూరన్నావ్ ?"

"నేనేమీ అనలేదే ?" అనబోయి ఎదుటి మనిషి రామ్మూర్తి గాదు నరసింహమూర్తి గారని గుర్తొచ్చి "తెలీదండీ" అన్నాను.

ఆయనకు షాక్ కొట్టినట్లయింది. కళ్ళజోడు లోంచి కళ్ళు ఆశ్చర్యంగా చూసేయి.

"అదేమిటోయ్ ? అమ్మాయినన్నా చూసేవా ?"

"అయ్యా నరసింహమూర్తి గారు ! ఆ అమ్మాయి పేరు నాకు తెలియక ముందే విశాఖపట్నంలో మా అన్నయ్య స్టూడెంటు. వాళ్ల నాన్నగారూ వాళ్ళు ఎక్కడో మంచి ఉద్యోగంలో ఉన్నారట నేను ఆయన్ను చూడ్లేదు. నన్ను ఆయన చూడ్లేదు. మా యింటిలోనూ అంతే. అమ్మాయికి అబ్బాయి... అబ్బాయికి అమ్మాయి నచ్చాక... ఈ గొడవలన్నీ ఎందుకు ? అని మా అన్నయ్యే యీ పెళ్ళికి కారకుడు! అదీ కథ" అన్నాను.

"మీ అన్నయ్య పేరేమిటి ?"

చెప్పేను.

"అమ్మాయి పేరేవిటన్నావ్ ?"

పెద్దవాడు, తండ్రి లాంటివాడు పేరడుగుతుంటే సిగ్గేసింది. పేరు కూడా చెప్పేను మనసులో శుభలేఖ పంపుతాన్లేవోయ్, భగవాన్లూ అనుకుంటూ.

నేను సిగ్గుపడటం చూసేనేమో ఆయన సన్నగా నవ్వేరు. ఆయన పనిలో ఆయన మునిగిపోయారు. చెప్పేసి బయట పడ్డాను స్వింగు డోర్సు నా వెనుక శబ్దం చేస్తుండగా.

సెలవు గ్రాంటు అయినందుకు అందరికి 'శాంతి' చేయించేక యింకాస ఆశ్చర్యమైన విషయం తెలిసింది. నాకు లీవు అడిగినంతవరకూ అంటే 30.. అక్షరాల ముప్ఫయిరోజులకు గ్రాంటు అయింది. అంతా కలిసి 'మాస్' గా స్పృహ కోల్పోయి మేల్కున్నాము. "బాసు నీ మీద కుట్ర పన్నుతున్నాడ్రోయ్! నాయనోయ్!" అని అంతా నాకు చెప్తున్నా నాకు మాత్రం నరసింహమూర్తి గారికి మతి మాత్రం ఖాయంగా పోయిందనిపించింది.

కాని నాకప్పుడు తెలియదు. పెళ్ళిలో పీటలమీద ఆయన్ని మావగారి స్థానంలో చూసి మతిపోగొట్టుకోవాల్సింది నేనేనని!

★★★

.

# ఎవరు పసివాళ్ళు?

## శ్రీ వి.వి.యస్. రామదాసు

## (భారతి మాసపత్రిక, 1970 జనవరి సంచిక, నుంచి పునర్ముద్రణ)

'నా ప్రేమ గురించి చెప్పాను కదా. ఇంక మీ ప్రేమ గాథ చెప్పండి, త్యాగరాజుగారూ' అని తన భర్త శివాజీ అన్న మాటలకు కార్నరు సీటులో కూర్చుని కునికిపాట్లు పడుతున్న నలభై ఏళ్ళ అంబ ఉలిక్కిపడింది.

హైదరాబాదు – తిరుపతి బస్సు వేగంగా చీకటిని దూసుకుని పోతుంది.

ఆమె కూర్చున్నది వెనుక వరుసలో ఉన్న మూల సీటు కావడం వల్ల బస్సులో ఉన్న ప్రయాణీకులందరినీ సునాయాసంగా చూడగలుగుతోంది.

రకరకాల సంభాషణలూ, పిల్లల ఏడ్పులూ ఆమెకు ఒక ప్రక్కనుంచి ముంచుకు వస్తున్న నిద్రను దూరం చేస్తున్నప్పటికీ ఆమె కునికి పాట్లు పడుతూనే ఉంది.

మధ్యాహ్నం అంతా

'ఈ సారి తప్పకుండా జాక్ పాట్ గెలిచి తీరుతాను' ధోరణిలో సాగే సంభాషణా,

'ఎప్పటికయినా ఆ అమ్మాయినే పెండ్లాడుతాను' అనే తరహాలో సాగే మాటలూ,

'రాబోయే ఎన్నికల్లో నన్ను నిలబడమని ప్రజలు బలవంత పెడుతున్నారు. ఈ సారి గెలవడం ఖాయం' అనే బాణీలో సాగే సంభాషణా,

'మంత్రి వర్గ విస్తరణలో ఛాన్సు కాస్తలో తప్పింది. మన గ్రూప్ కి చెందిన ఆయన ముఖ్య మంత్రి పదవి యివ్వక తప్పదు' అనే ధోరణిలో సాగే సంభాషణా,

'రమ్మీ ఆట యొక్క రంజు ఆడిన వాడికే తెలుస్తుంది. ఏమయినా వచ్చిన నష్టాన్ని పూడ్చుకుని, పైన లాభం సంపాదించి దానితోనే కూతురి పెళ్ళి చేయాలి' అనే పంథాలో నడిచే సంభాషణా,

'తప్ప త్రాగిన వాడే తగు మనిషి' అనే ధోరణిలో రకరకాల మద్యాలను వివరిస్తూ సాగే సంభాషణా,

'ఏమయినా యింక కొన్ని నెలల్లో నాకు గెజిటెడ్ ఆఫీసరు ప్రొమోషన్ రాక తప్పదు' అనే ధోరణిలో జరిగే సంభాషణా,

ఒక వంక వినీ విని ఆమెకు విసుగెత్తింది.

మధ్యాహ్నం అంతా మరొక వంక

'ఇప్పుడు నాకు జిలేబి కావాలి' అని మారం చేసే వాడొక పిల్లవాడయితే

'నన్ను అమ్మమ్మ దగ్గరకు దిగబెట్టెయ్యి.' అని పేచీ పెట్టే పిల్ల మరొకతె.

'ఇవ్వాళ రాత్రి మనం తప్పకుండా సినీమాకి వెళ్ళాలి' అని కోరె గొంతెమ్మపిల్ల ఒకరైతే

'ఐస్ క్రీం కొంటావా, కొనవా' అని మంకుపట్టు పట్టినవాడు మరొకడు.

'ఈ బొమ్మకు చెయ్యి విరిగింది. దానిని అతికించి పెట్టూ' అని శఠంచేసే పిల్ల ఒకతైతే,

'ఈ విరిగిన చెరుకు ముక్కలు నాకొద్దు మళ్ళీ వాటిని కర్రగా అతికించూ' అని గోలపెట్టే పిల్లవాడు మరొకడు.

ఈ విధముగా పిల్లల ఏడ్పులతో, పేచీలతో, చికాకు కలుగుతున్నది మరొకవంక.

కర్నూలులో ప్రయాణీకులు భోజనాలు చేసిన తరువాత బస్సు బయలుదేరింది. కాసేపటికి చాలమంది పిల్లలు తల్లుల ఒడులలో నిదుర పోయారు. కాని పెద్దవాళ్ళు నిద్రపట్టక మళ్ళీ బాతాఖానీ మొదలుపెట్టారు.

వాళ్ళ సంభాషణా సంగీతానికి శ్రుతి అన్నట్లు ఒక పిల్లవాడు ఏదో పేచీ పెడుతూ చిన్న స్థాయిలో ఏడుస్తూనే ఉన్నాడు.

పెద్దవాళ్ళు ఎవరి ధోరణిలో వారు కబుర్లు చెప్పుకుంటున్నారు.

అంబకు ఎదురుగా సీట్లలో నలుగురు ఇద్దరికెదురుగా యిద్దరు కూర్చున్నారు వారిలో ఒకాయన అంబ భర్త శివాజీ. రెండో ఆయన త్యాగరాజు. అంబ యాభైయారేళ్ళ త్యాగరాజును అతని గొంతును బట్టి, ఆకారాన్ని బట్టి పోల్చుకోగలిగింది గాని త్యాగరాజు ఆమెను పోల్చుకో లేకపోయాడు. దానికి కారణం ఆమె కాన్పులవల్ల లావెక్కి ఉండడమూ, మశూచికం వల్ల ముఖమంతా స్ఫోటకం మచ్చలు తయారవడమూను, తక్కిన ఇద్దరూ అంబకు అపరిచితులు.

వారు ఆమాటా ఈ మాటా చెప్పుకుని చివరకు ఎంతో పరిచయంగల వారిలా వారి సంభాషణ ప్రేమగాధలలోకి దిగింది. వాళ్ళు నలుగురూ యాభై దాటినవారే. తీర్థయాత్రకు పోతున్నామనే ధ్యాసయినా లేకుండా వారు తమ గతజీవిత ప్రేమ స్మృతులలో పడ్డారు ఎవరైనా వినేవారుంటే ఒకరకం ప్రేమికుడు ఎంతయినా కవిత్వం అల్లి చెప్పగలడని వారి సంభాషణ వింటూన్న అంబకి అర్థం అయింది.

మొదటి అపరిచితుడు తాను ఏ విధముగా ప్రేమించి తల్లిదండ్రుల్ని లెక్క చేయకుండా కట్నం లేకుండానే పెళ్ళి చేసుకున్నాడో చెప్పాడు.

రెండవ అపరిచితుడు తాను ఏ విధముగా ప్రేమ కోసం సంఘాన్నెదిరించి వర్ణాంతర వివాహం చేసుకున్నాడో చెప్పాడు.

మూడవ ప్రేమికుడు అంబ భర్త శివాజీ. శివాజీ చెబుతున్న ప్రేమకథ అంబకు తెలిసినదే. అందుచేత మగతమగతగా వస్తున్న నిద్రలో విన్నది. శివాజీ ఈ విధముగా ప్రారంభించాడు.

'నేను నా ప్రేయసిని ఒక పెళ్ళివారి పందిట్లో చూశాను. మా బంధువుల యింట్లో పెళ్ళి చూడడానికి నేను భీమునిపట్నం వెళ్ళాను. అక్కడ ఒక సర్వాంగసుందరిని చూసి ప్రథమ క్షణంలోనే ప్రేమించాను.'

'ఆమెతో మాట్లాడారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'ఎలాగో వీలుచేసుకుని మాట్లాడాను. ఆమె నాతో నవ్వుతూ ఎంతో కలుపుగోలుగా మాట్లాడింది' అన్నాడు శివాజి.

'ఆమె మిమ్మల్ని ప్రేమించిందో లేదో తెలుసుకున్నారా?' అన్నాడు రెండవ అపరిచితుడు.

'నేను ఆమెను సూటిగా అడగలేదుకాని ఆమె తల్లిదండ్రులెవరో తెలుసుకుని వారితో మాట్లాడవలసిందని మా తండ్రిగారితో చెప్పాను. మా నాన్నగారు మాట్లాడి మా యిద్దరికీ వివాహం జరిపారు'

'మరి మిమ్మల్ని ఆమె ప్రేమిస్తుందో లేదో తరువాతయినా తెలుసుకున్నారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'ఆడవాళ్ళు ప్రేమ గురించి స్పష్టంగా చెప్పరు. వాళ్ళ ప్రవర్తన ద్వారా మనం తెలుసు కోవాలి ఆమె నాతో ఎప్పుడూ జగడం ఆడలేదు. మాకు ముగ్గురు మగపిల్లలూ ఒక ఆడపిల్లా కలిగారు' అని యింకా శివాజీ చెబుతున్న మాటలు వింటున్న అంబ చిరునవ్వు నవ్వుకుంది. 'మగవాళ్ళు ఎంత అల్పసంతోషులు' అని తనలో అనుకుంది.

నిజం చెప్పాలంటే అంబకు వివాహం జరిగేనాటికి ఎవరినీ ప్రేమించలేదు. అయితే ఆమెకున్న నేర్పు అనండి లేక సహజమైన లజ్జవల్లననండి ఆమెకున్న భావాలను స్పష్టంగా చెప్పలేకపోయేది.

అంబ కాలేజీలో యింటర్మీడియేటు చదువుతున్న రోజులలో త్యాగరాజు అనే బి.ఎ. ఫైనలియరు స్టూడెంటు ఆమెను గాఢంగా ప్రేమించి ఆమె వెంబడి తిరిగేవాడు. నిజానికి అంబ అతనిని ప్రేమించలేదు. కాని అతని మనస్సును గాయ పరచడం యిష్టం లేక అతనితో మామూలుగా మాట్లాడుతూ ఆతనితో ఒకటి రెండు సార్లు కాఫీ హోటలుకు కూడా వెళ్ళింది. అతడు కూడా ఎప్పుడూ తన ప్రేమను ఆమెతో చెప్పలేదు. ఆమెతో చెప్పడానికి అతడు ధైర్యాన్ని కూడగట్టుకునే లోపలనే అంబకు పెళ్ళయిపోయింది.

'నా ప్రేమ గురించి చెప్పాను కదా. ఇంక మీ ప్రేమ గాథ చెప్పండి, త్యాగరాజుగారూ' అని తన భర్త శివాజీ అన్న మాటలకు అంబ ఉలిక్కి పడింది.

త్యాగరాజు ఏమి చెబుతాడోనని కుతూహలంతో వింటున్నది.

'నేను మీ అంతటి అదృష్టవంతుణ్ణి కాను, శివాజీ గారూ. మీరు ముగ్గురూ ఎంతో ధైర్యంగా మీరు ప్రేమించిన కన్యలను వివాహం ఆడి సుఖంగా ఉన్నారు' అన్నాడు త్యాగరాజు.

'మీరు ప్రేమించిన ఆమెను వివాహం ఆడకుండా దగా చేశారా?' అన్నాడు కోపంగా మొదటి అపరిచితుడు.

'నేను దగా చేసేవానిలా కనిపిస్తున్నానా?' అన్నాడు త్యాగరాజు.

'అయితే ఆ అమ్మాయే దగా చేసిందంటారా?' అన్నాడు రెండవ అపరిచితుడు.

'ఆయన చెప్పేది ఏమిటో పూర్తిగా విననీయండి' అన్నాడు శివాజి.

'ఆమెను మనసారా ప్రేమిస్తున్న నేను ఆమెపై నిందవేయలేను. అసలు ఏమి జరిగిందంటే నేను బి.ఎ. ఫైనలియరు చదువుతూ ఉండగా ఒకమ్మాయి ఇంటర్మీడియేటు జూనియరులో చేరింది. ఆమె ఎంతో చక్కగా ఉండేది. ఆమెను చూడగానే నేనామెను ప్రేమించాను'

'ఆమెతో ఆ విషయం ఎప్పుడయినా చెప్పారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'క్రమేపీ చెప్పాలనే అభిప్రాయంతో మొదట ఆమెతో స్నేహం చేయాలని ప్రయత్నం చేశాను.'

'ఆమె మీతో సుముఖంగా మాట్లాడేదా?' అన్నాడు రెండవ అపరిచితుడు.

'ఆమె నాతో ఎప్పుడూ సౌమ్యంగానే మాట్లాడేది. ఒక్కొక్కప్పుడు నేను నర్మగర్భంగా మాట్లాడినప్పటికీ ఆమె ఏమీ కోపగించుకోలేదు. రెండు సార్లు నాతో కాఫీ హోటలుకి కూడా వచ్చింది.'

'ఆమె మిమ్మల్ని ప్రేమిస్తున్నది అంటారా?' అన్నాడు శివాజీ.

'మీరు యిందాక చెప్పినట్లు ఆడవాళ్ళు తమ ప్రేమ విషయం స్పష్టంగా చెప్పరు కదా. నేను ఎప్పుడూ ఆమెను అడగలేదు. ఆమె ప్రవర్తనను బట్టి ఆమె నన్ను ప్రేమిస్తున్నదనే క్రమంగా నా ప్రేమను ఆమెకు తెలిపి వివాహానికి ఒప్పించాలని అనుకుంటూ ఉండగా ఆమె సగంలోనే చదువు మానేసింది.'

'ఎందుచేత?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'ఆమెకు వివాహం జరిగిపోయింది. అందుచేత కాలేజీ మానేసింది.' అన్నాడు త్యాగరాజు బరువుగా.

'మరి మీరు మళ్ళీ ఆమెను చూడాలని ప్రయత్నం చేయలేదా?' అన్నాడు శివాజీ.

'లేదు. నేను ఆమెను ప్రేమిస్తున్నాను కాబట్టే చూడాలని ప్రయత్నం చేయలేదు. పండంటి ఆమె సంసారం మీద నా పరిచయచ్ఛాయల్ని వేసి పాడు చేయడానికి నాకిష్టం లేదు... '

'అయితే ఆమెను మీరింకా ప్రేమిస్తున్నారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'అవును...'

'మీరు వివాహితులై ఉండి, వివాహితురాలైన ఆమెను ఎట్లా యింకా ప్రేమిస్తున్నారు?' అన్నాడు శివాజీ.

'అక్కడే మీరు పొరబడుతున్నారు. నేను వివాహితుణ్ణి కాను.'

'ఏమిటీ ? అసలు పెళ్ళే చేసుకోలేదా ? మీరెంత గొప్పవారు.'

'అందులో నా గొప్ప ఏమీ లేదు. ఆమెను ప్రేమించిన తరువాత నేను వేరే స్త్రీని ఆమె స్థానంలో ఉంచలేకపోయాను. అది నా బలహీనత.'

ఆ మాటలు వింటున్న అంబ కళ్ళు చెమర్చాయి.

'అయితే కేవలం ప్రేమలో పడి దేశానికీ సమాజానికీ మీకున్న కర్తవ్యాన్ని నెరవేర్చడం మర్చిపోయారా?' అన్నాడు శివాజీ.

'కేవలం వివాహం చేసుకోనంత మాత్రాన దేశం పట్ల నాకున్న కర్తవ్యాన్ని నెరవేర్చలేననుకోకండి. నేను దేవదాసులాగా, మజ్నులాగా జీవితాన్ని నాశనం చేసుకోలేదు. కష్టపడి చదివి ప్రభుత్వోద్యోగంలో ప్రవేశించి ఆఫీసరుగా పేరుపొంది ఈ సంవత్సరమే రిటైరయ్యాను.'

'మీరు మళ్ళీ ఆమెను చూశారా?' అన్నాడు శివాజీ.

'లేదు కాని రెండేళ్ళ క్రితం సరిగా ఆమె పోలికే ఉన్న ఒక యువకుడు ఉద్యోగం కోసం నా వద్దకు యింటర్వ్యూకి వచ్చాడు. అతణ్ణి చూస్తున్నంత సేపు ఆమెను చూస్తున్నట్లే భావించాను. 'మీ అమ్మగారి పేరు ఫలానా కాదా?' అని అడిగితే ఆ యువకుడు కోపగించి, 'మా అమ్మ పేరుకీ నా ఉద్యోగానికీ సంబంధం ఏముంది?' అన్నాడు. 'కోపగించుకోకు నాయనా, ఫలానా పేరుగల అమ్మాయి నాతో చదివారు. నీ మొహం మీ అమ్మగారి పోలిక అనుకుని అడిగాను. నీ కిష్టం లేకపోతే చెప్పవద్దు. అంతమాత్రం చేత నీకు అన్యాయం జరగదు' అన్నాను. నేను సౌమ్యంగా చెప్పిన తీరు అతణ్ణికదిలించి నట్లుంది. 'క్షమించండి సార్. అదే మా అమ్మ పేరు' అన్నాడు.'

'ఆ ఉద్యోగం ఆ అబ్బాయికి యిచ్చారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'అవును, నా సర్వీసు అంతటిలోనూ నేను చూపించిన పక్షపాతం అది ఒకటే' అన్నాడు త్యాగరాజు.

ఆ మాటలు వింటున్న అంబ కంటి వెంబడి కృతజ్ఞతా పూర్వకమైన కన్నీళ్ళు రాలాయి.

'బాబు గాడికి ఉద్యోగం యిచ్చిన మహానుభావుడీయనన్న మాట. ఈ సంగతి వాడు నాకు చెప్పలేదేం? ఆ ప్రసక్తి నాకు చెప్పవద్దని త్యాగరాజు గారు అని ఉంటారు' అనుకున్నది అంబ.

'ఇంతకూ ఆ పవిత్రురాలి పేరు తెలుసుకోవచ్చునా?' అన్నాడు శివాజీ.

త్యాగరాజు ఏమి చెబుతాడోనని పర్యవసానం ఏమవుతుందోనని అంబ ఊపిరి బిగబట్టుకుని వింటున్నది.

'నేను ఆమె పేరు ఎవరికీ చెప్పదలుచుకో లేదు. ఎందుచేతనంటే ఆ విషయం నాకూ ఆ పరమాత్మునకీ మధ్య దాగి ఉండాలని నా అభిప్రాయం అన్నాడు త్యాగరాజు.

'అవునవును. మీరు ప్రేమిస్తున్నట్లు ఆమెకు కూడా తెలియదు కదా' అన్నాడు శివాజీ.

'ఇంతకాలం గడచిన తరువాత ఇంకా ఆమెను ప్రేమిస్తున్నారా? ఇప్పుడు వెనుకకు తిరిగి చూసుకుంటే ఒక పొరపాటు చేశారని అనుకోవడం లేదా? ఏదో వెలితి కనిపించడం లేదా?' అని ప్రశ్నలవర్షం కురిపించాడు రెండవ అపరిచితుడు.

'నేను యింకా ఆమెను ప్రేమిస్తున్నాను. నా కండ్లముందు ఆమె చక్కని రూపం ఎప్పుడూ ప్రత్యక్షంగా ఉంటుంది. ఇక వెలితి అంటారా? నాకేమీ కనిపించడం లేదు. బ్రతికి ఉన్న రోజులంతా తీర్థయాత్రలు చేస్తూ పుస్తకాలు చదువుతూ తేలికగా గడిపేస్తాను. నాకు ఒకటే కోరిక ఉంది' అన్నాడు త్యాగరాజు.

'ఏమిటది?' అన్నాడు శివాజీ.

ఏమి చెబుతాడోనని అంబ కూడా వింటున్నది.

'ఆనాడు ఉద్యోగం కోసం వచ్చిన అబ్బాయితో స్నేహం చేసి అవసానదశలో నాకేమైనా ఆస్థి మిగిలితే అతనికిచ్చి అతని చేతనే అంత్య క్రియలు జరిపించుకోవాలని ఉంది' అన్నాడు త్యాగరాజు.

అంబ కంటివెంట నీళ్ళు అప్రయత్నంగా రాలాయి.

త్యాగరాజు చెప్పిన ప్రేమగాధ వినిన తరువాత ఎవరూ మాట్లాడలేక పోయారు.

అంబ బస్సులో కునికి పాట్లు పడుతున్న ప్రయాణీకులను పరిశీలించింది. ఒకపిల్లవాడు ఏదో మారాం చేస్తున్నాడు. వాడిని సముదాయించడానికి వాని తల్లి ప్రయత్నం చేస్తోంది.

'నా పాపాయికి జాగాలేదూ' అని రాగాలు తీస్తున్నాడు, నాలుగేళ్ళ పిల్లవాడు.

'అసలు పాపాయి ఏదిరా కనిపించలేదేం? అంటున్నది వాని తల్లి.

'ఇదేంటి. ఇక్కడ నిలిచిపోయింది, చూడు' అని ఖాళీ ప్రదేశాన్ని చూపిస్తున్నాడు.

ఆ తల్లికి కోపం వచ్చి కొట్టడానికి చేయి ఎత్తింది.

'అపమ్మా, ఆ పసివానిని కొట్టకండి' అని అంబ కేకవేసి, 'ఇలా రా నాయనా. నీ పాపాయికి నేను జాగా యిస్తాను' అన్నది. ఆ పిల్లవాడు సీట్లు పట్టుకుని రావడానికి ప్రయత్నం చేస్తూంటే వాని తల్లి వానిని ఎత్తుకుని అంబ ఉన్న సీటు వద్దకు వచ్చింది.

'నీ పాపాయి కూడా వచ్చింది కదూ బాబూ?' అన్నది అంబ.

'అవును మామ్మా. ఇదుగో చూడు. ఇక్కడే నుంచుంది' అన్నాడా పసివాడు ఉత్సాహంగా.

'అవును సుమా, అదుగో కనిపిస్తోంది. ఏమే పాపాయీ బాగున్నావా?' అని శూన్యాన్ని పలకరించింది. ఆ పసివాని ముఖం మీద నవ్వులు నాట్యం చేశాయి.

'మరేమో, నా పాపాయికి జాగా లేదంటున్నది అమ్మ, చూడు మామ్మా' అని ఫిర్యాదు చేశాడు ఆ పసివాడు.

'జాగా లేకేం బాబూ. ఇదిగో ఇక్కడ నేను జరుగుతున్నాను. ఇక్కడ పడుకోపెట్టు. నా ఒళ్ళో నువ్వు పడుకుంటావా లేక మీ పాపాయిని పడుకోపెట్టుకోమంటావా?' అన్నది అంబ.

'ఇద్దరం పడుకుంటాము, మామ్మా.' అన్నాడు ఆ పసివాడు.

'అలాగే బాబూ. నువ్వు ఈ తొడమీద తలపెట్టుకుని పడుకో. పాపాయిని ఆ తొడమీద పడుకోపెట్టు' అనగానే ఉత్తుత్తి పాపాయిని అంబ తొడమీద పడుకోపెట్టి ఆ పసివాడు అంబ ఒడిలో తలదూర్చి పడుకున్నాడు.

'నా దగ్గర ఉండనీయండి,' అని అంబ చెప్పగానే థాంక్స్ చెప్పి ఆ తల్లి తన సీటు దగ్గరకు పోయింది.

'పాపం, పసివాడు' అన్నాడు త్యాగరాజు.

‘అవును పాపం, పసివాడు’ అన్నారు తక్కిన ముగ్గురూ.

అంబకు నవ్వు వచ్చింది.

ఎదురుగా తాను ప్రేమించిన స్త్రీ ఉన్నప్పటికీ కాలం ఆమెలో తెచ్చిన భౌతికమైన మార్పు తెరను తొలగించి అసలు స్వరూపాన్ని చూడలేని త్యాగరాజూ, తాను ప్రేమించి వివాహం చేసుకున్న స్త్రీ తనను ప్రేమిస్తున్నదో లేదో పూర్తిగా తెలుసుకోకుండా ఊహా ప్రపంచంలో ఉంటున్న తన భర్త శివాజీ, ప్రేమ వివాహాలు చేసుకొని సుఖిస్తున్నామని యితరులను నమ్మించడానికి ప్రయత్నం చేసిన యిద్దరు అపరిచితులూ, తాము ఏదో సాధించి తీరుతామని కలలు కంటున్న రకరకాల పెద్దమనుష్యులూ, ఏవేవో కావాలని, ఏవేవో ఉన్నాయని ఊహించి సంతోషిస్తున్న పసివాళ్ళూ అంబ దృష్టిలో ఒక మాదిరిగానే కనిపించారు.

‘ఎవరు పసివాళ్ళు?’ అని అంబ తన మనస్సులో ప్రశ్నించుకుని చిరునవ్వు నవ్వింది.

బస్సు శరవేగంతో చీకటిని దూసుకుని పోతోంది.

★★★

# సులోచన

- ఎస్.వి.రంగారావు

(యువ మాసపత్రిక, 1961 డిసెంబర్ సంచిక, నుంచి పునర్ముద్రణ)




రేడియో మోగుతూంది. అప్పుడే వచ్చిన హిందూ పేపరు చదువుతూ కూర్చున్నాను. ములిగిపోయాను యుద్ధ వార్తల్లో.

"నాన్నా ! పాట చాలా బాగుంది కదూ ?"

"అవునమ్మా, చాలా బాగుంది," సమాధానం చెప్పాను యధాలాపంగా.

"సాహిత్యం బాగుందా, సంగీతం బాగుందా నాన్నా?"

"రెండూ బాగానే వున్నాయమ్మా" అన్నాను మళ్ళీ పరధ్యానంగానే.

__"కలదీ గాలిని గారడియేమో అదియేకద ఆ ప్రేమ !"

అప్పుడే రేడియోలో వచ్చిన పాటను తన కోకిల స్వరంతో మెల్లిగా పలికింది సులోచన.

"నాన్నా, ప్రేమంటే యేమిటి నాన్నా?"

ఒక్కసారి స్మృతిలోకి వచ్చాను. అబ్బ ! ఎంత పెద్ద ప్రశ్న వేసింది నా బిడ్డ ! సులోచనకు ప్రేమంటే యేమిటో చెప్పగలశక్తి నాకుందా ? ఏనాడో

ముదిరిపోయి కుళ్ళిపోవడానికి సిద్ధంగా వున్న యీ కట్టెకు ప్రేమ అంటే అసలు అర్ధం తెలుసా ? తెలిసినా చెప్పగల శక్తి వుందా ? అందులోను. తల్లి లేని నా బిడ్డ సులోచనకు ఎలా చెప్పగలను ?

భగవంతుడా ! ఈ రోజు కోసమా నీ విన్నాళ్ళు ఎదురు చూసింది ? పొరపాటున పుట్టింది సులోచన, నా కడుపున. పేరు సులోచన పాపం, అంధురాలు ! అదీ ఒక దైవికమే కాబోలు. అందుకేనా నన్ను చూస్తే నీకింత హేళన.

నా తల తిరిగిపోతూంది. ప్రేమ అనే రెండక్షరాలకు సరయిన సమాధానం చెప్పగల మగధీరుడెవరయ్యా ఈ లోకంలో ఎవరికి వారే తామనుకున్న అర్ధాన్ని వెలిబుచ్చుతూ, తమ చీకటి గదులలోని అనుభవాల పర్యవసానాన్నిలేక నీచ లైంగిక జ్ఞానాన్ని పునరుద్ఘాటించుకొని, ఏవో కల్లబొల్లి మాటలు చెబుతూ, ప్రజలను మోసం చెయ్యడానికి సిద్ధపడే ఈ చవట ప్రేమికులా చెప్పగలరు, ప్రేమంటే ఏమిటో !

ఈ రోజు వరకు యే మహా ప్రేమికునిగాని, రోమియో – జూలియట్, అనార్కలీ – సలీము, లైలా – మజ్నూలు అనుభవించారే కాని అది ఏమిటో వారికీ తెలియదే !

"ప్రాణం" అంటే యేమిటో చెప్పగల శక్తి ఈ మానవునికి వుందా? అలాగే 'ప్రేమ' అంటే కూడా అర్ధం కాదు ఈ మానవ జీవికి. ప్రాణం అంటే ఏమిటో చెప్పగల భగవంతుడే ప్రేమ అనే ముక్కకు గూడా సమాధానం చెప్పాలి.

"నాన్నా ! యేమిటి నాన్నా, సమాధానం చెప్పవూ? ప్రేమ అంటే యేమిటి నాన్నా ?"

అయ్యో ! మళ్ళీ వేదాంతంలో దిగిపోయాను. భగవంతుడే చెప్పవలసిన సమాధానాన్ని నేనా చెప్పగలను సమాధానం చెప్పకుండానే నడిచాను బయటికి.

"నాన్నా__ నాన్నా__ నా.....న్నా !" నడుస్తున్నాను పిచ్చివాడిలాగా. వెంబడిస్తున్నాయి నా బిడ్డ పలుకులు...." నాన్నా నాన్నా, నాన్నా !"

దేవుడా ! పరిగెడుతున్నాను. కాని యింకా వినిపిస్తూనే వున్నాయి ఆ బల్లెపు ములుకులు__

" ఎవరా పిలిచేది ? నన్నేనా ? " ఆగేను.

"ఎక్కడికయ్యా పరిగెడుతున్నావు ఇలా పిచ్చి వాడిలా ?" అడిగారు మా చక్రపాణి.

"ఆ_న_నమస్కారమండి ! మీ..మీ.. మీకు ప్రేమంటే ఏమిటో తెలుసా ?"

"ఈ వయస్సులో నీకెందుకయ్యా ప్రేమగొడవ !"

"నాకు కాదులెండి. అయినా చెప్పండి ప్రేమంటే ఏమిటో !"

"రంగా ! నీ కెప్పుడో చెప్పాను ఎక్కువగా ఆలోచించొద్దని."

"ఆలోచనేమిటండీ ? దీనికి సమాధానం మీకు చేతనయితే చెప్పండి. లేకపోతే నా దారిని నన్ను పోనివ్వండి."

మౌనం

మళ్ళీ పరిగెడుతున్నాను. ___

ఎంతోమంది స్నేహితులు నన్నాపడానికి ప్రయత్నించారు. పాపం ! దైవం వాళ్ళని దయజూచుగాక !

"మామయ్యా ! మామయ్యా ! ఎందుకలా పరిగెడుతున్నారు ?"

ఆగాను.. గొంతుక పరిచితమైన గొంతుకే !

"బాబూ ! నీకు ప్రేమంటే ఏమిటో తెలుసా ?"

మౌనం.

పాపం ! అమాయకుడు. బి, ఏ, ప్యాసయి, ఈ జాతి వైషమ్యాల నాగుపాములు బుసలు కొట్టే రోజులలో ఉద్యోగం కూడా దొరక్క నానా యాతనలూ పడుతున్న మా రామానికి ఈ ప్రశ్నతో మతి కూడా చలించింది.

"మామయ్యా ! ఇంటికి వెళదామా?" అన్నాడు.

ఇంటికా ! నాకింకా సమాధానం దొరకందే ? ఎలా వెళ్ళను ఇంటికి ? _

"పద మామయ్యా, వెళదాం ! "

2

సులోచన పుట్టుకతోనే గ్రుడ్డి కాదు. అయిదవ ఏట వాళ్ళమ్మకూ దానికీ, ఇద్దరికీ ఒకేసారి మశూచికం వచ్చింది. వాళ్ళమ్మకి ప్రాణమే పోయింది. సులోచన కండ్లు పోగొట్టుకుని యావజ్జీవ కారాగారం అనుభవిస్తోంది. ఆ రోజుల్లో కలెక్టరాఫీసులో గుమస్తా చేస్తుండేవాణ్ణి. వచ్చే డబ్బులు తిండికే సరిపోయేవి కావు. ఇక మందులెక్కడ పొయ్య గలను ? చేతులారా పోగొట్టుకున్నాను నా భార్యను, బిడ్డను కూడా.

డబ్బు లేని వాళ్ళకు పెద్ద జబ్బులు ఎందుకు వస్తాయో తెలియదు. పెద్ద జబ్బులకు పెద్దమందులు కావాలి. అవి డబ్బున్న పెద్ద వాళ్ళకు వచ్చి డబ్బులేని బీదవాళ్ళకి చిన్న చిన్న జబ్బులు వస్తే పరవాలేదు. ఆ భగవంతుడికి ఈ మాత్రం కూడా తెలియదు.

అప్పటినుంచి సులోచనకు నేనే తల్లినై పోషిస్తూ వచ్చాను. ఆఫీసు నుంచి యింటికి వచ్చి వంట చేసేవాణ్ణి. యిద్దరం కలిసి భోంచేసేటప్పుడు పాపం, బాధపడేది సులోచన. "నేనాడదాన్నయి ఉండీ నీకు కనీసం వంటైనా వండిపెట్టే యోగ్యత లేకపోయింది నాన్నా !" అంటూ వలవల ఏడ్చేది. ఓదార్చి తినిపించేవాడ్ని. మనస్సులో మట్టుకు రైళ్ళు పరుగెత్తేవి పొరపాటున నాకేమైనా వచ్చి చచ్చిపోతే, నా బిడ్డగతి యేమవుతుందా అని, తలచుకుంటేనే వణికి పోయేవాణ్ణి. అబ్బే యిప్పుడప్పుడే చావనులే అని నాలో నేనే ధైర్యం తెచ్చుకునే వాడ్ని.

కాని, నేను చచ్చేలోగా మా సులోచనను ఒక జాలిగుండె గల మహనీయుడికి అప్పగించి మరీ చావాలి అనుకుంటూనే రోజులు గడుస్తున్నాయి. కాని యెట్లా ?

"ప్రేమ అంటే ఏమిటి నాన్నా ?"

ఈ ప్రశ్న జ్ఞాపకం వచ్చేటప్పటికి వళ్ళు జలదరించింది. ఆ ప్రశ్న వేసేటప్పుడే సులోచన ముఖంలో ఏదో పారవశ్యం కనిపించింది. ఆహా, అందాన్ని చూడలేక పోయినా ఆనందాన్ని అనుభవించే శక్తిమాత్రం వుండి పోతుంది కాబోలు ఈ గ్రుడ్డివాళ్ళకి !

అంటే సులోచన యుక్త వయస్సురాలయిందన్న మాట. తను చూడలేనిప్రపంచాన్ని అనుభవించడానికి ప్రయత్నిస్తుంది అమాయకంగా. ఎలా నచ్చజెప్పను. నా బిడ్డకు ! గ్రుడ్డిదాన్ని పెళ్ళి చేసుకోడానికి ఏ మహా త్యాగి కూడా ముందడుగు వేయ్యడన్న సంగతి ఆమెకు ఎలా తెలియజెప్పడం ?

రామం, నేనూ యింటికి చేరుకున్నాం. లోపలి నుంచి 'నాన్నా!' అని కేక వినిపించింది. భయం వేసింది. మళ్ళీ ఆ ప్రశ్నే వేస్తే ఏమి సమాధానం చెప్పాలో అని వణికి పోయాను.

"ఏం నాన్నా, మాటల్లోనే వెళ్ళిపోయావు. ఇంత పొద్దెక్కేదాకా ఎక్కడున్నావు నాన్నా? నువ్వింకా రాలేదని పొయ్యంటించి ఎసరు పెడదామని కిరసనాయిలు బుడ్డి తీశాను. పిడక కోసం వెతికాను, దొరకలేదు. పైగా అగ్గిపెట్టె ఎక్కడ పెట్టావో తెలియదు," అంటూ అన్నీ ఏకరువు పెడుతూంది.

నాకు స్పృహ తప్పినట్టయింది. పొరపాటున కిరసనాయిలుగాని వంటి మీద పడివుంటే ? అగ్గిపుల్ల గీసేటప్పుడు కోక నిప్పంటుకుంటే ? జేబులో అగ్గి పెట్టె తడుముకుని, గండం తప్పినట్టుగా భావించి సంతోషించాను. కళ్ళనీరు కారుస్తూ అలా నిలబడి పోయాను.

ఇంతవరకూ నేను మాటాడక పోవటం చూచి ఏమనుకుందో యేమో బిక్క మొగం వేసింది. "నాన్నా !" అంటూ దగ్గరకు రాబోయింది. నేనే దగ్గరకి వెళ్లి "లేదమ్మా, ఏదో ఆఫీసు పని జ్ఞాపకమొచ్చి, చటుక్కున లేచి వెళ్ళిపోయాను. నువు కాస్సేపు అలా కూర్చో ఒక్క నిముషంలో వంట చేసేస్తాను" అని ఒక పక్క కూర్చోబెట్టి వంటింట్లోకి వెళ్ళాను.

నా వెనకాలే మా రామం కూడా రావడం అలికిడి విన్నట్టుంది. "అదెవరు నాన్నా ?" అని అడిగింది.

"నేనే సులోచనా !" అన్నాడు రామం.

పాపం, సిగ్గు పడింది. తానింతవరకు పరాయి మగవాడి యెదుట సిగ్గు విడిచి నాతో మాట్లాడానని కాబోలు !

"మామయ్య బజారులో కనబడి యింటికి రమ్మని పిలిచాడు" అని బొంకాడు రామం.

"ఎందుకు ? నీకు విందు పెట్టడానికా ?" అంది సులోచన నవ్వుకుంటూ.

రామం నావంక చూసి నవ్వుకుంటూ వంటింట్లోకి వచ్చాడు. భోజనానంతరం __

సులోచనను విశ్రాంతి తీసుకోమని చెప్పి బయటకు బయలుదేరాం.

"రామం ! చూశావుగదూ సులోచన ప్రేమ ఎలా వుందో. నేను బతికుండగానె ఒక వుద్యోగంలో వున్న మంచి కుర్రవాణ్ణి చూసి పెళ్ళి చేసేస్తే, తరవాత నేను చచ్చిపోయినా ఫరవాలేదు. అందుకని తెగ వెతుకుతున్నాను రామం ! నువు కూడా కాస్త సహాయం చేద్దూ !"

"అలాగే మావయ్యా ! తప్పకుండా చూస్తాను. కాని గుడ్డిపిల్లని చేసుకోడానికి ఎవరు ఒప్పుకుంటారా అనేదే అనుమానంగా వుంది."

"అదే బాబూ, నేను భయపడేదిన్నూ. కాస్త ప్రయత్నిస్తే, ఏ త్యాగమూర్తి అన్నా దొరక్కపోడు. నువు తలుచుకుంటే ఏదన్నా చేయగలవు. కాస్త చూసిపెట్టు బాబూ !"

రామం సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

3

సుబ్రమణ్యం కొత్తగా ఆఫీసులో చేరాడు. నా చేతికింద గుమస్తాగానే పని చేస్తున్నాడు. మంచి కుర్రవాడే కాని సిగరెట్లు కాలుస్తాడు. ఛ..ఛ! వద్దు.

రమణమూర్తి బాగానే వుంటాడు. బుద్ధిమంతుడే, బి.ఏ. కూడా ప్యాసయినాడు. కాని స్వార్థం ఎక్కువ కనిపిస్తుంది మనిషిలో. పైగా, గొప్పయింటి వాడిననే అహంభావం కూడా వున్నట్టుంది. నేను మాత్రం ఏం తక్కువ వాడినా ? తహశీల్దారు వుద్యోగం చేస్తున్నాను ! అయినా అడిగి చూస్తే తప్పేముంది ?

"ఏమంటావు, రామం !"

"అలాగే మామయ్యా, అడిగి చూడు !"

మధ్యాహ్నం 'రీసస్' లో ధైర్యం చేసి అడిగాను రమణమూర్తిని. నాకేసి చూసి ఓ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు ఎంత అహం మనిషికి ! మళ్ళీ నేనాఫీసులోకి తిరిగి వెళ్ళే సరికి అందరూ నాకేసి చూసి నవ్వుకుంటున్నారు. కొంత సేపాగి, అందరూ ఒక్క సారిగా గొల్లుమని నవ్వారు ! చిత్రవథ అనుభవించాను ఇంతకంటే ఆత్మహత్య మేలు !

మర్నాడు ఆఫీసుకి వెళ్ళేసరికి నా బల్లమీద ఒక కాగితం పెట్టివుంది.

"గుడ్డిదానికి గుడ్డివాడిని వెతకడం మంచిది. కళ్ళున్న గుడ్డివాడెవడూ దొరకడు."

సెలవు పెట్టాను ఉద్యోగానికి ఒక నెల.

4

నాకు జరిగిన పరాభవం తలుచుకుని ఏడ్చేవాణ్ణి. సులోచన "ఏం నాన్నా, ఆఫీసుకు వెళ్ళడం లే"దని అడిగింది. వంట్లో బాగోలేక సెలవు పెట్టానని బొంకాను. కాని నా బాధ ఎవరితో చెప్పుకోను ?

వినేవాళ్ళు లేక ఎక్కువయింది కడుపులో మంట. మా రామం కూడా ఒక నెల రోజుల్నించి కనుపించడం లేదు. ఒకవేళ అతనిక్కూడా యీ సంగతి తెలిసి నన్నసహ్యించుకున్నాడేమో ! మతిపోయి, పిచ్చివాడ్నయిపోయాను.

ఒక రోజున అరుగు మీద కూచున్నాను. ఎక్కడినుంచి వచ్చాడో, మా రామం హుషారుగా వచ్చాడు.

"మామయ్యా, నాకు ఉద్యోగం దొరికింది మామయ్యా !"

"చాలా సంతోషం. ఎక్కడ బాబూ?"

"బెజవాడ లో మామయ్యా. రెవిన్యూ డిపార్టుమెంటు లోనే దొరికింది."

"అంటే బెజవాడ వెళ్లిపోతావన్నమాట. అసలు నెల రోజులనుంచి నువ్వు కనబడక పోయేసరికి, నువు కూడా నాకు దూరమయి పోయావనుకున్నాను. కాని వచ్చినట్టే వచ్చి, మళ్ళీ వెళ్ళిపోతానంటున్నావు. అలాగే కానియ్యి. నాకోసం నీ వుద్యోగం మాత్రం మానుకోగలవా?"

మౌనం.___

"చూడు, రామం ! పోనీ, అప్పుడప్పుడన్నా ఒకసారి వస్తూండు. అట్టే దూరం లేదుగా ? నిన్ను చూస్తే మా చెల్లమ్మను చూసినట్టుంటుంది."

మౌనం.__

"రామం ! నేనెంతకాలం బ్రతికుంటానో తెలియదు. ఒకవేళ ఏదయినా జరిగితే. కాస్త సులోచనను మాత్రం కనిపెట్టుండు నాయనా ! అదే నే కోరేది."

"మావయ్యా ! నాకు వుద్యోగం వచ్చిన సంగతి చెబితే సంతోషిస్తావనుకున్నాను. ఏమిటి మామయ్యా యిలా బాధ పడుతున్నావు ?"

"నాన్నా, నాన్నా !" అని పిలిచింది సులోచన, లోపలికి వెళ్ళాను.

"బావకు కాఫీ తెచ్చాను నాన్నా !"

"ఆఁ ! కాఫీయా ! _ ఎవరు కాచారూ ?

"నేనే నాన్నా !"

"ఒరే రామం ! రామం ! చూశావ్రా నీకోసం కాఫీ కాచిందిరా మా సులోచన రామం !"

రామం వెళ్ళిపోయాడు, మా రామం !

అరె ! తన కళ్ళ జోడు కూడా వదిలి వెళ్ళిపోయాడే ? "రామం.. రామం !"

"మామయ్యా, లోపలున్నాను !"

"ఇదుగో కళ్ళ జోడు.. అక్కడ వదిలేశావురా !"

"అవి నాకెందుకు మామయ్యా నా సులోచనాలు యివిగో ! " అంటూ, నా బిడ్డను దగ్గరకు చేరదీసుకున్నాడు!

★★★

.

# బహిష్కృతుడు

-మాధవపెద్ది గోఖలే

(యువ మాసపత్రిక, 1961 డిసెంబర్ సంచిక, నుంచి పునర్ముద్రణ)




స్కూలు మాష్టరు సాంబయ్య రైలు ప్లాట్ ఫారం మీద నుంచుని రైలు పట్టాలు రెండు గీతలుగా ఎంతో దూరానికి పోయి కలుసుకునే చోట చిన్న నల్లటి ఆకారంతో పొగ వొదులుకుంటూ ఢిల్లీ ఎక్స్ ప్రెస్ రావటం చూశాడు. ఆ బండిలో తన చిన్ననాటి స్నేహితుడూ తన వూరి వాడైన సుందరమూర్తి వస్తున్నట్టు తనకు జాబు వచ్చింది. షుమారు ఇరవై ఏళ్ళ కిందట సుందరం వూళ్ళోనుండి అకస్మాత్తుగా అదృశ్యుడవటం జ్ఞప్తికొచ్చింది సాంబయ్యకు వాడు మద్రాసు, బొంబాయి, కలకత్తాల్లో, తిరుగాడ్తున్నాడని గాలి వార్తలు వస్తున్నప్పుడల్లా సాంబయ్య చెవి కోసుకుని వింటూండేవాడు. చిన్నప్పుడే సుందరం గాడికి కనబడ్డ ఖాళీ చోటల్లా బొమ్మలు గీసి ఖరాబు చేసే పిచ్చి వుండటం సాంబయ్యకు యిప్పటికీ జ్ఞాపకం వుంది. ఆ పిచ్చి సుందరం పరారీకి కారణమైందని ఎందర్తోనో చెప్పాడు కూడా. ఎందుకంటే, సుందరం డ్రాయింగు నేర్చుకుంటానికి పట్నం పోతానని వాడినాన్న సుబ్బయ్య పంతుల్తో చెప్పటం, ఆయన వాణ్ణి... "పుండాకోరు వేషాలేస్తే వొళ్ళు హూణం చేస్తా" నన్నమీదట ఇంట్లో కొంత రగడ జరగటం సాంబయ్యకు సూదిలో దారం గుచ్చినంత వయినంగా తెలుసు. అయితే సుందరం బొమ్మలు వేయటంలో ప్రవీణుడై ఆ విద్యతోనే వాడు ఇటీవల ఢిల్లీకి చేరి ఘనంగా ధనార్జన చేస్తున్నట్టు విని నిర్ఘాంత పోయాడు సాంబయ్య సుందరం స్థితివంతుడవుతున్నాడనే దుగ్ధతో కాకపోయినా తమ స్నేహాన్ని జ్ఞాపకం చేస్తూ వాడికి సాంబయ్య వుత్తరాలు రాసిన మాట మట్టుకు నిజం.

భూమిని అదరగొడ్తూ ఎక్స్ ప్రెస్ బండి ధన్ ధనామంటూ వచ్చి ప్లాట్ ఫారమంతా ఆక్రమించుకునే గడబిడకు గాని తన స్మృతికల్లోలం నుండి తెప్పరిల్లు కోలేదు సాంబయ్య సుందరాన్ని సులభంగా గుర్తుపట్టగలిగే ధోరణిలో వున్న సాంబయ్యకు ఆశాభంగం కలిగింది. అది చిన్న

స్టేషను అవడం వల్ల ఎక్కే దిగే ప్రయాణీకులు ఓ పదిమందికన్నా లేనప్పటికీ ఎక్స్ ప్రెస్ బండి కూతకూసి ప్లాట్ ఫారం వొదిలి పోయిన కాసేపటికి గాని ప్లాట్ ఫారం చివర్న స్టేషను పేరున్న చెక్కదగ్గిర చేతిలో మధ్యరకం సూట్ కేసూ, చంకలో ఓ అట్టలకట్టా, సంచీ తగిలించుకున్న ఒక పొడుగాంటి వ్యక్తిని సాంబయ్య గమనించలేదు అంగలేసుకుంటూ ఒక క్షణంలో ఆ వ్యక్తి దగ్గరకు చేరుకున్న సాంబయ్య "నువ్వు సుందరానివి కదూ?" అనడిగాడు రొప్పుకుంటూ.

నలిగిన లాల్చీ, పైజమా, మందపాటి ఫ్రేము కళ్ళద్దాలు, విశాలంగా వుండి చిట్లిస్తున్న కళ్ళతో "ఏం సాంబయ్యా బాగున్నావా? నువ్వు నా కోసం నాలుగు మైళ్ళున్న స్టేషనుకు వస్తావనుకోలేదు!" అంటూ నవ్వుతూ వచ్చి సాంబయ్య చేయి పట్టుకున్నాడు సుందరమూర్తి.

"ఇదేంట్రా సుందరం, సకుటుంబ సమేతంగా వస్తావనుకుంటే మరీ అతి సాదాగా వస్తే ఎట్ల ? సూటూ, బూటూ, హేటూ, బంట్రోతు లగాయతు దర్జా వొలకబోస్తూ దిగుతావనుకుంటే అసలు విషయం, మన ఆంధ్రులు కాస్త అవసరాన్ని గుర్తించయినా నలుగుర్ని ఆకట్టేట్టుగా పటాటోపం కనబరుస్తారేమోనని చూస్తా అబ్బే మాటవరసకైనా ఆ మెళుకువలుంటేగా!" అన్నాడు సాంబయ్య. సుందరమూర్తిని యింకా పరీక్షిస్తూ.

మిత్రులిద్దరూ స్టేషను పక్క పూరిగుడిసె కాఫీ హోటల్లో టిఫిన్ తిని సుందరం కోరిక మీద వాళ్ళ పల్లెటూరుకు నడక సాగించారు.

"ఇక్కడ గుర్రబ్బళ్ళు ప్రయత్నిస్తే దొరుకుతై గాని నాకు అసలు నడకంటే మహా సరదా" అన్నాడు సాంబయ్య. సుందరం పక్క సూటుకేసు పట్టుకు నడుస్తూ.

"బళ్ళంటే నాకు రోత ! యిక్కడి దృశ్యాల్నీ యీ మాగాణి భూమి గాలి పీలుస్తూ నడుస్తుంటే నా ప్రాణానికి హాయిగా వుంది. యీ పంట చేలల్లో నారుమళ్ళు లెమన్ గ్రీన్ కలర్లో ఎంత అందంగా వున్నాయ్ ! ఆ వెర్మీలియన్ తంగేడు పూలగుంపు చూశావా. ఆ గ్రీన్స్ లో ? అద్భుత సృష్టిగా లేదూ ? యీగాలి తగుల్తూనే నాకో ఇరవైయ్యేళ్ళ వయస్సు తగ్గినట్టుగా వుంది!_" అన్నాడు సుందరం గుండెనిండా గాలి పీలుస్తూ.

ధనరాసులూ, దర్జాలొలికే ఢిల్లీలాంటి పట్నాల్లో ఇరవైయ్యేళ్ళుండి వూడి పడిన యీ సుందరం వాలకమేమిటని తన్ను తాను అమాయకంగా ప్రశ్నించుకున్నాడు సాంబయ్య. ఇంతకు ముందా పూరిగుడిసె కాఫీ హోటల్లో పొయిదగ్గర మట్టినేలమీద తెల్లటి పాలరాయి మీద కూచున్నట్టు బాసీపీటా వేసుకుని ఆ ఇడ్లీ పెసరట్లను పంచభక్ష్య పరమాన్నాలల్లే ఆవురావుర్న తింటమే కాకుండా ఆ వుప్పు చెమటలలో మునిగి తేల్తున్న హోటలు వంటవాడికేసి కన్నార్పకుండా ప్రాణమిత్రుడల్లే అప్యాయంగా చూట్టం తలుచుకున్న సాంబయ్యకు ఒక్కసారి పచ్చి ఆముదం తాగిన భావం కలిగింది.

"ఒరే సుందరం, ఇరవైయ్యేళ్ళ పట్నవాసం గాలితిన్న నీలో యింకా మన పల్లెటూరి వేషాలు పట్టుకు వేళ్ళాట్టం చూసి నాకు నిజంగా ఆశ్చర్యంగా వుంది!" అన్నాడు సాంబయ్య. సరైన ధోరణికి వస్తూ.

"నాకు మట్టుకు నిన్ను ఇరవైయ్యేళ్ళ కిందటి సాంబయ్యల్లేనే చూట్టం మహానందంగా వుందంటే నమ్ము ! దురదృష్టవశాత్తు సహజత్వాన్ని అట్టిపెట్టుకుంటున్న పల్లె ప్రజల వ్యక్తిత్వాలకు నిజంగా మసి ఏర్పడి మరుగుపడ్తే నాలాంటి వాళ్ళు ఉరిపోసుకు చావాల్సిందే ! పట్నం మొహాలు యంత్రంలో అచ్చుయినట్లుంటాయ్ వాటిలో స్వాభావికత వుండదని నా నమ్మకం ఎందువల్లంటే, హెచ్చు తగ్గుల పోటీలో వాస్తవాన్ని మరుగు పర్చుకునేందుకు పట్నం మనుషులు ఎన్ని కృత్రిమ సాధనాల్నయినా అనుసరిస్తారు. ఇందాక నువ్వా కాఫీ హోటలు వంటవాణ్ణి చూసేవుంటా వనుకుంటా. అతన్లో నాకు రక్తమాంసాలున్నట్లనిపించింది! ఆ పొయ్యి సెగకు చమట్లో మునిగి తేల్తున్నా, నేను ఇడ్లీ పచ్చడి బాగుందనేసరికి ఆవుర్న నవ్వాడు. అలాంటి నిర్వికార గుణంగల వ్యక్తిత్వం పట్నాల్లో మచ్చుకైనా కనుపించదు!" అన్నాడు సుందరం. పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ.

“నీ వుద్దేశ్యాల్ని గురించి నేనేమనుకుంటున్నా నువు పట్నాలకు చేరి ప్రయోజకుడవై మన వూరుకు కీర్తి నార్జించావని నా నమ్మకం. అయితే నువ్విన్నేళ్ళూ పట్నవాసుల్ని అసహ్యించుకుంటూనే ప్రయోజకుడవై ధనార్జన ఎలా చేయగలుగు తున్నావో వూహించ లేకుండా వున్నా!” అన్నాడు సాంబయ్య, సుందరాన్నోకంట చూస్తూ.

“నువు ఉపాధ్యాయిడివి గనుక విషయం నేను సూక్ష్మంగా చెప్పినా అర్ధం చేసుకోగలవనుకుంటా నేను కలలుకన్న చిత్రలేఖన సాధన చేయటానికి పట్నాల్లో తప్ప ఆస్కారం లేదు అక్కడ కళల్ని గౌరవించడం, ఎంతో కొంత ఆర్ధికంగా ముట్ట చెప్పటం, బలవంతంగానైనా తెచ్చి పెట్టుకుంటారు అందుకే నాకిష్టమున్నా లేకపోయినా నేను పట్నాల్లోగాని జీవించలేను. కాని కళాసృష్టికి కావలసిన వైవిధ్యం అక్కడ లభించదని యిటీవలే నేనర్ధం చేసుకున్నా ఇన్నాళ్ళూ నేను పెద్ద పెద్ద వ్యాపారస్తుల అవసరాలకు నా నైపుణ్యం వినియోగించి ధనార్జన చేసిన మాట వాస్తవం. కాని ఆ దౌర్భాగ్య స్థితికీ, కళాభివృద్ధికీ సాపత్యం లేదనే త్రాష్టపు జబ్బు కొన్నేళ్ళనుంచి నాలో ప్రవేశించి తినేస్తున్నది ఈ జాడ్యం వల్లనే నేనీనాడు అటు ధనార్జనకూ, యిటు కళాభివృద్ధికీ చెందని దైన్యావస్తలో వున్నా” అన్నాడు సుందరం, అంతరిక్షంలోకి చూస్తూ.

“డబ్బు పుట్టక రోజు గడవటం సమస్యగా వున్న నాలాంటి అభాగ్యుడికి నీ తర్కం వింతగా తోచటం సహజం. ధనార్జన శక్తి పొందిన ఏ ప్రాణి జీవితమైనా తరిస్తూంటం నా కళ్ళారా చూస్తున్నా! నువూ అంత అదృష్టవంతుడవనే నేనిన్నాళ్ళు నమ్ముతున్నా” అన్నాడు సాంబయ్య.

“సాంబయ్యా, నువు అక్షరాలా ఉపాధ్యాయుడివి! నువు యిన్నేళ్ళుగా వందలకొద్దీ విద్యార్ధులకు చేస్తున్న బోధలవల్ల నీకేనాడైనా ఆత్మ సంతృప్తి కలిగినట్టానిపించిందా?” అనడిగాడు సుందరం.

“నా విద్యార్ధుల్లో ఏ కొద్దిమంది విద్యాధికులైనా నాకాత్మ సంతృప్తి కలిగినట్టు రుజువవుతుంది!” అన్నాడు సాంబయ్య.

“ఆడవారికి నగలాపేక్ష వున్నట్టు సమాజానికి విద్యాధికులు కూడా అంత అలంకారమే, నేను చిత్రకళలో నైపుణ్యం పొందినంత మాత్రాన నేను వేసే చిత్రాలకు విలువ వుంటుందంటావా సాంబయ్యా ?” అంటున్న సుందరం మధ్యలోనే బ్రేకువేసినట్టాగిపోయి వెర్రి చూపులు చూస్తూ నిలబడ్డాడు.

సన్నగా సాగిన వానజల్లుతో, పడమటి దిక్కున ఇంద్రధనుస్సు ప్రత్యక్షమై వుంటే, ఇరవై గజాల దూరంలో రోడ్డు ప్రక్క గొడ్లపిల్లకాయల పక్కన నారుమడి గట్టుమీద ఎర్రచీర పైకి ఎగ్గట్టి “వానావచ్చే వరదా వచ్చే చాకలి వాడి బానావచ్చే” అని చేతులూపుతూ ఎగుర్తున్న ఒకమ్మాయిని చూసిన సుందరం, మంత్రించబడిన వాడల్లే యింకొంచెం ముందు రోడ్డుపక్క చింతచెట్టుకిందకు చేరి సంచిలోని తెల్లకాగితాల పుస్తకం తీసి కలంతో బొమ్మలు గీయడం మొదలుపెట్టాడు. ఈ వింత సంఘటన ప్రేక్షకుడల్లే చూస్తున్న సాంబయ్య, మెల్లిగా వెళ్ళి సుందరం వీపు వెనుక నుంచుని, అతను బరబర గీకుతున్న గీతల్ని శ్వాసబిగపట్టి చూడసాగాడు సుందరం అతి త్వరగానూ, సునాయాసంగానూ చిక్కిరిబిక్కిరిగా గీస్తున్న గీతలకు ఏర్పడుతున్న చిత్రరూపం చూస్తుంటే ఒక సంగీత పాటకుడు అతి తిక్కమీద విసురుగా రాగాలాపన చేసి పాటందుకున్నట్టల్లే అనిపించింది సాంబయ్యకు.

“ఆ గొడ్లపిల్లలు మనవేపు అనుమానంగా చూస్తున్నార్రా సుందరం.. అరుగో యిద్దరు కొక్కిరాయి వెధవలు మన వేపు రానే వస్తున్నారు చూడు చూడు ఆ ఎర్రచీర చంద్రమ్మ కూడా వస్తున్నది” అంటున్న సాంబయ్యకు ఒక్క సారి బాకుతో పొడిచినంత చూపు చూసి ఆ గీసిన గీతలమీదే యింకా బలంగా గీయటం మొదలుపెట్టాడు సుందరం. సుందరం చూపుకు వెలతెలా పోయిన సాంబయ్య అప్పటికే వచ్చి చుట్టు ముట్టిన గొడ్లజనాన్ని వురిమి చూస్తూ “మీకేం పన్లేదూ జోరీగలు ముసిర్నట్టు ముసుర్తున్నారూ ?” అనరిచాడు.

“సాంబయ్యగోరూ ఏందామడిసి అదేమయిన మాకేసి చూసి సూసి రాస్తావుండాడూ?” అనంటూ ఎర్రచీరా, నల్లగళ్లరవికా కొప్పు తెల్లరాయి ముక్కుపుడకా, చెవులకు కమ్మలూ, నవ్వుతున్న కళ్ళతో నల్లగా మెరుస్తున్న ఆ అమ్మాయి, నోట్లో గడ్డిపోచ నములుతూ ఒయ్యారంగా నడుస్తూ వచ్చి అడిగింది.

కన్నార్పకుండా ఆ అమ్మాయిని ఓ దేవకన్యల్లే చూస్తున్న సుందరాన్ని చూస్తున్న సాంబయ్య "యిది మన వూరి వెంకయ్యా వీరమ్మల కూతురు చంద్రమ్మలే!" అన్నాడు, యీ సంఘటన తొందరగా ముగిస్తే బాగుండుననుకుంటూ.

"ఈయన ఢిల్లీపట్నం లెగిసెల్లిన మన చుబ్బయ్యగారి ఎంకట లచ్చుమ్మ గారబ్బాయిగాదూ ? యియ్యాల రవిలు బండికి వత్తాడని అంటావుంటే యిన్నాలే," అని చంద్రమ్మ అంటున్నదో లేదో ఎవరికీ తెలియకుండా సుందర వెనుకనేవున్న చింతచెట్టు పంగల్లోకెక్కిన ఓ గొడ్ల పిల్లకాయ సుందరం చేతిలో వున్న పుస్తకంలొ గీతల్ని చూసి "యీయన సెంద్రమ్మ బొమ్మ గీస్తుండాడహో" అనరుస్తూనే టపీమని చెట్టుమీదనుంచి దూకి, మరుక్షణంలోనే గొడ్ల మందలోకి దూరి మాయమైనాడు.

★ ★ ★

ఆ మర్నాడు స్కూలు పని ముగించుకుని గాని సుందరాన్ని కలుసుకోలేదు సాంబయ్య. మాటకు ముందే కళ్లనీళ్ళు పెట్టుకునే సుందరం తల్లి వెంకట లక్ష్మమ్మ ద్వారా తెలుసుకుని వారి గొడ్లసావిట్లో ఓ మూలవున్న సుందరాన్ని చూశాడు సాంబయ్య.

"ఏమిరోయి సుందరం ? అప్పుడే రంగుల రంగంలోకి దిగినట్టున్నావే? చివరకు యీగొడ్ల సావిట్లోనుట్రా నీ కళాసాధనా? యింకా నయం! యీ సావిట్లో పశువులు, దూడరేణువులు లేవు!" అంటూ అక్కడ నులకమంచం మీద పక్కచుట్ట ఎత్తుగా పెట్టుకుని దానికి పేపరున్న పీట చక్కనానించి ఏదో తైలవర్ణాల్తో వేస్తున్న సుందరాన్ని పలకరించిన సాంబయ్య. అట్లాగే నిలబడిపోయి సుందరం వేస్తున్న బొమ్మను పరీక్షగా చూసి అప్రయత్నంగా నోరు తెరిచాడు.

సుందరం చిత్రిస్తున్న ఆ చిత్రం రంగులమీద రంగులెక్కి గంద్రగోళంగా వున్నట్టు ముందు చూడంగానే అనిపించినా ఆ బొమ్మలోని చంద్రమ్మను ఆనవాలు పట్టాడు సాంబయ్య.

ఒక జానెడెత్తు పీటమీద ఒకపక్కగా కాళ్ళు ముడుచుకుని, తొడలూ ఒంటినా చీర తొలిగి నడుము విల్లులాగా వంచి, ముందుకు పొడుచుకువచ్చిన స్తనకుంభాల్తో అతి ఒయ్యారంగా తలవొంచుకుని కొప్పులో పూలు ముడుచుకుంటున్నదా నల్లటి స్త్రీ చిత్రం.

"సుందరం? నువు వేస్తున్న ఆ బొమ్మ ఎవరిది?" అనడిగాడు సాంబయ్య. మొహాన స్వేదబిందువులు పొటకరిస్తుంటే.

"లోకానికి కనపడని ఒక అద్భుత అజ్ఞాత స్త్రీది ! నిన్ను కూచోమంటానికి యిక్కడేం కుర్చీలు లేవు యీ బోర్లించిన గాబు మీద కూచో ఏం ఎట్లావుంది వేస్తున్న చిత్రం ?" అన్నాడు సుందరం. చిత్రాన్ని పూర్తిచేసే దశలో అక్కడక్కడా రంగులు ఒక వెదురు బద్దతో మొత్తుతూ.

"చిత్రంలో ఆ మనిషి చంద్రమ్మల్లే వుంది నాకు" అన్నాడు సాంబయ్య ఆ స్త్రీమూర్తి అంగాల్ని కన్నార్పకుండా చూస్తూ.

"ఈ స్త్రీ ఎవరయిందీ నాకు నిమిత్తం లేదు ఏ దుర్వాసనల ప్రభావానికీ గురి కాని వ్యక్తిత్వం వున్న స్ఫటికం లాంటి మూర్తి ! యీ అన్వేషణే నా కళాసాధనకు మూలం యిదిగో యీ రెండో చిత్రం కూడా చూసి నీ అభిప్రాయం చెప్పు" అంటూ మంచంకోదు బోర్లావేసి ఆనించివున్న అట్టను తీసి సాంబయ్యకు కనపడేట్టు మంచం యివతల వేపు ఆనించాడు సుందరం.

ఈ చిత్రం మరీ గంద్రగోళంగా వుంది సాంబయ్యకు ఎర్రచీర పైకి ఎగ్గట్టిన ఒక నల్లటి పడుచు పిల్ల. బహుశా చంద్రమ్మ కావచ్చు. ఒక ఆకుపచ్చ రంగు పేలిక మీద వొయ్యారంగా నుంచుని, చెవిదగ్గర చెయి పెట్టుకుని పాడ్తున్న ధోరణిలో వుంది ఆ పిల్ల వెనుక ఆకాశంలాగా వున్నచోట ఇంద్రధనుస్సల్లే రంగుల మీద రంగులెక్కి గజిబిజిగా వుంది ఎడంపక్క ఒక గేదపడ్డ ఏటవాలుగా ఆకాశం వేపు ఎగుర్తూ వుంటే దానితోక పట్టుకుని ఒక గొడ్లపిల్లకాయ ఆ పశువుతో పాటే పైకెగుర్తున్నాడు. ఆ చిత్రం సాంతం చూసి ఒక్క గుటక, మింగాడు సాంబయ్య.

"ఆ చిత్రం పేరు ప్రకృతి రాగం మనం నిన్న ఆ వాన జల్లులో పశువుల మందవద్ద చూసిన ఆ జీవుల మనస్తత్వాలీ చిత్రంలో ప్రతిబింబిస్తున్నాయ్" అని చిత్రంలోని లక్ష్యం విషయమై చెపుతున్న సుందరం, సాంబయ్య గొడ్లసావిడి పక్కన సహం పడిన తాటాకుల దడి

వేపు చూస్తుంటం గమనించాడు అక్కడ తమవంక చూసీ చూడనట్టు నవ్వుతూ ఎర్రచీరతో నుంచునుంది చంద్రమ్మ చంద్రమ్మ పూరిగుడిసె ఆ దడి వెనుకనే వుందని సాంబయ్యకు తెలుసు.

చంద్రమ్మకేసి కొరకొర చూసి "నాకు పనివుంది, మళ్ళీ కనిపిస్తా సుందరం" అంటూ గిర్రున తిరిగి భూమిని బలంగా తొక్కుకుంటూ గబగబ వెళ్ళిపొయ్యాడు సాంబయ్య.

ఒక వారం రోజుల తర్వాత అర్ధరాత్రి సమయంలో చంకలో ఒక పక్క సంచీ, యింకోపక్క బొమ్మలకట్టా, చేతిలో సూట్ కేసుతో సుందరం, సుందరం తండ్రి సుబ్బయ్య పంతులూ ఆ పల్లెటూరుకు మైలు దూరంగా నిశ్శబ్దంగా వచ్చి రోడ్డు మీద ఎదురెదురుగా నుంచున్నారు.

"భ్రష్టుడా, మా కడుపున చిచ్చుపెట్టావు! నా వంశం నశించింది" అన్నాడు సుబ్బయ్య పంతులు బుసకొట్టినట్టు.

"నాన్నా, నువు నన్ను అపార్థం చేసుకుంటున్నావు. నాకూ ఆత్మాభిమానం వుంది." అన్నాడు సుందరం నేలమీద నుంచుంటూ.

"మండింది నీ ఆత్మాభిమానం, వూరూ నాడూ ఏకమై ఆ చంద్రమ్మనూ నిన్నూ బజారుకు యీడిస్తే నా తల ఎక్కడ పెట్టుకున్నాను? సహం చచ్చిన మీ అమ్మ రొమ్ములు బాదుకుంది. ఇన్నాళ్ళు పరువుగా బతికి బట్టకట్టిన వూళ్ళో వెలివేయబడ్డాం. వాళ్ళు మమ్మల్ని కాకులు పొడిచినట్లు పొడుస్తారు నువు ఎక్కడో ఎప్పుడో మాల పెళ్ళి చేసుకుంటే ఎవరేడ్చారు. యిన్నేళ్ళకు యిప్పుడు మళ్ళీ పని పెట్టుకువచ్చి ప్రత్యక్షంగా మమ్మల్ని సర్వనాశనం చేశావు. ఆ సాంబయ్య త్రాష్టుడు ! వాడికీ చంద్రమ్మకూ సంబంధం వుంది. నువు దాని గుడిసెలో చేరి దాన్ని నగ్నంగా బొమ్మలు వేస్తున్నావని దాని తండ్రీ అన్నల్తో చెప్పి నిన్ను బజారుకు లాగించాడు. యిదిట్రా నీ కళాసాధన ? బూతుకూ కళకూ ముడివేసి భ్రష్టత్వంలో పండిపోయినావు !" అన్నాడు సుబ్బయ్య పంతులు, నిప్పురవ్వలు రాలుస్తూ.

"కళాసాధనకు సత్యం సౌందర్యం, భావం, ప్రయోజనం బలమైన ఆధారాలు. సాంబయ్య సంబంధాల్తో నాకు ప్రశక్తిలేదు. నా సాధనకు చంద్రమ్మ ఆధారమైంది గనుక బహిరంగంగా నేనా పిల్ల గుడిసెలోకి పోవటంలో తప్పెంత మాత్రం లేదు. యీవిషయం తెలుసుకోలేని వాళ్ళు నన్ను బజారు కీడ్చినందుకు నా కావగింజంత విచారం కూడా లేదు. ఎందుకంటే రేపు నేనీ చిత్రాల్ని ప్రదర్శించినప్పుడు నాకు గౌరవం లభిస్తే యీ సాంబయ్య తలనేలకేసి పగులగొట్టుకోడని కూడా నాకు తెలుసు కాని యీ జరిగిందానికి మీరు అప్రదిష్టపాలైనందుకు నా హృదయం దహించుకు పోతున్నది మన్నించండి. అంతకన్నా మీకు అభ్యంతరం లేకపోతే మీరు ఢిల్లీకి వచ్చి నా భార్యా బిడ్డల్తో వుంటే మేమెంతయినా ఆనందిస్తాము. వెళ్ళి వస్తా నాన్నా_" అంటూ ముందుకు సాగిపొయ్యాడు సుందరమూర్తి అప్పుడే ఉదయిస్తున్న చంద్రకాంతిలోకి అదృశ్యమవుతున్న కొడుకును కన్నార్పకుండా చూశాడు సుబ్బయ్యపంతులు.

★★★

.

# తీరని సమస్య

- కొడవటిగంటి కుటుంబరావు

(తెలుగు స్వతంత్ర 1948 ఆగస్టు 6 సంచిక, నుంచి పునర్ముద్రణ)

ద్రౌపది రంభ అని ఎపుడూ ఎవరూ అనలేదుకానీ, పదేళ్ళ క్రితం కూడా ఎరిగిన వాళ్ళు "దానికేం? చక్కగా, కనుముక్కు తీరుగా ఉంటుంది," అనుకునేవాళ్ళు. ఇప్పుడెవరన్నా దాని పెళ్ళి విషయం మాట్లాడేప్పుడు, "ఆఁ, ఏం చూసి చేసుకుంటారు, బాబూ"? వాళ్ళ నాన్న ఇచ్చే కట్నం చూశా? దాని అందం చూశా ?" అని చప్పరిస్తున్నారు. ద్రౌపది మారిపోయింది.

ఎందుకు మారదూ ? ఇరవైతొమ్మిది కూడా వెళుతుంది, ఇంతవరకూ పెళ్ళి కాలేదు; అయేటట్టు కూడా లేదు. బియ్యే పాసయింది. ఉద్యోగం లేదు. అన్న కామేశ్వరావు రెక్కలమీద సంసారం నానా అగచాట్లుగా వెళుతున్నది. ఆతనికి అప్పుడే ఆరుగురు పిల్లలు. రోగిష్టి పెళ్ళాం. పిల్లల్నికనటానికి తప్ప మిగతా అన్ని పనులకీ ఆవిడకి రోగమే. ఆ రోగిష్టి పెళ్ళాన్ని కనిపెట్టుకుని ఉండేటందుకు రోగిష్టి అత్తగారు. ఒక జల్లు పడ్డా, కాస్సేపు నీళ్ళల్లో నానినా ఆవిడకి కాళ్ళు పట్టుకుపోయి యమ బాధ పడుతుంది. ఆచారవంతురాలు గనక నీటిలో నానటం రోజూ ఉంటుందనే చెప్పొచ్చు. ముసలాయనకి అంటే ద్రౌపది తండ్రికి ఆస్తి పోయిన నాటినుంచి మతి సరిగా లేదు. అస్తమానం ఇంటోనే కూచుంటాడు. ఇంటి ఇబ్బందులన్నీ ఆయన్ని, పాపం, బాధిస్తూంటాయల్లే ఉంది. వాటిని గురించే మననం చేస్తూ ఉంటాడు. ఎప్పుడన్నా కామేశ్వరావు తండ్రిమీద విసుక్కుంటాడు.

"ఆర్చేవాడివా, తీర్చేవాడివా ? నీకెందుకయ్యా ? ఏం రోగాలో, ఏం బాధలో, ఏం దరిద్రమో మేం పడుతున్నాంగా ? వేళకింత తిని హాయిగా కూచో, ఏ బాధా లేదనుకో."

ముసలాయనకి అది యిష్టం లేదు. ఎద్దుదున్నితే జోరీగ రొప్పిందన్నట్టు, నిజమైన శ్రమంతా కామేశ్వరావు పడుతుంటే, అతనికి సానుభూతిగా కాబోలు, కర్మ, ముసలాయన మూలుగుతూ ఉండేవాడు. అటువంటి పరిస్థితిలో కామేశ్వరావే తనని కోప్పడేసరికి ఆయనకి కష్టం వేసేది. వెంటనే ద్రౌపది మీద విరుచుకుపడేవాడు :

"నీ మొహం తగలెయ్యా, నీ చదువు చట్టుబండలుగానూ ! నా ఆస్తంతా నీ చదువుకే ధారపోశానే! నీ చదువంతా పెట్టి ఒక రూపాయి సంపాదించగలవుటే ? ఆ డబ్బంతా వాడికింద ఖర్చుపెట్టి ఏం ఇంగ్లండో పంపిస్తే వాడికి వేలకు వేలు జీతం వచ్చి ఉండునుగదే ! వేలకు వేలు !

నీ మొహాన దేవుడేంరాత రాశాడో గాని నిన్నెవడూ పెళ్ళయినా చేసుకోడేమే ? కుంటివాళ్ళకీ, గుడ్డి వాళ్ళకీ క్షణంలో పెళ్ళవుతుందిగాని నీకు మటుకు కాదే! నీకసలు మొగుడంటూ పుట్టి ఉంటేగా?"

వీటన్నిటికీ ద్రౌపది సమాధానం చెప్పగలదు. కాని ఏమిటి లాభం ? ఒక్కోసారి ఈ మాటలకు ద్రౌపది ఏడిచేది. కాని పైవాళ్ళు, "ఛీ ఊరుకో. మతి లేని వాడి మాటలు పట్టించుకుంటారా?" అని సముదాయించేవాళ్ళు. సమదాయింపు సులభం. గురి లేనివాడు రాయి విసిరినా తగిలితే నొప్పెట్టుతుంది. మతిలేని వాడితో కలిసి ఉంటూ మతి గలిగిన మనిషల్లే ఏళ్ళ తరబడి ఉండటం చాలా కష్టం. పిచ్చీ, హిస్టీరియా మొదలైనవి మానసిక అంటు వ్యాధులు.. ద్రౌపదికి అనేక సార్లు సందేహం కలిగింది, తనకి మతి సరిగా ఉందా అని...

ఇంటిల్లిపాదికీ పనిచెయ్యటానికి ఆరోగ్యంగా ఉన్న మనిషి ఇంటికంతకీ ద్రౌపది ఒకటే. ఆమె ఆ యింటో చేసే పని ఎవరన్నా సంపన్నులకి చేస్తే నెలకొక వందరూపాయిలిస్తారు. కాని, కామేశ్వర్రావేం ఇవ్వగలడు. అతను తెచ్చుకునేదే నూట పాతిక. అందుచేత ద్రౌపది ఈ చాకిరీ యావత్తూ తన సొంతానికనుకునే చెయ్యాలి.

దురదృష్టవశాత్తూ ఈ కొంపలో ఈ చాకిరీ తప్పిస్తే ద్రౌపదికి సొంతం ఇంకేమీ లేదు. ఈ ఇల్లు తనదనీ, ఈ ఇంటో తనకు సహజమైన స్థానం ఉందనీ ద్రౌపది విశ్వసించటం మానేసి అయిదారేళ్ళయింది.

ముసలాయన మతి పూర్తిగా చెడక మునుపే, "దీని పెళ్లయితేనే గాని నాకు మంచి రోజులు  రావు. చక్రం చూసినవాడల్లా ఆ మాటే అంటున్నాడు." అని ప్రారంభించేదు. కాలక్రమేణా ఈ పాటకి చాలా సంగతులు చేరాయి. " రోజూ లేచి దీని మొహం చూసి బయటికెళ్ళితే ఎవడూ ఎర్రఏగానీ చేతిలో పెట్టడుగదా !".. దీనికి పెళ్ళయేదేమిటీ? నా అదృష్టం తిరిగేదేమిటి?".. ముసలాయన అట్లా ఎడమైపోయాడు.

కామేశ్వర్రావు మరోరకంగా ఎడమైపోయినాడు. అతను చెల్లెల్ని పోషించలేకపోవటం గాని, ఎట్లాగైనా ఆమె పెళ్ళి అయిపోయి కాపరానికి వెళ్ళిపోతే తనభారం కొంత తగ్గుతుందనుకోవటం కాని అయితే ద్రౌపది అంతగా విచారించి ఉండదు. ఆమె కూడా చదువుకున్నదే, అర్థం చేసుకోగలదే. కాని కామేశ్వర్రావు అచ్చంగా అంతటితో ఆగలేదు; ఆమెకు పొట్టి చచ్చు సంబంధాలు తెచ్చి ముడిపెట్టాలని తొందరపడ్డాడు. అందమూ, గుణమూ లేనిచోట డబ్బుకోసం గడ్డి తినే వాళ్ళనే మనం ఎంతో నీచంగా చూస్తాం. అందమూ, గుణమూ, డబ్బూకూడా లేని దిక్కుమాలిన వెధవలకి తన చెల్లెల్ని అంటగట్టాలని చూశాడు కామేశ్వర్రావు. ఆ సంబంధాలను గురించి ద్రౌపదితో ఆబద్దాలాడి దొరికిపోయినాడు. ఆమె వొదిలిపోతే చాలు, అవతల ఆమె గతి ఏమైనా సరే అనే స్థితికి ఆతను వచ్చాడని తెలిసినాక ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టేసింది. అంత అసమర్థపుస్థితిలో ఉన్న ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టటంకంటే ఇంకే విధంగా శిక్షించగలదు ?

అతనికి తనమీద సోదరప్రేమ లేకపోతే లేకపోయింది ; తన పిల్లలకీ, పెళ్ళానికీ, చివరికి అత్తగారికీ కూడా చచ్చేట్టు చాకిరీ చేస్తున్నందుకు కామేశ్వర్రావు తనమీద ఆపాటి కృతజ్ఞత చూపగూడదా ? ఏ భ్రష్టుణ్ణో, అతనిమాట చొప్పునే, పెళ్ళాడి తన దారిన తాను కాపురం వెళ్ళిపోతే మర్నాడు ఈ కుటుంబంగతి ఏం కాను ? ఆ సంగతి అతను ఆలోచించలేడా ?

తన తండ్రీ, అన్నా దూరమైనాక ఆ ఇంటో ద్రౌపదికి దగ్గిరవాళ్ళెవరు ? ఈ విషయాలన్నీ ఎవరితో చెప్పుకుంటుంది? బయటికి అనుకోవటానికి లేని ఈ బాధ ఆమె మనస్సును తొలిచి డొల్ల చెయ్యసాగింది. ఇది ఆమె జీవితానికి తెగని సమస్య. ఇందులో పెళ్ళీ, డబ్బూ, స్వేఛ్ఛా ఈ మూటి తాలూకు పోగులూ చిక్కుపడి ఉన్నై.

ద్రౌపది తనకి పెళ్ళి కాలేదని మనోవ్యాధి పాలుకావటం ఇతరుల కెంత సహజంగా కనిపించినా, ఆమె విషయంలో అది కృత్రిమంగా తయారయిన సమస్యే. ఎందుకంటే ఒకప్పుడు ఈ తండ్రే ఆమె జీవితానికి చదువే ముఖ్యమైన విషయంగానూ పెళ్ళి అముఖ్యంగానూ మాట్లాడాడు. ఒకప్పుడామెను చేసుకుంటామని వచ్చిన సంబంధాలు తోసేసి, అవమానించాడు. అది ఆయనకు జ్ఞాపకం లేదు. ద్రౌపదికి

జ్ఞాపకం ఉంది. అదికాక మొగుడు లేదనే చింతే అయితే ఏ ఆడదాన్నీ కుంగదీయదు; మొగుళ్ళుపోయి వైధవ్యం మీదపడి రాళ్ళల్లే ఉన్న వితంతువులు చాలామంది ఉన్నారు.

కాని ఆ వాతావరణంలో ఇప్పుడు ద్రౌపది మామూలు మనిషి కాదు. ఆమెకిప్పుడు పెళ్ళి తప్ప గత్యంతరం లేదు. ఈ ఇల్లూ, వాతావరణమూ వొదిలించుకోవాలంటే పెళ్ళి తప్ప మరోమార్గం లేదు. పెళ్ళయితే తన మిగతా సమస్యలన్నీ తీరుతాయి. ఎంతకీ ఆ పెళ్ళే కాకుండా ఉంది.

“నేను మబ్బుల్లో కూచుని నిజం తెలుసుకోకుండా ఉన్నానా? కామేశ్వరావు నన్ను చేసుకోమన్న సంబంధాలకంటే నాకు మంచివి రాదగవా? అతను నా యోగ్యత సరిగానే అంచనాకట్టాడా ? నన్ను గురించి నాకు ఎంత అధమమైన అభిప్రాయం తెచ్చిపెట్టుకున్నా, ఇతరులకు నామీద ఇంకా తక్కువ అభిప్రాయం ఉన్నట్టుగా తోస్తుందే ! ఏమిటి కారణం? ఇంకా ఎంతని కుంగను? దానికి అంతెక్కడ?” అనుకునేది ద్రౌపది. ఒక్కసారి ఆమెకి ఆత్మవిశ్వాసం ఏమీ లేకుండా పోయి, “ఈ సారి ఎవడన్నా పెళ్ళి చేసుకుంటానని వస్తే కళ్ళు మూసుకుని ఒప్పేసుకుంటాను. నేననవసరంగా ఎందుకు మథన పడాలీ ? నిండా మునిగిన వాడికి చలేమిటి? ఏ పెళ్ళి చేసుకున్నా ఇంతకన్నా దరిద్రంగానూ, నిర్బంధంగానూ, మనో వ్యాధిగానూ ఉండదుగదా ? ఏదైనా ఉన్నవాళ్ళకి పోతుందని భయంగాని, ఏమీ లేని నాబోటి దానికి పొయ్యేదేమిటి? ఈ సారి ఎవడు వచ్చినా చేసుకుంటాను. ఇది నిశ్చయం,” అనుకునేది.

ద్రౌపదికి పరీక్షగా ఒక సంబంధం వచ్చింది. వరుడికి యాభై అయిదేళ్ళు. ఇటీవలే భార్యపోయింది. అయిదారుగురు సంతానం. ఆయనకి తలిదండ్రులున్నారు. తండ్రికి పిచ్చి, తల్లి వ్యాధి పీడితురాలు. ఆచారవంతురాలైన విధవ చెల్లెలొకతె ఉంది. చిన్నపిల్లని చేసుకోమని ఆవిడ గోలట. ఈయన కాస్త లోకజ్ఞాని. పెద్దదాన్నే చేసుకుంటానని వచ్చాడు. ద్రౌపదిని చూసి వెళ్ళాడు.

ఆయన విషయాలన్నీ వినగానే ద్రౌపదికి ఆపుకోలేకుండా నవ్వొచ్చింది. ఈ పెళ్ళయితే తన జీవితంలో ఏమీ మార్పుండదు. ఇక్కడ ఉన్న మనుషులకు నకళ్ళే వాళ్ళూనూ. వీళ్ళు చూసినట్టే తనని వాళ్ళూ పరాయిగా చూస్తారు. ఎందుకీ పెళ్ళి ?

“నా కక్కర్లేదీ సంబంధం” అందామని నోటిదాకా వచ్చింది. కాని బలవంతాన నోరు నొక్కేసుకుంది.

మర్నాడు కామేశ్వరావు కబురు తెచ్చాడు. ఆ పెద్దమనిషికి ద్రౌపది మరీ సన్నగా, జబ్బుగా కనిపించిందిట. ఆయన ఇంకో సంబంధం పద్దెనిమిదేళ్ళ పిల్లని స్థిరపరచుకున్నాడుట.

★★★

.

# బొమ్మల చొక్కా

## - పంతుల జోగారావ్

( 1994 , ఆంధ్రజ్యోతి వారపత్రిక నుంచి పునర్ముద్రణ)

"ఛీ ! నాకీ చొక్కా వొద్దు...!"

బళ్ళోంచి వొస్తూనే, బొత్తాలు విప్పి చొక్కాని విసురుగా ఓ మూలకి విసిరేస్తూ గట్టిగా అరిచేడు నారాయణ. వాడి మాటలకి గైరమ్మ విస్తుపోయింది. చేతిలో పని అలా వదిలేసి, వాడి ముఖంలోకి వింతగా చూస్తూ ఉండిపోయింది. పొద్దున్న కళ కళ లాడుతూ, కొత్త చొక్కా తొడుక్కుని దర్జాగా సంబరంతో బడికెళ్ళిన కొడుకు ధుమధుమ లాడుతూ రావడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది. కొత్త చొక్కా వేసుకోబోతున్న ఆనందంతో వాడికి ముందు రోజు రాత్రి సరిగా నిద్ర కూడా పట్టలేదన్న సంగతి గైరమ్మకి గుర్తుంది. రోజూ కన్నా పెందలాడే నిద్రలేచిపోయి, స్నానం అదీ చేసి, ముస్తాబయి పోయేడు. పసుపు పెట్టిన కొత్త చొక్కా వేసుకున్నాక వాడి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. చద్ది మెతుకులు నోట్లో కుక్కుకుని హుషారుగా చాలా ముందుగానే బడికి బయలు దేరి పోయేడు. అలాంటిది – బడి నుంచి వస్తూనే చిరాకు పడి పోవడం, ముచ్చట పడి కుట్టించుకున్న కొత్త చొక్కా మూలకి గిరాటు వేసెయ్యడం చూసి గైరమ్మకి వాడి ప్రవర్తన ఏమీ అర్ధం కాలేదు.

నులక మంచం నేస్తూ కూచున్న కొండయ్య పరిస్థితీ అలాగే ఉంది. కొడుకు ముఖం ఎందుకో చిటపటాడి పోతోంది. రోజూ బడినుంచి యింటికి వచ్చేటప్పుడు వాడి ముఖంలో కనిపించే హుషారు ఇవాళ మచ్చుకైనా కనిపించడం లేదు.

'అయ్యా, బొమ్మల చొక్కా కొని పెట్టవూ?!' అంటూ చాలా రోజులుగా తనని వేధించుకు తిన్నాడు. డబ్బులు జత పడక తను అదిగో, ఇదిగో అంటూ వాయిదా వేస్తూ వచ్చేడు. ఒక్కోరోజు కోపం వచ్చి, అన్నం తినడం మానేసి పడుకునే వాడు నారాయణ. ఒకటి రెండు సార్లు కొత్త చొక్కా కోసం ఏడ్చి తన చేత తన్నులు కూడా తిన్నాడు.

బొమ్మల చొక్కా తొడుక్కోవాలనే కొడుకు ముచ్చట చూసి, పదీపరకా దాచి, ఎలాగయితేనేం కొత్త చొక్కా కుట్టించేడు తను. కొత్త బొమ్మల చొక్కా కుట్టించి తను యింటికి తెచ్చినప్పుడు వాడి సంతోషం అంతా యింతా కాదు. వెర్రి సంతోషంతో ఇల్లంతా లేడి పిల్లలా ఎగిరి గంతులు వేశాడు.

గైరమ్మ నాలుగైదు ఇళ్ళలో పాచి పనులు చేస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు, వాళ్ళూ వీళ్ళూ యిచ్చిన పాత చొక్కా నిక్కర్లతోనే నారాయణకి గడుస్తోంది. ఆ చిరుగులు పట్టిన పాత బట్టలు వొంటిమీద వేలాడుతూ వుంటే, యిష్టం లేకపోయినా, వాటితోనే కాలక్షేపం చెయ్యక తప్పలేదు వాడికి. కూలి పని చేసి తను తెచ్చేది కూటికే చాలడం లేదు. ఇక కొడుక్కి కొత్త బట్టలేం కొని పెడతాడు?

చాలా రోజులుగా ఉన్న రెండు చొక్కాలూ బాగా చిరుగులు పట్టేయని కొడుకు ఏడుస్తూ ఉంటే వాడి బాధ చూడలేక, ఎలాగయితేనేం ఓ కొత్త చొక్కా కుట్టించి యివ్వడానికి సిద్ధ పడ్డాడు.

కొత్తచొక్కా కొని పెడతానని తను అనగానే ఏనుగెక్కినంత సంబర పడి పోయేడు నారాయణ. తన మెడ చుట్టూ చేతులు వేసి, నడ్డి మీదకి ఎగబాకుతూ 'ఓరయ్య.. మరయితే నాకు బొమ్మల చొక్కా కొనియ్యాల... ఏం?' అనడిగేడు మురిపెంగా.

బొమ్మల చొక్కా అంటే వాడికున్న మోజు చూసి ముచ్చట వేసింది తనకి. ఆ తర్వాత వాడు రోజూ బొమ్మల చొక్కా గురించి అడగడమే...

గైరమ్మ తను పని చేసే యిళ్ళ వారినడిగి అడ్వాన్సుగా కొంత డబ్బు తెచ్చింది. ఈ లోగా కూలి డబ్బులు లోంచి అతికష్టం మీద మిగిల్చిన డబ్బులు జత చేసి, ఎలాగయితేనేం నారాయణ కోరిక యిన్నాళ్ళకి తీర్చగలిగేడు.

ఉదయం బడికి బయలు దేరుతూ, బొమ్మల చొకా వేసుకుని "అయ్యా ఎలా ఉంది?" అంటూ వెలిగి పోతున్న ముఖంతో తన ఎదుటికి వచ్చి అడిగేడు.

ఆ కొత్తచొక్కాలో నారాయణని చూసి నిజానికి తనకి కూడా ఎంతో సరదా వేసింది... నిక్కరు పాతదే అయినా, కొత్త బొమ్మల చొక్కా తళతళ మెరిసి పోతూ ఉండడంతో ఆ సంగతి మరుగున పడిపోయింది.

డబ్బు కట్టల బొమ్మలతో ఆ చొక్కా – వింతగా చూడ్డానికి ఎంతో బాగుంది. పదులు, ఏభైలు, వందలు కట్టలు కట్టలుగా బొమ్మల రూపంలో ఆ చొక్కానిండా కనిపిస్తున్నాయి.

బట్టల కొట్టు వాడు ఎన్నో రకాల బట్టల తాన్లు చూపించినప్పటికీ, తనకి డబ్బులు కట్టలు ముద్రించిన యీ బట్టే ఎంతో నచ్చింది.

'బేంకిల డబ్బంతా నీ వొంటి మీదే వుందిరయ్యా...' నవ్వుతూ నారాయణతో అన్నాడు.

ఆ మాటలకి కొడుకు ఉప్పొంగి పోయేడు. నడుస్తున్న బ్యాంకులా మహా గర్వంగా యిల్లంతా కలియ తిరిగేడు.

"నా బిడ్డ రాజా ! ఆడికేటి... పెద్దయితే యిలసింటి నోట్ల కట్టలు జేబిల నిండా ఉంటాయి. ఉప్పుడు డబ్బు కట్టల కొత్త జుబ్బా యేసుకుంతాడు అప్పుడు నోట్ల కట్టలు ఇనప్పెట్టిల నిండా మనకి సంపాయించి యిస్తడు" గైరమ్మ పొంగిపోతూ అంది.

ఆ మాటలతో నారాయణకి మరీ సంతోషం వేసింది. లోకంలో డబ్బంతా ఆ క్షణంలో తనొక్కడి స్వంతమే అయిపోయినట్టు ఉప్పొంగి పోతూ, తుళ్ళుతూ బడికి పరిగెట్టాడు.

"బళ్ళోంచి వచ్చేక ఆడికి దిష్టి తియ్యాలె..."

"అవును నానూ అదే అనుకుంతున్నాను.." కొడుకు వెళ్ళిన వేపే ఆపేక్షగా చూస్తూ అంది గైరమ్మ.

అంత అట్టహాసంగానూ, సంతోషంగానూ బడికి వెళ్ళిన నారాయణ – యింటికి జావ కారిపోయినట్టు రావడం వాళ్ళకి మతిపోయినట్టు చేసింది.

కొంచెం సేపు ఆ యిద్దరూ ఏమీ మాట్లడ లేక పోయేరు.

ఎంతో అపురూపంగా కుట్టించుకుని తొడుక్కున్న బొమ్మల చొకా, వాడికి అంతలోనే చేదు విషంలా ఎందుకు మారిపోయిందో వారికి అర్థం కావడం లేదు.

నారాయణ కళ్ళలో పెల్లుబుకుతున్న కన్నీటిని చూసి, వాళ్ళు చలించి పోయేరు.

కొండయ్య నారాయణ దగ్గరకి వెళ్ళి, చేత్తో తల నిమురుతూ, లాలనగా అడిగేడు : "ఏటయింద్రా.. అసలేటి జరిగింది సెప్పు ?" అని.

"మీ అయ్య దీన్ని తెచ్చినప్పుడు సేన బాగుందని సంబర పడనేదా ! పెందిల దాన్ని ఏసుకుంటూ, అబ్బోసి ఓ ఎలుగు ఎలిగిపోనేదా !.. అలసింటిది.. ఉప్పుడేటి యిలా.. ఆ బొమ్మల చొక్కా వొద్దంటే వొద్దని ఇసిరి కొడుతున్నావురొరే.. ఇదే సోద్దెమోలమ్మ..." గైరమ్మ కళ్ళు పెద్దవి చేసుకుంటూ అడిగింది నారాయణని.

వాడు కళ్ళెగరేసి, వాళ్ళ వేపు దుఃఖంతో ఉబ్బి పోయిన కళ్ళతో చూశాడే కానీ, వాళ్ళ ప్రశ్నకి జవాబు మాత్రం చెప్పలేదు.

ఏం జరిగిందో తెలుసుకుందామని, కొండయ్య గైరమ్మలు వాడ్ని నయానా భయానా అడిగి చూసేరు. కానీ లాభం లేకపోయింది. మోకాళ్లలో ముఖం దాచుకుని, ఓ మూల చేరి ఏడుస్తూ ఉండి పోయేడు. వాడు మరింక ఆ కొత్త బొమ్మల చొక్కా వేసుకోడని తేలి పోయింది.

తనకి ఆ బొమ్మల చొక్కా కుట్టించడం కోసం తల్లీ తండ్రీ దాదాపు నెల రోజులుగా ఒక్క పూటే తిండి తిన్నారని వాడికి తెలియదు.

అలాగే –

ఆ రోజు బళ్ళో మేష్టరు కొత్త పుస్తకం యింకా ఎందుకు కొనలేదని నారాయణని అడిగితే "మా కాడ డబ్బులు నేవండీ..." అని నారాయణ బదులు చెప్పేడనీ –

"రాస్కెల్... నీ చొక్కా నిండా డబ్బేరా ! పుస్తకం కొనడానికి మాత్రం డబ్బులు లేవూ?" అంటూ వెటకారంగా తిడుతూ బెత్తంతో యిష్టం వచ్చినట్టు మేష్టరు చితక బాదేడనీ – ఆ తల్లి దండ్రులకి తెలీదు ! చొక్కా మోజులో , పుస్తకం కొనుక్కోవాల్సి ఉందని వాడు యింట్లో చెప్పనే లేదు.

ఆ మర్నాడు – చిరిగి పోయిన పాత చొక్కా వేసుకుని, బడికి బయలు దేరాడు నారాయణ.

అప్పుడు వాడు...

నడుస్తున్న బ్యాంకు లాగా కాక – చిరిగి పోయిన నోటు లాగానో, చెల్లని సత్తు నాణెం లాగానో ఉన్నాడు.

★★★

*చింకి చొక్కా తొడుకో, కొత్త పుస్తకం కొనుక్కో – చైనా సామెత.*

★★★

.